# సువార్త ప్రసంగములు

## GOSPEL SERMONNETTES

( TELUGU )


Author

**J.C. CHOATE**

Translator :

**JOSHUA GOOTAM**



World Literature Publications

SATYA VANI

P.O. BOX. 80

KAKINADA, A.P. - 533 001

# సువార్త ప్రసంగములు

## GOSPEL SERMONNETTES

( TELUGU )


Author

**J.C. CHOATE**

Translator :

**JOSHUA GOOTAM**



World Literature Publications

SATYA VANI

P.O. BOX. 80

KAKINADA, A.P. - 533 001

# విషయసూచిక


1. బైబిలు దేవుని వాక్యమని నీవేల నమ్మవలెను 1
2. యేసుక్రీస్తు దేవుని కుమారుడని నీవేల నమ్మవలెను 4
3. దేవుని కుమారుడు 8
4. విగ్రహారాధన పాపము 13
5. క్రీస్తు యొక్క రక్తము 18
6. క్రీస్తు ఏల చనిపోయెను 23
7. క్రీస్తు సంఘమును గూర్చి నీవు ఎన్నడైనను విన్నావా ? 28
8. క్రీస్తు సంఘమనగా యేమి ? 32
9. క్రొత్త నిబంధన సంఘము 37
10. క్రీస్తు సంఘము ఇండియాలో ఎంతకాలము నిలుచును? 41
11. నాలుగు బైబిలు ప్రశ్నలు 46
12. క్రీస్తు సంఘమును నీ పట్టణములో గాని స్వగ్రామములో గాని ఎట్లు ఆరంభించవచ్చును? 50
13. క్రీస్తు నామము 54
14. నీవొక క్రైస్తవునిగా మాత్రము ఉండగలవు 58
15. క్రైస్తవ్యము నీకేమి చేయగలదు 62
16. క్రైస్తవులు కాని కొందరు 66
17. రక్షణ పొందుట యెట్లు ? 70

18. రక్షణ మార్గము 75
19. క్రీస్తు లోనికి మెట్లు 79
20. క్రొత్త జన్మ 84
21. క్రొత్త నిబంధన బాప్తిస్మము 88
22. బాప్తిస్మము యొక్క ప్రయోజనము 91
23. సిలువపై నున్న దొంగ 96
24. శిశు బాప్తిస్మము 100
25. ఒకడు తిరిగి బాప్తిస్మము పొందవలెనా ? 104
26. విశ్వాసము వలన కలుగు రక్షణ 107
27. క్రొత్త నిబంధన ఐక్యత 112
28. క్రొత్త నిబంధన ఆరాధన 117
29. వారములో మొదటి దినము 121
30. అమలులోనున్న చట్టము ఏది ? 125
31. పరిశుద్ధాత్మ పరిమాణములు 130
32. అన్య భాషలు 134
33. మత సంబంధ నామములు, బిరుదులు 139
34. స్వతంత్ర బోధకులు మరియు సంఘములు 144
35. క్రీస్తు రెండవ రాకడ 148

# 1. బైబిలు దేవుని వాక్యమని నీవేల నమ్మవలెను

(Why you should Believe the Bible to be the Word of God)

ప్రపంచమందంతటట కోట్ల కొలది ప్రజలు బైబిలు దేవుని వాక్యమని నమ్మదురు. ఇది ఒక గొప్ప సత్యమని వారు అంగీకరించెదరు. అయితే దానిని కొందరు శంకించెదరు. కొందరు పుట్టకనుండి వేరొక మార్గమున నడిపింపబడుటచే బైబిలును తిరస్కరించెదరు. నీవు పై నుదహరింపబడిన రెండు గుంపులలో ఏదో ఒకదానికి చెందిన వాడవైతే నీవు బైబిలు దేవుని వాక్యమని ఎట్లు నమ్మవచ్చునో క్లుప్తముగా వివరించెదను.

1. బైబిలు దేవుని వాక్యమని ఆరోపించుకొనుచున్నది. అది యెహోవా వాక్కు అని చెప్పబడెను (యిర్మి 14:1). మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగా పలికిరియని పేతురు చెప్పెను (2 పేతురు 1:21). క్రీస్తు పాత నిబంధనలోని వచనములను దేవుని మాటలని యెత్తి చూపించెను (యోహాను 10:35). ప్రతి లేఖనము దైవావేశము వలన కలిగెనని పౌలు చెప్పెను (2 తిమోతి 3:16, 17).

3. బైబిలు పురావస్తు శాస్త్ర పరిశోధనలచే యదార్థమని నిరూపింప బడుచున్నది. ఈ పరిశోధనల వలన క్రీస్తుకు పూర్వము వందలాది సంవత్సరములలో జరిగిన సంగతులను గూర్చి బైబిలు చెప్పునది యధార్థమని ఋజువైనది. బైబిలు చెప్పు జలప్రళయము వంటి కథలను శంకించిన వారు కొందరున్నారు. అయితే 1872 లో జార్జిస్మిత్ అనునతడు కనుగొనిన బబులోను రాతి పలకలు కూడ ఈ గొప్ప జలప్రళయాన్ని గూర్చి చెప్పుచున్నవి. ఇట్టి ఉదాహరణ లనేకములను మనమీయవచ్చును.

4. బైబిలు భూగోళశాస్త్రము ఏకీభవించుచున్నవి. అనేక పర్వతములు, నదులు, పట్టణములు ఈనాడు ఏయే పేర్లను కలిగి యున్నవో అవే పేర్లు బైబిలు నందు కూడ కనబడుచున్నవి. ఇందువలన బైబిలు నందు కల్పిత ప్రదేశము లేమియును లేవని గ్రహింపగుచున్నది.

5. బైబిలు, సామాన్య చరిత్ర ఈ రెండు ఒకటి మరొకదానిని నిరూపించుచున్నవి. బైబిలు నుడువుచున్న అనేక చారిత్రాత్మక సంగతులను గూర్చి మనమీనాడు సామాన్య చరిత్ర పుస్తకములలో కూడ వర్ణింపబడి యుండుట చూడగలము. బైబిలు గనుక కట్టుకథల గ్రంథమయినట్లయితే అది సత్యసంఘటనల నెట్లు పేర్కొనుచున్నది?

6. బైబిలునందున్న సంగతులనేకములు మానవజ్ఞానమునకు మించిన వైనందున, అవి మనుష్యుల వలన వ్రాయబడి యుండలేదు. దానిని మనుష్యులు మాత్రమే వ్రాసిన యెడల దానికంటె మిన్నయైన గ్రంథమీనాటికింకను ఎందుకు వెలువడలేదు ? నిజానికి మనుష్యులే దానిని వ్రాసినట్లయితే, దానికంటె శ్రేష్టమైన గ్రంథమీపాటికి యెవరో ఒకరు తప్పక వ్రాసియుందురు గదా !

7. బైబిలు గొప్ప ఏకీభావము గల గ్రంథము. దానిని 40 మంది వేర్వేరు వృత్తులు కలిగిన లేఖకులు వేర్వేరు ప్రదేశముల నుండి 1600 సంవత్సరముల వ్యవధిలో వ్రాసినను, అదంతయు ఒక పూర్ణసంపుటి వలే అమర్చబడినట్లున్నది. ప్రతి లేఖకుని దేవుడు నడిపించని యెడల ఇదెట్లు సాధ్యమగును ?

8. బైబిలు నందనేక ప్రవచనములుండుటయే గాక వాటి నెరవేర్పు కూడా అగుపడుచుననది. ఉదా : యోవేలు 2:28, 29లో ప్రభువు తన ఆత్మను కుమ్మరించు దినములను గూర్చి వ్రాయబడెను. అయితే అపొస్తలుల కార్యములు, 2వ అధ్యాయములో జరిగిన సంఘటన యోవేలు ద్వారా ముందుగ ప్రవచింపబడినదేయని పేతురు

చెప్పెను. పాత నిబంధనలో క్రీస్తును గూర్చిన అనేక ప్రవచనములు క్రొత్త నిబంధనలో నెరవేరెను. యెషయా 53:5 మరియు లూకా 22:63, 64 లను చదవండి.

9. కాల పరీక్షల నన్నిటి యందు బైబిలు జయించినందున అది దేవుని వాక్యమని నిరూపణయగుచున్నది. దానికనేక శత్రువులు లేకపోలేదు. అయితే వారి నందరిని అది జయించినది. అనేక శతాబ్ధముల నుండి అది భద్రపరచబడెను. మన భాషలో తర్జుమా చేయబడిన బైబిలును పురాతన ప్రతులతో సరిపోల్చి చూచిన అది మార్పు నొందలేదని ఋజువగుచున్నది.

10. గొప్ప మానవ సమస్యలకు బైబిలు జవాబిచ్చుచున్నది. మనుష్యుడు ఎక్కడనుండి వచ్చెను? వాని జీవనవిధి యేమి? అతడెక్కడికి వెళ్లుచున్నాడు? అను ప్రశ్నలకు బైబిలు మాత్రమే జవాబు చెప్పుచున్నది. మనుష్యుడు దేవునిచే చేయబడెను (అది 1:26, 27), తన సృష్టికర్తను మహిమ పర్చుటయే మానవ జీవనవిధి (1 పేతురు 4:11). అతడు తన నిత్యజీవితము నొకచోట తప్పక గడుపును (మత్తయి 25:46)

11. మనుష్యునిపై అన్ని గ్రంథముల కంటె బైబిలుకున్న ప్రభావ మెక్కువ. ఈ లోకమెంత చెడ్డదైనను, బైబిలును బట్టి మనుష్యుడు మంచివాడగుచున్నాడు.

12. బైబిలు ఎన్నడును గతించిపోదు. అట్లని క్రీస్తు యోహాను 12:48 లో చెప్పెను.

గనుక, నిజానికి బైబిలు దేవుని వాక్యమైయున్నది. అది దేవుని నుండి మనుష్యుని కీయబడినది. అది సత్యమై యున్నది. ఇహము నుండి పరలోకమునకు నడిపించు మార్గదర్శి అది. దానిని నమ్ముము. దాని బోధనలకు లోబడి అందున్న వాగ్దానముల ద్వారా దీవించబడుము. ఇప్పుడు నీవు కూడా బైబిలు దేవుని వాక్యమని నమ్ముచున్నావు గదా!

# ౨. యేసుక్రీస్తు దేవుని కుమారుడని నీవేల నమ్మవలెను

(Why you should Believe that Jesus Christ is the son of God)

యేసు ప్రభువు దేవుని కుమారుడని నీవు విశ్వసించని యెడల ఈ వ్యాసము నీకొరకై వ్రాయబడినది. యేసు సామాన్య మానవులకంటెను, ప్రవక్తల కంటెను మిన్నయైనవాడని సూచించుచు అనేక రుజువులున్నవి. సరిగదా ఆయన అన్ని విషయములలోను దేవుని కుమారుడైయుండెను. ఆయన నట్టి రీతిగా నీవంగీకరించు నిమిత్తము ఈ దిగువ అనేక కారణము లీయబడినవి.

1. యేసు ఆదినుండియు దేవునితో నుండెను. అదికాండము 1:26లో ఈ విధముగ నున్నది : "దేవుడు - మన స్వరూపమందు, మన పోలిక చొప్పున నరులను చేయుదము." "ఆదియందు వాక్యముండెను. వాక్యము దేవుని యొద్ద ఉండెను. వాక్యము దేవుడై యుండెను" అని యోహాను 1:1లో వ్రాయబడెను. ఆ వాక్యమే యేసుక్రీస్తు అని సూచింపబడెను (యోహాను 1:14).

2. యేసును గూర్చి ప్రవచనములలో పలుకబడెను. యెషయా 53లో క్రీస్తును గూర్చి అతివిశదముగ ప్రవక్త వివరించెను. అపొస్తలుల కార్యములు 8వ అధ్యాయములో నపుంసకుడొకడు యెషయా 53 చదువుట గమనించి ఫిలిప్పు నోరు తెరచి ఆ లేఖనముల ననుసరించి అతనికి యేసును గూర్చిన సువార్త ప్రకటించెను. దీనిని బట్టి యెషయా ముందుగనే క్రీస్తును గూర్చి ప్రవచించెనని గుర్తగుచున్నది. అట్టి ప్రవచనములనేకములు పాత నిబంధనలో గలవు.

3. యేసు ఒక కన్యకు జన్మించెను. అందువలన యేసుకు

భూసంబంధమైన తండ్రి లేడు. అయితే దేవుడు ఆయనకు తండ్రి. పరలోకమందున్న తన తండ్రిని వదలి ఆయన మనుష్య రూపము దాల్చి, తన్ను తాను తగ్గించుకొని ఒక కన్యగర్భమున అద్భుతరీతిగ జన్మించెను. ఇది కూడ ఆయన గూర్చి చెప్పబడిన ప్రవచనముల నెరవేర్పు (మత్త 1:18–25 యెష 7:14).

4. యేసు ఒక పరిపూర్ణ మానవుడు. ఏ పాపమును లేక పవిత్ర జీవితమును జీవించిన మానవుడాయన ఒక్కడు మాత్రమే. క్రీస్తు యొక్క అడుగు జాడలయందు మనమును నడుచుకొనవలయును. ఆయన పాపము చేయలేదు. ఆయన నోటను ఏ కపటమును కనబడలేదు అని పేతురు చెప్పెను (1 పేతురు 2:21, 22). పాపములేని జీవితమును బట్టి పాపుల కొరకు ఆయన బలిచేయబడి ఈ లోకమునకు నిరీక్షణ నొసంగెను (యోహాను 3:5).

5. ప్రవచనములను నెరవేర్చుట కొరకు యేసు వచ్చెను. “ధర్మశాస్త్ర మునైనను, ప్రవక్తల వచనములనైనను కొట్టివేయవచ్చితినని తలంచవద్దు నెరవేర్చుటకే గాని, కొట్టివేయుటకు నేను రాలేదు” అని యేసు చెప్పెను (మత్తయి 5:17).

6. యేసు అనేక అద్భుతములను చేసెను. ఆయన రోగులను బాగుచేసెను. చెవిటివారు వినునట్లును, మూగవారు మాట్లాడునట్లును, కుంటివారు నడువగల్గునట్లును, చనిపోయినవారు లేవగల్గునట్లును ఆయన చేసెను. ఆయన అన్నిరకముల రోగములను బాగుచేసెను. జన సమూహముల కాహారమును అద్భుతముగ నిచ్చెను. నీటి మీద నడచెను. అనేకులు ఆయన చేసిన సూచక క్రియలను చూచి ఆయన నామమందు విశ్వాసముంచిరి (యోహాను 1:23).

7. యేసు దేవుని కుమారుడని ఆయన శిష్యులు ఒప్పుకొనిరి. "నీవు సజీవుడవగు దేవుని కుమారుడవైన క్రీస్తువు" అని పేతురు ఆయనను గూర్చి ఒప్పుకొనెను (మత్తయి 16:16). అనేకులాయనను ఒప్పుకొనిరి.

8. యేసు దేవుని కుమారుడని దయ్యములు కూడ ఒప్పుకొనెను. దయ్యములు నీవు దేవుని కుమారుడవని కేకలు వేసి అనేకులను వదలి పోయెను. ఆయన క్రీస్తు అని వాటికి తెలిసియుండెను. గనుక ఆయన వాటిని గద్దించి వాటిని మాట్లాడనీయలేదు (లూకా 4:41).

9. అనేకులు యేసును దేవుని కుమారుడని చెప్పిరి. "నేను దేవుని కుమారుడనని చెప్పినందుకు, తండ్రి ప్రతిష్ట చేసి ఈ లోకములోనికి పంపిన వానితో నీవు దేవదూషణ చేయుచున్నావని చెప్పుదురా ?" (యోహాను 10:36).

10. యేసు దేవుని కుమారుడని ఋజువుపరచెను. దేవుని కుమారుడు మహిమపరచబడునట్లు ఆయన చనిపోయిన లాజరును బ్రతికించెను (యోహాను 11:44).

11. యేసు తన కుమారుడని దేవుడు ఒప్పుకొనెను. "ఈయన నా ప్రియకుమారుడు, ఈయన యందు నేనానందించుచున్నాను. ఈయన మాటలను వినుడి" (మత్తయి 17:5).

12. యేసు మృతులలో నుండి పునరుత్థానుడయ్యెను. ఆయన మృతులలో నుండి పురుత్థానుడైనందున, పరిశుద్ధమైన ఆత్మను బట్టి దేవుని కుమారుడుగా ప్రభావముతో నిరూపింపబడెనని చెప్పబడెను (రోమా 1:7).

13. యేసునందు విశ్వాసముంచెడివారికి ఆయన జీవమిచ్చును. "యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును యివి వ్రాయబడెను" (యోహాను 20:31)

14. యేసు మరల రాబోవు చున్నాడు. "నేను మరల వచ్చి నా యొద్ద నుండుటకు మిమ్మును తీసికొనిపోవుదును" అని ఆయన చెప్పెను (యోహాను 14:3).

15. యేసు దేవుని కుమారుడని సామాన్య చరిత్ర కూడ నిరూపించు చున్నది.

16. యేసు నిన్న, నేడు నిరంతరము జీవించువాడై యున్నాడు. యేసును గూర్చిన అనేక ఋజువుల నిక్కడ వ్రాయుటకు నిజానికి స్థలము చాలదు. అయితే పైనుదహరించిన వాటిని నీవు పరిశీలించుము. యేసు ప్రభువు దేవుని కుమారుడని నీవు నమ్ముచున్నావా ? అయితే ఆయనను ఒప్పుకొనుము (మత్త 10:32). ఆయన నీ రక్షకుడగునట్లును, ఆయన ద్వారా నిత్యజీవపు నిరీక్షణ నొందగల్గునట్లును, ఆయనకు నీవు లోబడుము (అపొ.కా. 2:38 మార్కు 16:16; కొలస్స 1:27).

# 3. దేవుని కుమారుడు

(The Son of God)

యేసుక్రీస్తు దేవుని కుమారుడని బైబిలు విపులముగ బోధించు చున్నది. అయితే కొందరు దీనిని అంగీకరించలేమని భావింతురు. దానిని ప్రశ్నించి కాదందురు. అయితే దీనిని మానవ స్థాయిలో గ్రహించ ప్రయత్నించుటలో వారు కొన్ని సమస్యలనెదుర్కొందురు. "దేవునికి కుమారుడెట్లుండగలడు"? అని వారు అడుగుదురు. "దేవునికి కుమారుడు న్నట్లయితే, ఆయనకు భార్య కూడ ఉన్నదని" వారు ఆలోచింతురు. ఇదంతయు ఒక అసంగత సంఘటనయని వారు సూక్ష్మీకరించి వదలివేయుదురు. అయితే ఈ సంగతిని తిరిగి తెరచి అందలి వాస్తవములను తరచుదుము.

దేవుని కుమారుడు అను భావమును బైబిలు ఎట్టి సందర్భాలలో వ్యక్తపరచు చున్నదో ఒకసారి పరిశీలించుదము.

1. దేవుడు మనుష్యుని సృజించినందువలన భౌతికంగా అందరూ దేవుని కుమారులే. దీనిని ఆదికాండము 6:2 వ్యక్తపరచుచున్నది. మనుష్యులు దేవుని సంతానమై యున్నారు (అపొ.కా. 17:8). గనుక ఒకడు మంచివాడైనను, చెడ్డవాడైనను, దేవుని సేవించినను, సేవించకపోయినను, అతడు దైవసృష్టి గనుక ఈ లోకంలో అతడు దేవుని కుమారుడే. అయితే పాపము చేయుటచే తన సృష్టికర్తనుండి తొలగిపోయిన స్థితిలో యున్నందున అతడు విమోచింపబడి తిరిగి తీసికొని రాబడవలెను (ఎఫెసీ 2:16 కొల 1:14).

2. ఇశ్రాయేలు జనాంగము తన కుమారుడని దేవుడు చెప్పెను.

ఇది నిజమే ఎందుకనగా - భౌతికముగాను, ఆత్మీయముగాను వారు ఆయన ఏర్పరచుకొనిన ప్రజలు. "అప్పుడు నీవు ఫరోతో - ఇశ్రాయేలు నా కుమారుడు, నా జ్యేష్టపుత్రుడు. నన్ను సేవించునట్లు నా కుమారుని పోనిమ్మని నీకు ఆజ్ఞాపించుచున్నాను నీవు పంపనొల్లనియెడల యిదిగో నేను నీ కుమారుని, నీ జ్యేష్టపుత్రుని చంపెదని యెహోవా సెలవిచ్చుచున్నాడని అతనితో చెప్పుమనెను" (నిర్గమ 4:23, 24).

3. దైవాజ్ఞలకు లోబడుటద్వారా ఒకడు ఆత్మీయముగా దేవుని కుమారుడగును. "దేవుని ఆత్మచేత ఎందరు నడిపింప బడుదురో వారందరు దేవుని కుమారులై యుందురు" (రోమా8:24). "మరియు నేను చెప్పునదేమనగా, వారసుడు అన్నిటికిని కర్తయైయున్నను, బాలుడై యున్నంత కాలము అతనికిని, దాసికిని ఏ భేదము లేదు. తండ్రిచేత నిర్ణయింపబడిన దినము వచ్చువరకు అతడు సంరక్షకుల యొక్కయు, గృహనిర్వాహకుల యొక్కయు అధీనములో ఉండును. అటువలె మనమును బాలురమై యున్నప్పుడు లోకసంబంధమైన మూల పాఠములకు లోబడి దాసులమై యుంటిమి. అయితే కాలము పరిపూర్ణమైనప్పుడు దేవుడు తన కుమారుని పంపెను ఆయన స్త్రీ యందు పుట్టి మనము దత్తపుత్రులము కావలెనని ధర్మశాస్త్రమునకు లోబడినవాడాయెను. మరియు మీరు కుమారులై యున్నందున నాయనా, తండ్రీ అని మొర్రపెట్టు తన కుమారుని ఆత్మను దేవుడు మన హృదయములోనికి పంపెను. కాబట్టి నీవిక దాసుడవు కావు కుమారుడవే. కుమారుడవైతే దేవుని ద్వారా వారసుడవు" (గలతీ 4:1-7). కుమారులై యున్నందున మనము దేవుని పిల్లలము. ఇది వినుడి: "యేసు క్రీస్తు నందు మీరందరు విశ్వాసమువలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తు లోనికి బాప్తిస్మము పొంది మీరందరు

క్రీస్తును ధరించు కొనియున్నారు (గలతీ 3:26, 27). "కావున మీరు ప్రియులైన పిల్లలవలె దేవుని పోలినడుచుకొనుడి" (ఎఫెసీ 5:10). "దీనిని బట్టి దేవుని పిల్లలెవరో, అపవాది పిల్లలెవరో తేటబడును. నీతిని జరిగించని ప్రతివాడును, తన సహోదరుని ప్రేమింపని ప్రతివాడును దేవుని సంబంధులు కారు" (1 యోహాను 3:10). "మనము దేవుని ప్రేమించుచు ఆయన ఆజ్ఞలను నెరవేర్చు వారమైతిమా దేవుని పిల్లలను ప్రేమించుచున్నామని దానివలననే యెరుగుదుము" (1 యోహాను 5:2).

4. యేసు దేవుని కుమారుడని ఒక ప్రత్యేక భావము చొప్పున, వ్యక్తిగత రీతిగ, తండ్రి కుమారుల సంబంధము చొప్పున పలుకబడెను. మొదటిగా దేవుడే, క్రీస్తు తన కుమారుడని సాక్ష్యమిచ్చెను. "ఇదిగో ఈయనే నా ప్రియ కుమారుడు, ఈయన యందు నేనానందించు చున్నానని యొక శబ్ధము ఆకాశమునుండి వచ్చెను" (మత్తయి 3:17). "ఈయన నా కుమారుడు. ఈయన యందు నేనానందించుచున్నాను. ఈయన మాటలను వినుడి" యని మరల దేవుడే క్రీస్తును గూర్చి పలికెను (మత్తయి 17:5). క్రీస్తు సజీవుడైన దేవుని కుమారుడని పేతురు ఒప్పుకొనెను (మత్తయి 16:16). ఈ లోక పాప నివారణ కొరకు దేవుడు తన స్వంత కుమారుని పంపెనని బోధింపబడెను (అపొ.కా. 9:20). ఇట్టి వచనము లనేకములను మనము చూడగలము గాని యివియే చాలును.

గనుక క్రీస్తు దేవుని కుమారుడెట్లాయెను? ఆయన ఆది నుండియు దేవుడై యుండెను. "ఆదియందు వాక్యముండెను. వాక్యము దేవుని యొద్ద ఉండెను వాక్యము దేవుడై యుండెను" (యోహాను 1:1,2). సృష్టి జరిగించుటలో ఆయన పాలు పొందెను. మనుష్యుని మన

స్వరూపము చొప్పున చేయుదమని దేవుడు పలికెను. "దేవుడు ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను. ఆయన కుమారుని సమస్తమునకును వారసునిగా నియమించెను. ఆయన ద్వారా ప్రపంచములను నిర్మించెను" (హెబ్రీ 1:2). "సమస్తమును ఆయన మూలముగా కలిగెను. కలిగియున్న దేదియు ఆయన లేకుండ కలుగలేదు" అని యోహాను వ్రాసెను (యోహాను 1:3).

త్రిత్వమైయున్న దేవుని యందు తండ్రి, కుమార, పరిశుద్ధాత్మలను వారిలో క్రీస్తు ఒక భాగమైయున్నాడు. (మత్తయి 28:20). క్రీస్తును గూర్చి పౌలు యిట్లు పలికెను : "ఏలయనగా దేవత్వము యొక్క సర్వ పరిపూర్ణత శరీరముగా క్రీస్తునందు నివసించుచున్నది. మరియు ఆయన యందు మీరును సంపూర్ణులై యున్నారు : ఆయన సమస్త ప్రధానులకును, అధికారులకును శిరస్సైయున్నాడు" (కొల 2:9, 10). రోమా 1:20 కూడా చదువుము.

దేవుడు ఆత్మయై ఎట్లుండునో, అట్లు క్రీస్తు కూడా ఆత్మలో దేవునితో కూడా ఉండెను. కాలము పరిపూర్ణమయినపుడు, వాగ్ధానము చేయబడిన రీతిగ ఆయన తండ్రిని విడిచి ఈ లోకమున కేతెంచి, కన్య మరియ గర్భమునబుట్టి, మనుష్య రూపము దాల్చి, ఈ లోక పాపముల కొరకు సిలువపై మరణమొంది, సమాధి చేయబడి, తిరిగి లేచి పరమందున్న తన తండ్రి యొద్ద కేగి నేటికింకను ఆయన యొద్ద క్రీస్తు ఆసీనుడై యున్నాడు. (మత్త 1:21 యోహా 3:17 గలతీ 4:1 యోహా 4:9:1 యోహాను 4:41 1 కొరింథీ 15:1-4 అపొ.కా. 2 అధ్యా).

ఆది నుండియు క్రీస్తు దేవునితో యున్నను, నిత్యుడైనను, దైవమూర్తి అయినను, దైవత్వము కలిగియున్నను, ఆయన తండ్రియైన దేవుడు కాడు. దేవుడొక్కడే. క్రీస్తు ప్రభువు ఒక్కడే. ఆత్మయు ఒక్కడే (ఎఫెసీ 4:1-6).

వారొక్కక్కరే అయినను, ముగ్గురైయున్నారు. ప్రతి ఒక్కరికి వ్యక్తిత్వము కలదు. వారు చేయు పనులు కలవు. త్రిత్వమైన దేవునిలో వీరు భాగములైయున్నారు.

దేవుడొక కుమారుని కలిగియుండడు అని చెప్పిన యెడల దేవుని శక్తిని మనము అదుపులో యుంచినట్లగును. దీనిని మనము చేయలేము. దీనిని మనము సంపూర్తిగ గ్రహించుకొనలేకపోవచ్చును. అయితే దేవుని మనము సంపూర్తిగా గ్రహించలేము. దేవుడు, ఆయన కుమారుడు దైవములు, మనము మానవులము. విశ్వాసమును బట్టి అంగీకరించవలసిన వాటిని మనము గ్రహించలేము. ఈ సంగతులను గూర్చి ఊహించుట మనవశము కాదు. అన్ని సంగతులు దేవుని సూచించుచున్నవి. ఆయన తన వాక్యమును మన కిచ్చెను ఆ వాక్యములో తన కుమారుని మనకు బయలుపరచెను. యేసు దేవుని కుమారుడని నిరూపించు అనేక సత్యములు, ఋజువులున్నవి. అందువలననే “మీరు దేవుని యందు విశ్వాసముంచుచున్నారు. నాయందును విశ్వాసముంచుడి” యని ఆయన చెప్పెను (యోహాను 14:1). అవును మనము తప్పక ఆయన యందు విశ్వాస ముంచగలము, ఉంచవలెను కూడ. లేని యెడల మనము మన పాపములోనే యుండి చనిపోవుదుము (యోహాను 8:24).

# 4. విగ్రహారాధన పాపము

(The Sin of Idolatry)

దేవుని గాని, దేవతను గాని సూచించుచు చెక్కతో గాని రాతితో గాని లేదా ఏదైనా లోహముతో గాని చేయబడిన ప్రతిమా స్వరూపము విగ్రహమగును. అది మనుష్యుని రూపములో చేయబడవచ్చును. లేదా ప్రకృతిలో దేనినైనా సూచింపవచ్చును లేదా ఒకని సమయమును, పూజను కోరుచున్నట్టిదేదయినను అయి ఉండవచ్చును. విగ్రహారాధన పురాతనము నుండి ఎంత పాతదైయున్నదో, ఆధునికముగా అంత క్రొత్తదైయున్నది. అది అనేక విధములుగ మారవచ్చును. అయినను అది నిజదేవునికి చేయు ఆరాధన కానందున అది పాపము వలె పరిగణింపబడుచున్నది.

విగ్రహములను గూర్చి బైబిలు ఈ విధముగ చెప్పుచున్నది : "పైన ఆకాశమందే గాని, క్రింద భూమి యందే గాని, భూమి క్రింద నీళ్ళయందే గాని యుండు దేని రూపము నయినను, విగ్రహము నయినను నీవు చేసికొన కూడదు వాటికి సాగిల పడకూడదు, వాటిని పూజింపకూడదు. ఏలయనగా నీ దేవుడనైన యెహోవానగు నేను రోషముగల దేవుడను" (నిర్గమ 20:4, 5). "కాబట్టి ఇశ్రాయేలీయులకు నీవు ఈ మాట చెప్పుము ప్రభువగు యెహోవా సెలవిచ్చునదేమనగా – మీ విగ్రహములను విడిచి పెట్టి మీరు చేయు హేయ కృత్యములన్నిటిని మాని మనస్సు త్రిప్పుకొనుడి" (యెహెజ్కేలు 14:6).

క్రొత్త నిబంధన లేఖకులిట్లు వ్రాసిరి : "కాబట్టి అన్యజనులలో నుండి దేవునివైపు తిరుగుచున్నవారిని మనము కష్టపెట్టక,

విగ్రహసంబంధమైన అపవిత్రతతను, జారత్వమును గొంతు పిసికి చంపిన దాని రక్తమును విసర్జింపవలెను" (అపొ.కా. 15:19, 20). "చిన్న పిల్లలారా, విగ్రహముల జోలికి పోకుండ జాగ్రత్తగా ఉండుడి" (1 యోహాను 5:21).

దైవావేశ లేఖకులు విగ్రహములను గూర్చియు, వాటి ఆరాధనను గూర్చియు ఉన్న సంగతుల నిట్లు వ్రాసిరి : "వారి దేశము విగ్రహములతో నిండియున్నది. వారు తమ చేతి పనికి, తాము వ్రేళ్ళతో చేసిన దానికి నమస్కారము చేయుదురు. అల్పులు అణగద్రొక్క బడుదురు, ఘనులు తగ్గింపబడుదురు. కాబట్టి వారిని క్షమింపకుము" (యెష 2:8,9). "విగ్రహములు నిష్ప్రయోజనములు. తామే అందుకు సాక్షులు. వారు గ్రహించువారు కారు, ఎరుగువారు కారు గనుక వారు సిగ్గుపడరు. ఎందుకు పనికిరాని విగ్రహమును పోతపోసి దానినొక దేవునిగా నిరూపించువాడెవడు? ఇదిగో దానిని పూజించు వారందరు సిగ్గుపడుదురు. ఆ శిల్పకారులు నరమాత్రులే గదా ? వారందరు పోగుచేయబడి నిలువబడవలెను. నిశ్చయముగా వారు భయపడి సిగ్గుపడుదురు. కమ్మరి గొడ్డలి పదును చేయుచు నిప్పులతో పనిచేయును. అతడు ఆకలిగొనగా అతని బలము క్షీణించిపోవును. నీళ్ళు త్రాగక సొమ్మసిల్లును. వడ్లవాడు నూలువేసి చీర్ణముతో గురుతుపెట్టి దానిని నిరూపించును. మందిరములో దానిని స్థాపించవలెనని నరరూపముగల దానిగాను నరసౌందర్యముగల దానిగాను చేయును. ఒకడు దేవదారు చెట్లను నరకవలెనని పూనుకొనును. శ్మశాన వృక్షమును గాని, సరళ వృక్షమునుగాని, సింధూర వృక్షమునుగాని, అడవి వృక్షములలో ఏదో ఒక దానిని తీసికొనును. ఒకడు చెట్టు నాటగా వర్షము దానిని పెంచును. ఒకడు

పొయ్యి కట్టెలకు వాటినుపయోగించును. వాటిలో కొంత తీసికొని చలి కాచుకొనును, నిప్పురాజబెట్టి రొట్టె కాల్చుకొనును. ఒకడు తుండు తీసికొని దానితో ఒక దేవతను చేసికొనును. దానికి నమస్కారము చేయును. దానితో ఒక విగ్రహము చేసి దానికి సాగిలపడును. అగ్నితో సగము కాల్చియున్నాడు. కొదువ సగముతో మాంసము వండి భక్షించియున్నాడు. తిని తృప్తి పొందగా చలి కాచుకొనుచు ఆహా, చలి కాచుకొంటిని, వెచ్చగా ఉన్నది అని అనుకొనుచున్నాడు. దానిలో మిగిలిన భాగముతో తనకు దేవతగానున్న విగ్రహము చేయించు కొనును. దాని యెదుట సాగిలపడి నమస్కారము చేయుచు – నీవే నా దేవుడవు. నన్ను రక్షింపుమని ప్రార్థించును. వారు వివేచింపరు. చూడకుండునట్లు వారి కన్నులు కప్పబడెను. గ్రహింపకుండునట్లు వారి హృదయములు మూయబడెను. ఎవడును ఆలోచన చేయడు. నేను అగ్నిలో సగము కాల్చితిని, నిప్పుల మీద వేసి, రొట్టె కాల్చితిని, దానితో మాంసము వండుకొని భోజనము చేసితిని. మిగిలిన దానిని తీసికొని దానితో హేయమైన దానిని చేయుదునా ? చెట్టు మొద్దుకు సాష్టాంగ పడుదునా ? అని యెవడును ఆలోచింపడు. యోచించుటకు ఎవనికిని తెలివిలేదు. వివేచన లేదు. వాడు బూడిదె తినుచున్నాడు. వాని మనస్సు మోసపోయినదై తప్పుదారిని వానిని తీసికొని పోవుచున్నది. వాడు తన ఆత్మను రక్షించుకొనజాలడనియు, నా కుడిచేతిలో అబద్ధమున్నది గదా అనియు అనుకొనుటకు వానికి బుద్ధి చాలదు" (యెషయా 44:9–20).

అట్టివారి బుద్ధిహీనతను బయలుపరచుచు దావీదు యిట్లు వ్రాసెను "మాకు కాదు. యెహోవా మాకు కాదు. నీ కృపా సత్యములను బట్టి నీ నామమునకు మహిమ కలుగును గాక. వారి

దేవుడేడి అని అన్యజనులెందుకు చెప్పుకొందురు ? మా దేవుడు ఆకాశమందున్నాడు. తన కిచ్ఛ వచ్చినట్లుగా సమస్తమును ఆయన చేయుచున్నాడు. వారి విగ్రహములు వెండి బంగారువి. అవి మనుష్యుల చేతి పనులు. వాటికి నోరుండియు పలుకవు, కన్నులుండియు చూడవు. చెవులుండియు వినవు. ముక్కులుండియు వాసన చూడవు. చేతులుండియు ముట్టుకొనవు. పాదములుండియు నడువవు. గొంతుకతో మాటలాడవు. వాటిని చేయువారును, వాటియందు నమ్మికయుంచు వారందరును వాటి వంటివారై యున్నారు" (కీర్తన 115:1–8).

క్రొత్త నిబంధనలో మరల యీలాగు వ్రాయబడి యున్నది : "పౌలు ఏథెన్సులో వారి కొరకు కనిపెట్టుకొని యుండగా, ఆ పట్టణము విగ్రహములతో నిండియుండుట చూచినందున అతని ఆత్మ పరితాపము పట్టలేకపోయెను" (అపొ.కా. 17:18). "పౌలు అరేయొపగు మధ్య నిలిచి చెప్పినదేమనగా – ఏథెన్సు వారలారా, మీరు సమస్త విషయములలో అతి దేవతా భక్తి గలవారైయున్నట్లు నాకు కనబడుచున్నది. నేను సంచరించుచు మీ దేవతా ప్రతిమలను చూచుచుండగా ఒక బలిపీఠము నాకు కనబడెను. దానిమీద – తెలియబడని దేవునికి అని వ్రాయబడియున్నది. కాబట్టి మీరు తెలియక దేనియందు భక్తి కలిగియున్నారో దానినే నేను మీకు ప్రచురపరచు చున్నాను" (అపొ.కా. 17:22, 23). జగత్తును అందలి సమస్తమును నిర్మించిన దేవుడు హస్తకృతములైన ఆలయములలో నివసింపడనియు తనకు ఏదైనా కొదువ యున్నట్టు ఆయన మనుష్యుల చేతులతో సేవింపబడు వాడు కాదనియు అట్టి నిజదేవుని తాను సేవించు చున్నాడనియు పౌలు వారికి చెప్పెను. మరొక సందర్భములో

అతడిట్లనెను : "కాబట్టి విగ్రహము వట్టిదనియు ఒక్కడే దేవుడు తప్ప వేరొక దేవుడు లేడనియు ఎరుగుదుము దేవతలనబడిన వారును, ప్రభువులనబడిన వారును అనేకులున్నారు. ఆకాశమందైనను భూమి మీదనైనను దేవతలనబడినవి యున్నను, మనకు ఒక్కడే దేవుడున్నాడు. ఆయన తండ్రి ఆయన నుండి సమస్తమును కలిగెను ఆయన నిమిత్తము మనమున్నాము. మరియు మనకు ప్రభువు ఒక్కడే. ఆయన యేసుక్రీస్తు. ఆయన ద్వారా సమస్తమును కలిగెను మనము ఆయన ద్వారా కలిగినవారము" (1 కొరింథీ 8:4-6).

కనుక బైబిలు విగ్రహారాధనను ఖండించుచున్నది. సరిగదా విగ్రహారాధికులు, అబద్ధికులు మొదలగు వారందరును అగ్ని గంధకములతో మండు గుండములో (నరకములో) పాలు పొందుదురని చెప్పుచున్నది (ప్రకటన 2:18). బైబిలును బట్టియు, ప్రకృతిని బట్టియు, మనకీయబడిన లోక జ్ఞానమును బట్టియు ఒక్కడే దేవుడున్నాడని మనము గ్రహించగలము (ఎఫెసీ 4:6). దేవుడొక్కడే. ఆత్మయు ఒక్కడే (యోహా 4:44) ఆయనను మాత్రమే మనము సేవింపవలయును (1 థెస్స 1:9).

# 5. క్రీస్తు యొక్క రక్తము

(The Blood of Christ)

మనుష్యుడు దేవునితో సహవాసము చేయుటలో రక్తము ఎల్లప్పుడు ఒక ముఖ్యపాత్రను వహించినది. పాత నిబంధన కాలంలో పశుబలులర్పింపబడుటలో ఈ సంగతి సత్యమైనది. అయితే ఈ బలులు పాపమును సంపూర్తిగా తీసివేయలేక పోయెను. "ఏలయనగా ఎడ్ల యొక్కయు, మేకల యొక్కయు రక్తము పాపములను తీసివేయుట అసాధ్యము" అని హెబ్రీ 10:4లో వ్రాయబడెను. పశువుల రక్తము పాపములను తీసివేయలేనిచో మనుష్యుడు రక్షింపబడుటెట్లు ? క్రొత్త నిబంధనలో మనము చూచినట్లయితే ప్రతి పాపియు క్రీస్తు రక్తము నందు కడిగి రక్షింపబడగల్గునట్లు ఆయన రక్తము ఒక్క మారే చిందింపబడవలెనని తెలియుచున్నది. గనుక నేటి పాఠము దీనితో ఆరంభమగుచున్నది.

మనుష్యుడు పాపియైనందున తన్ను తానే రక్షించుకొనజాలడు. పౌలు ఇట్లు చెప్పుచున్నాడు : "అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు : ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను" (రోమా 5:8). 1 కొరింథీ 5:3 లో క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతి చెందెనని అతడు చెప్పెను. ఈ మృతిని ఆయన సిలువపై పొందెను (ఫిలిప్పి 2:8). ఆయన మరణములో తన రక్తమును చిందించెను. దాని ద్వారా మనము పాప క్షమాపణ నొందగలుగుదుము. అయితే ఆయన చిందించిన రక్తమును మనమెట్లు తాకగలము అను ప్రశ్న మనకు ఉద్భవించును. విశ్వాసము వలన అట్లు చేయగలము అని అనేకమంది

భక్తులు చెప్పుదురు. అవును. విశ్వాసమొక అత్యవసరమైన భాగము. అయితే విశ్వాసమెుక్కటే మాత్రమే చాలదు. లేఖనములను చదువుచుండగ మన మాయనకు విధేయత చూపించవలెనని గ్రహించగలము (హెబ్రీ 5:8–9). మనము వాక్యమును బట్టి నడుచు కొనువారముగను (యాకో 1:23), ఆయన ఆజ్ఞలను గైకొను వారముగ నుండవలెను (యోహా 14:15). గనుక మనమాయనకు విధేయుల మైనప్పుడు ఆయన రక్తము దరికి చేరగలమని గ్రహింపవుచున్నది. ఇప్పుడు మనమేమి చేయవలెనని ఆయన ఆజ్ఞాపించుచున్నాడు ? కొన్ని వచనముల నిప్పుడు గమనించుదాం : ఆయన ఇట్లు చెప్పెను: "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును నమ్మని వానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:16). ఒకడు నమ్మి బాప్తిస్మము పొందుట వలన రక్షింపబడునని క్రీస్తు చెప్పినందున ఆయనకు లోబడుట ద్వారా అతడు ఆయన రక్తము దరికి చేరి తన పాపముల నుండి కడిగివేయబడుని మనము సంగ్రహింపవచ్చును. పాపులైన జనసమూహమునకు పేతురిట్లు చెప్పెను. "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" (అపొ.కా. 2:38). మరల ఒకడు పాపక్షమాపణ నొందవలె నంటే మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందవలెనని గ్రహించుచున్నాము.

క్రీస్తు ఒక పరిపూర్ణ బలియాగముగా తన్ను తాను అర్పించుకొనెను. మనుష్యుడు పాప విముక్తుడగునట్లు ఆయన తన రక్తమును చిందించెను. గనుక ఆయన ఇచ్చు ఈ ఆజ్ఞలకు లోబడుట ద్వారా ఆయన రక్తమును తాకి మానవుడు విముక్తి నొందవచ్చును.

పౌలు మార్పు నొందినప్పుడు అతనికిట్టి ఆజ్ఞ ఇయ్యబడెను : "గనుక నీవు తడవు చేయుట ఎందుకు ? లేచి ఆయన నామమున బట్టి ప్రార్థన చేసి బాపిస్మము పొంది నీ పాపములను కడిగి వేసుకొనుము". విశేషము నీటిలో లేదుగాని ఆయనకు లోబడుటలో యున్నది. అట్లు ఒకడు ప్రభువుకు విధేయుడగుటచే ఆయన రక్తము అతని పాపములను కడిగివేయును. ఇది బహు సూక్ష్మమైనది.

రోమా 6:3–6లో అపొస్తలుడైన పౌలు ఇట్లనుచున్నాడు : "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణము లోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా ? కాబట్టి తండ్రి మహిమ వలన క్రీస్తు మృతులలో నుండి యేలాగు లేపబడెనో అలాగే మనమును నూతన జీవము పొందినవారమై నడుచుకొనునట్లు మనము బాప్తిస్మము వలన మరణములో పాలు పొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి. మరియు ఆయన మరణము యొక్క సాదృశ్యమందు ఆయనతో ఐక్యము గలవారమైన యెడల ఆయన పునరుత్థానము యొక్క సాదృశ్యమందును ఐక్యముగలవారమై యుందుము. ఏమనగా మనమింకను పాపమునకు దాసులము కాకుండుటకు పాప శరీరము నిరర్థకమగునట్లు మన ప్రాచీన స్వభావము ఆయనతో కూడ సిలువ వేయబడెనని యెరుగుదుము".

ఇప్పుడతడేమి చూపించుచున్నాడు ? మన విధేయత ద్వారా ఆయన మరణములో పాలివారమవుదుమని చెప్పుచున్నాడు. ఆయన మరణము ద్వారా కలిగిన మేలులను విధేయత ద్వారా మనము పొందవచ్చును. మనము క్రీస్తు రక్తము దరికి చేరి దాని ద్వారానే కడుగ బడుదుము. ఆయన రక్తము వలన మన అపరాధములకు క్షమాపణ కలిగియున్నదని ఎఫెసీ 1:7లో వ్రాయబడియున్నది.

మనము పాపక్షమాపణ నొందు నిమిత్తము ఆయన రక్తము చిందింపబడెనని క్రీస్తే మత్తయి 26:28 లోను, చెప్పెను. ఈ వచనముల ద్వారా అపొస్తలుల కార్యములు 2:38 లోను మార్కు 16:16లోను బోధింపబడిన పాపక్షమాపణ, రక్షణలు గుర్తుకువచ్చు చున్నవి. ఈ ఆజ్ఞలకు లోబడుట ద్వారా మనము మనము క్రీస్తు రక్తము దరికి చేరి కడుగబడుదుము. ఇది తప్ప వేరొక మార్గ మేమియును లేదు.

ఇప్పుడు క్రీస్తు రక్తము గూర్చి మరికొన్ని సంగతులను గమనించుదాం:

1. క్రొత్త నిబంధన క్రీస్తు రక్తము వలన ముద్ర వేయబడినది (మత్తయి 26:28)
2. క్రీస్తు రక్తము యూదులకును, అన్యజనులకును మధ్యనున్న గోడను పగులగొట్టెను (ఎఫెసీ 2:13, 14).
3. ఆయన రక్తము వలన మనము నీతిమంతులముగా తీర్చబడుచున్నాము. (రోమా 5:9).
4. ఆయన రక్తము ద్వారా విమోచన కలుగుచున్నది (కొలస్స 1:14).
5. సంఘము ఆయన రక్తముచే సంపాదించబడెను. (అపొ.కా. 20:28).
6. ఆయన సిలువ రక్తము ద్వారా సమాధానము కలుగుచున్నది (కొలస్స 1:20).
7. ఆయన అమూల్యమైన రక్తముచేత పాపులు విమోచింపబడుదురు (కొలస్స 1:18, 19).

8. యేసుక్రీస్తు రక్తము ప్రతిపాపము నుండి పవిత్రులనుగా చేయును (1 యోహాను 1:7)

9. ఆయన తన రక్తము వలన మన పాపముల నుండి మనలను కడుగును (ప్రకటన 1:5).

10. గొర్రెపిల్ల రక్తములో వస్త్రములు తెల్లగా ఉతుకబడును. (ప్రకటన 7:14).

11. ప్రభురాత్రి భోజనమును చేయుటలో క్రీస్తు రక్తమును మనము జ్ఞాపకము చేసికొందుము (మత్తయి 26:26-28).

క్రీస్తు రక్తమును గూర్చి నీ ఉద్దేశమేమి ? దాని దరికి చేరు నిమిత్తమును ప్రభువునకు నీవు లోబడితివా ? లేని యెడల నీవింకను నీ పాపములోనే ఉన్నావు. నీవు దేవుని ఆజ్ఞలకు లోబడినట్లయితే ఆయన రక్తము వలన నీవు రక్షింపబడుదువు. అప్పుడు నీకు క్రీస్తు రక్తముచే సంపాదించబడిన సంఘముతో చేర్చబడుదువు. నీవు క్రైస్తవుడవై ప్రతి ఆదివారము ప్రభురాత్రి భోజనము నాచరించుట ద్వారా ఆయన రక్తమును జ్ఞాపకముంచుకొనుచు, ఆయన వెలుగులోనున్న రీతిగా నీవును వెలుగులో నడచిన యెడల అప్పుడు యేసుక్రీస్తు రక్తము ప్రతి పాపమునుండియు, సమస్త దుర్నీతినుండియు పవిత్రునిగా చేసి నిన్ను నిత్యజీవితమను బహుమానము కొరకు భద్రపరచును. నిజముగా ఆయన రక్తములో శక్తి యున్నది.

# 6. క్రీస్తు ఏల చనిపోయెను

(Why Christ Died)

క్రీస్తు చనిపోయెను. ఇది యథార్థమని బైబిలు వలన, సామాన్య చరిత్ర వలన ఋజువగుచున్నది. దీనిని మనసులో ఉంచుకొని యిప్పుడు కొన్ని సంగతుల నాలోచించుదము :

1. క్రీస్తు యొక్క మరణము సామాన్య మరణము కాదు. అనేక మంది బ్రతికి చనిపోయిరి. మనుష్యులందరు మృతి బొందుదురని పరిశుద్ధ లేఖకుడు చెప్పెను (హెబ్రీ 9:27). అయితే క్రీస్తు చనిపోవుటలో గల విశేషమేమి ? అనేకుల వలె ఆయన బ్రతికి చనిపోలేదా ? అవును అయితే ఆయన జీవించిన జీవితము వేరు. ఆయన చనిపోయిన కారణము వేరు. ఆయన పాపములేని జీవితమును జీవించి పాపములో యున్న మనుష్యుని రక్షించుట కొరకు మృతిబొందెను (2 కొరింథీ 5:21).

2. క్రీస్తు యొక్క మరణమును గూర్చి ప్రవచనములలో చెప్పబడెను. ప్రవక్తయైన యెషయా యిట్లు నుడివెను : "నిశ్చయముగా అతడు మన రోగములను భరించెను. మన వ్యసనములు వహించెను. అయినను మొత్తబడిన వానిగాను, దేవుని వలన బాధింపబడిన వానిగాను, శ్రమ నొందిన వానిగాను, మనమతని యెంచితిమి. మన యతిక్రమములను బట్టి అతడు గాయపరచబడెను. మన దోషములను బట్టి నలుగ గొట్టబడెను. మన సమాధానార్థమైన శిక్ష అతని మీద పడెను. అతడు పొందిన దెబ్బల చేత మనకు స్వస్థత కలుగుచున్నది. మనమందరము గొర్రెల వలె త్రోవ తప్పిపోతిమి. మనలో ప్రతివాడు తన కిష్టమైన త్రోవకు తొలిగెను, యెహోవా మన యందరి దోషమును

అతని మీద మోపెను" (యెషయా 53:4-6).

3. క్రీస్తు తన మరణమును గూర్చి చెప్పెను. "యేసు - ఈ దేవాలయమును పడగొట్టుడి. మూడు దినములలో దానిని లేపుదునని వారితో చెప్పెను" (యోహాను 2:19). ఇక్కడ ఆయన తన శరీరమను ఆలయమును గూర్చియు, పునరుత్థానమును గూర్చియు అట్లు పలికెను.

4. క్రీస్తు మృతి బొందు నిమిత్తము దేవునిచే పంపబడెను. "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టినవాని యందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3:16).

5. క్రీస్తు మరణము పొందునంత వరకు విధేయుడాయెను. ఆయన మృతినొందుట తన తండ్రి కిష్టమాయెను. "మరియు ఆయన ఆకారమందు మనుష్యునిగా కనబడి మరణము పొందునంతగా, అనగా సిలువ మరణము పొందునంతగా విధేయత చూపినవాడై తన్ను తాను తగ్గించుకొనెను" (ఫిలిప్పీ 2:8).

6. ఆయన పాపరహితముగా మృతిబొందెను. "పాపములను తీసివేయుటకై ఆయన ప్రత్యక్షమాయెనని మీకు తెలియును ఆయన యందు పాపమేమియు లేదు" అని యోహాను వ్రాసెను (1 యోహాను 3:5).

7. క్రీస్తు పాపుల కొరకు చనిపోయెను. "అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను" (రోమా

5:8). “మనము దేవుని ప్రేమించితిమని కాదు. తానే మనలను ప్రేమించి, మన పాపములకు ప్రాయశ్చిత్తమై యుండుటకు తన కుమారుని పంపెను. ఇందులో ప్రేమ యున్నది” (1 యోహాను 4:10).

8. మనము జీవించునట్లు క్రీస్తు చనిపోయెను. “మనము ఆయన ద్వారా జీవించునట్లు, దేవుడు తన అద్వితీయ కుమారుని లోకము లోనికి పంపెను దీనివలన దేవుడు మనయందుంచిన ప్రేమ ప్రత్యక్షపరచబడెను” (1 యోహాను 4:9).

9. క్రీస్తు సిలువపై మరణించెను. దానికి మించిన ఘోరమరణ మింకొకటి లేదు. దానివలన కలుగు బాధను బట్టియే గాక, ఆయననొక నేరస్తునివలె ఇద్దరు దొంగల మధ్య వ్రేలాడచేయుటచే ఆయన పొందిన బాధ మరింత ఎక్కువాయెను. మత్తయి 27వ అధ్యాయమును చదువుము. “విశ్వాసమునకు కర్తయు దానిని కొనసాగించువాడునైన యేసు వైపు చూచుచు, మన యెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తుదము. ఆయన యెదుట ఉంచబడిన ఆనందము కొరకై అవమానమును నిర్లక్ష్యపెట్టి సిలువను సహించి దేవుని సింహాసనము యొక్క కుడి పార్శ్వమున ఆసీనుడై యున్నాడు” (హెబ్రీ 12:2).

10. పాత ధర్మశాస్త్రమును ఎత్తివేయుట కొరకు క్రీస్తు చనిపోయెను. “దేవుడు వ్రాతరూపకమైన ఆజ్ఞల వలన మనమీద ఋణముగాను, మనకు విరోధముగాను నుండి పత్రమును మేకులతో సిలువకు కొట్టి, దాని మీద చేవ్రాతను తుడిచివేసి, మనకు అడ్డము లేకుండ దానిని ఎత్తివేసెను” (కొలస్స 2:14).

11. ఒక క్రొత్త చట్టము లేదా నిబంధననిచ్చు నిమిత్తము క్రీస్తు

చనిపోయెను (మత్తయి 26:28). "ఆయన క్రొత్త నిబంధన అనిచెప్పుట చేత మొదటిది పాతదిగా చేసియున్నాడు. ఏది పాతగిలి ఉడిగిపోవునో అది అదృశ్యమగుటకు సిద్ధముగా ఉన్నది" (హెబ్రీ 8:13).

12. క్రీస్తు సంఘము కొరకు చనిపోయెను. "పురుషులారా, మీరును మీ భార్యలను ప్రేమించుడి, అటువలె క్రీస్తు కూడా సంఘమును ప్రేమించి, దానిని పవిత్రపరచి పరిశుద్ధపరచుటకై దానికొరకు తన్ను తాను అప్పగించుకొనెను" (ఎఫెసీ 5:25-27).

13. మనము నిరీక్షణ కలిగియుండు నిమిత్తము క్రీస్తు మృతిబొందెను. ఆయన యందు ఈ నిరీక్షణ పెట్టుకొనిన ప్రతివాడు ఆయన పవిత్రుడై యున్నట్టుగా తన్ను తాను పవిత్రునిగా చేసికొనును" (1 యోహాను 3:3).

14. క్రీస్తు చనిపోయెను. అయితే సమాధి చేయబడిన తరువాత పునరుత్థానుడై పరమందున్న తన తండ్రి యొద్దకెక్కిపోయెను (మత్తయి 28:6 అపో.కా. 1:10). అందువలన మనుష్యులందరికి క్రీస్తు పునరుత్థాన నిరీక్షణను గ్రహించెను (1 కొరింథీ 15). నిజానికి క్రీస్తులోనే విజయమున్నది (1 యోహాను 5:4, 5).

క్రీస్తు చనిపోయినందుకు గల కొన్ని కారణముల నిక్కడ పేర్కొని యుంటిమి. ఆయన కేవలము చనిపోవుట కొరకు చనిపోలేదు. ఆయన ఒక ప్రత్యేక ప్రయోజనము కొరకు చనిపోయెను. ఆయన నీకొరకును, నా కొరకును చనిపోయెను. ఆయన మనుజులందరి కొరకు చనిపోయెను. మనము నశించక రక్షింపబడుగల్గునట్లు ఆయన మరణించెను. మనము మేలైన జీవమార్గమును నొందునట్లు ఆయన చనిపోయెను. మనమందరము నిత్య రక్షణ నొందునట్లు ఆయన

ప్రాముఖ్యముగ చనిపోయెను.

నీవు జీవించునట్లు ప్రభువు మృతిబొంది తన ప్రేమను నీ యెడల వ్యక్తపరచెను. ఆయన ప్రేమకు ప్రతిగా నీవు ఆయనను ప్రేమించి ఆయనకు విధేయుడవు కమ్ము. “మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొందురు” అని క్రీస్తు చెప్పెను (యోహాను 14:15).

# 7. క్రీస్తు సంఘమును గూర్చి నీవు ఎన్నడైనను విన్నావా ?

(Have you Ever Heard of the Church of Christ?)

క్రీస్తు సంఘమును గూర్చి వినలేని అనేకులు ఈ దేశమందున్నారు. దానిని గూర్చి నీవు ఎన్నడైనను విన్నావా ? లేని యెడల ఎందుకు వినలేదు? నీకొక బైబిలు ఉన్నదా ? ఏ సంఘమును గూర్చి నీవు దాని యందు చదువగలవు ? నీవు ఆ గ్రంధమును మరియొకసారి చదివి చూచిన యెడల అందు ఒక్క సంఘమును గూర్చి మాత్రమే చెప్పబడినది. అది క్రీస్తు సంఘము. అందుచే నీవా సంఘమును గూర్చి ఎందుకు వినలేదు? మిగిలిన వారందరు ఎందుకు వినలేదు ? మీ వద్ద బైబిలు చాలా కాలము నుండి ఉన్నదిగదా ? ఈ ప్రాంత ప్రజలలో అనేకులు ఏదో ఒక సంఘమునకు చెందినవారు. అయితే క్రీస్తు సంఘ సంగతేమి ?

క్రీస్తు సంఘము లోకమందతటా యున్నది. అది ప్రతి ఊరులోను లేదుగాని ఎక్కడయితే మనుష్యులు బైబిలును చదివి, బైబిలును బట్టి మాత్రమే నడుచుకొందురోఅక్కడ నీవు దానిని కనుగొనగలవు. ఈ సంఘమొక డినామినేషన్ గాని, దాని శాఖ గాని లేదా మానవ కల్పితమైనది గాని కాదు. అది కేథలిక్కు లేదా ప్రొటెస్టాంట్ లేదా యూదుల సంఘము కాదు. అయితే అదేమిటి ? అది బైబిలు నందున్నటి సంఘము. ప్రభువుకు లోబడి ఆయన యందు నమ్మకముగా యున్నవారందరు అందుందురు.

ఈ సంఘస్థాపకుడు యేసుక్రీస్తు. ఈ సంగతిని చదివి నీవే గ్రహించుము. మత్తయి 16:18 లో క్రీస్తు “ఈ బండమీద నా సంఘమును కట్టుదునని” చెప్పెను.

అది యెరూషలేము పట్టణమందు ఆరంభమాయెను. నీవు లూకా 24, అపొ.కా. 2ను చదివిన యెడల యిది సత్యమని నీవే గ్రహించగలవు. అది లండన్‌లోగాని, జర్మనీలోగాని, అమెరికాలోగాని ఆరంభింపబడలేదు గాని యెరూషలేములో ఆరంభమాయెను.

క్రీస్తు సంఘము క్రీ॥శ॥ 33వ సంవత్సరములో స్థాపించబడెను. అంటే అది యించుమించు రెండువేల సంవత్సరముల పురాతనమైనది. నీవు మరల అపొ.కా. 2వ అధ్యాయమును చదివిన యెడల సంఘారంభమును గూర్చియు, దాని జనన తేదీని గూర్చియు గ్రహించగలవు.

దానిని నిర్మించినవాడు క్రీస్తే గనుక, అది క్రీస్తు నామమును ధరించుచున్నది. "క్రీస్తు సంఘములన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి" యని వ్రాయబడెను (రోమా 16:16). దాని సభ్యులకు కూడా యిదే వర్తించును. "మొట్టమొదట అంతియొకయలో శిష్యులు క్రైస్తవులనబడిరి" (అపొ.కా. 11:26). బైబిలే క్రైస్తవులను చేయగలదు. ఇది జ్ఞాపకముంచుకొనుము.

క్రీస్తు ఒకే ఒక సంఘమును స్థాపించెను. ఎఫెసీ 4:4లో శరీరమొక్కటే యని చెప్పబడెను. కొలస్స 1:18లో ఆ శరీరము సంఘమై యున్నట్లు వ్రాయబడెను. గనుక సంఘము ఒక్కటే.

క్రీస్తు సంఘమునకు శిరస్సైయున్నాడు. "క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నలాగున పురుషుడు భార్యకు శిరస్సై యున్నాడు" (ఎఫెసీ 5:22). ప్రభువు సంఘమునకు ఈ లోకములో ఒక ప్రధాన కార్యలయము లేదు. దానికొక భూసంబంధమైన అధికారి లేదు. క్రీస్తే ఆయధికారి. ఆయన పరమందు దేవుని కుడి పార్శ్వమున

యున్నారు.

క్రీస్తు సంఘమునకు రక్షకుడై యున్నారు. "క్రీస్తే శరీరమునకు రక్షకుడై యున్నాడని" ఎఫెసీ 5:23 చెప్పుచున్నది. గనుక ఎవడైనను రక్షణ నొందగోరిన యెడల, అతడు క్రీస్తు సంఘ సభ్యుడై యుండవలెను.

క్రీస్తు సంఘము కొరకు చనిపోయెను (ఎఫెసీ 5:25 అపొ.కా. 20:28). సంఘమును ఆయన అంతగా ప్రేమించెను. దానిని గూర్చి నీ అభిప్రాయమేమి ?

రక్షింపబడిన వారు సంఘముతో చేర్చబడిరి (అపొ.కా. 2:47). రక్షింపబడిన ప్రతివారిని క్రీస్తు సరియైన సంఘముతో అనగా తన సంఘముతో చేర్చుకొనును.

ఆయన తన సంఘము కొరకు తిరిగి వచ్చుచున్నాడు (ఎఫెసీ 5:27). ఆయన తిరిగి వచ్చినపుడు నీవు దానిలో సభ్యుడవు కాని యెడల నీ సంగతి ఏమి ? దానిని గూర్చి నీవు ఆలోచించుము.

క్రీస్తు సంఘము ఈ ప్రాంతములో, ఈ పట్టణములో ఈ సమాజములో వచ్చియే యున్నది. నీవు ప్రభువును ప్రేమించి, ఆయన వాక్యమును గైకొని దాని బోధకు లోబడిన యెడల నీవు కూడా ఆ సంఘ సభ్యుడవు కాగలవు. ఆలాగున చేయుటవలన నీవు దేవుని వాక్యము నందును, దేవునియందును, ఆయన కుమారుడైన క్రీస్తునందును, విశ్వాసముంచగలవు (హెబ్రీ 11:6, యోహా 14:1-3 రోమా 10:17). నీవు నీ పాపములను గూర్చి మారుమనస్సు పొంది ప్రభువు తట్టు తిరగగలవు (లూకా 13:3 అపొ.కా. 17:30 అపొ.కా. 2:38). అప్పుడు నీవు క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొని

(రోమా 10:10 మత్త 10:32), నీ పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము (అపొ.కా. 2:38 మార్కు 16:16 రోమా 6:3–4 గలతీ 3:26, 27:1 పేతు 3:21). దీనికి ఫలితముగా ప్రభువు నిన్ను తన సంఘముతో చేర్చుకొనును (అపొ.కా. 2:47). అప్పుడు నీవు క్రీస్తు సంఘసభ్యుడవగుదువు. ప్రభువుని ప్రేమించి ఆయనకు విధేయత కలిగి నమ్మకముగా జీవించుచున్నంత కాలము అది నిలుచును. అయితే దీనిని బట్టి నీవింకొక సంఘానికి గాని, డినామినేషన్‌కు గాని చెందినవాడవు కాలేదు. ఏలయనగా ప్రభువు సంఘమొక డినామినేషన్ కాదు.

నీవు క్రీస్తు సంఘాన్ని గూర్చి ఇంకా తెలిసికొనగోరిన యెడల నీ బైబిలును చదువుము. నీవు మాతో సంప్రదించి మేము ఇచ్చు ఉచిత బైబిలు కరస్పాండెన్స్ కోర్సులో చేరుమని నిన్ను ఆహ్వానించుచున్నాము.

"క్రీస్తు యేసు మూలముగా సంఘములో తరతరములు సదాకాలము మహిమ కలుగునుగాక" (ఎఫెసీ 3:21).

# 8. క్రీస్తు సంఘమనగా యేమి ?

## (What is the Church of Christ?)

నేడు లోకమునందనేక సంఘములున్నవి. అనేక విషయములలో అవన్నియు ఒకేరీతిగా నున్నవి. అవి మనుష్యులచే స్థాపింపబడినవి. వాటిలో సభ్యత్వము లేకుండగనే ఒకడు పరలోకమునకు వెళ్ళగలడని ఆ సంఘాలు, సభ్యులు చెప్పుదురు. అందుచే అవి అంత ప్రాముఖ్యము కాదు. అవన్నియును లెక్కలేనన్ని డినామినేషన్లవలె విభజింపబడినవి. అయితే అన్ని డినామినేషన్లు మంచివేయని చెప్పుటలో వారేకస్థులై యున్నారు. వారు అన్ని రకాల బిరుదులను, నామములను ధరింతురు. వారిలో ప్రతిఒక్కరికి ఒక కార్యచరణ పుస్తకము లేక విశ్వాస ప్రమాణ పుస్తము గలదు. అయితే ఇట్టి మత శాఖలతో పొత్తులేని సంఘమొకటి కలదు. అది మిగిలిన వాటన్నిటి కంటె వేరుగ నున్నది, అది క్రీస్తు సంఘము.

క్రీస్తు సంఘము ఒక డినామినేషన్ కాదు అని ఇంటర్ డినామినేషనల్ అంతకు ముందే కాదు. అది కేథలిక్కు ప్రొటెస్టాంటు లేదా యూదా మత సంఘము కానేకాదు. అది ఒక తెగ కాదు. అది ఒక మనుష్యునితో ఆరంభించబడలేదు. దానికొక మానవాధికారి కార్యదర్శిగా లేడు. అది మనుష్యుల పేరులనసలే ధరించదు. మనుష్యులు వ్రాసిన పుస్తకముల ననుసరించి అది నడువదు. అది రాజకీయముగాగాని, సాంఘికముగా గాని ఉన్న ఒక సంస్థ కాదు. అయితే అదేమటి ? అది ఏమైయున్నది ? మనమిప్పుడు పరిశీలించుదాం.

సంఘము అను పదము "ఎక్లషియా" అను గ్రీకు పదము నుండి వచ్చినది. దానికి "పిలువబడినవారు" అని యర్థము. ఈ లోకములో నుండి ప్రభువు సేవకు పిలువబడిన వారితో అది తయారైనది. "ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములో నుండి విడుదల చేసి తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్యనివాసులుగా చేసెను". అని కొలస్స 1:13లో వ్రాయబడి యున్నది.

సంఘము గూర్చి రెండు భావములతో బైబిలు పలుకుచున్నది. మొదటిగా అది సార్వజనికమైనదను భావము. "నేను నా సంఘమును కట్టుదునని" క్రీస్తు చెప్పినపుడు ఆయన తన సార్వజనిక సంఘమును గూర్చి చెప్పెను (మత్త 16:18). రెండవది స్థానిక సంఘములు అనుభావము. కొరింథులో నున్న సంఘము, థెస్సలోనికయలో యున్న సంఘము అని మనము స్థానిక సంఘములను గూర్చి చదువగలము (1 కొరింథీ 1:2 1థెస్స 1:1). ఈ స్థానిక సంఘములు దృష్ట్యా "క్రీస్తు సంఘములు మీకు వందనములు చెప్పుచున్నవి" యని పౌలు చెప్పెను (రోమా 16:16). మనము ప్రకటన గ్రంధములో వ్రాయబడిన ఆసియాలోని ఏడు సంఘములను గూర్చి చదువునప్పుడు అవి స్థానిక సంఘములను భావముతో వ్రాయబడెను.

సంఘము భూమి మీద క్రీస్తు యొక్క ఆత్మీయ శరీరమై యున్నది. ఆయనకు లోబడి, ఆయనను సేవించు వారితో అది యేర్పడెను. శరీరములో అనేక అవయవములున్నను, శిరస్సు ఒక్కటే (1 కొరింథీ 12, కొలస్స 1:18), అయితే శరీరమొక్కటే (ఎఫెసీ 4:4). ఆ శరీరమే సంఘము (ఎఫెసీ 1:22, 23).

మానవ కల్పిత సంఘములను గూర్చి తెలిసికొనుటకు నీవు చరిత్ర గ్రంథములను లేదా వారి సాహిత్యములను చదువవలెను. అవి ప్రభువుచే ఆరంభింపబడలేనందున వాటిని గూర్చి నీవు బైబిలు నందు ఏమియును కనుగొనలేవు. అయితే క్రీస్తు సంఘమును గూర్చి తెలిసికొన గోరిన యెడల నీవు తప్పక బైబిలును సంప్రదించ వలయును. బైబిలు సంఘ చరిత్రను మాత్రమేగాక నీవు తెలుసుకొన వలసిన అన్నింటిని గూర్చియు బోధించుటచే, సంఘ మార్గదర్శిగా పనిచేయుచున్నది (2 తిమోతి 3:16 యాకోబు 1:25).

క్రీస్తు సంఘమును స్థాపించెను (మత్తయి 16:18). క్రీ॥శ॥ 33వ సం॥లో యెరుషలేములో దానిని స్థాపించెను. గనుక సంఘము నీదిగాని, నాదిగాని, మరియే మానవునిదిగాని కాదు. అది ఇంగ్లాండు దేశములో ఆరంభించలేనందున అది ఆంగ్లదేశ సంఘము కాదు. అది అమెరికాలో ఆరంభించలేదు. అందువలన అది ఒక అమెరికా సంఘము కాదు. అది ఆసియాలో యెరూషలేములో ఆరంభమాయెను. అది యించుమించు రెండువేల సంవత్సరముల క్రితమే ఆరంభమాయెను గనుక అది ఒక క్రొత్త సంఘము కాదు.

అపొస్తలుల కాలములో ఈ సంఘ సభ్యులగుటకు ఒకే ఒక మార్గముండెను. అది యేసు క్రీస్తు సువార్తకు లోబడుటయే. సువార్తను వినినవారు (రోమా 10:17), దానిని విశ్వసించి (హెబ్రీ 11:6), వారి పాపములను గూర్చి మారుమనస్సు నొంది (అపో.కా. 17:30), క్రీస్తును ఒప్పుకొని (రోమా 10:10), వారి పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము (నీటిలో ముంచడం) పొందిరి (అపో.కా. 2:38). అట్లు వారు రక్షింపబడి నందున సంఘముతో చేర్చబడిరి (అపో.కా. 2:47). ప్రభువు ఈనాడు కూడా అదే చేయును.

దాని సభ్యులు క్రైస్తవులని మాత్రమే పిలువబడిరి. (అపొ.కా. 11:26 1 పేతురు 4:16). సంఘమనగా వారు క్రీస్తు సంఘమని గాని దేవుని సంఘమని గాని పిలువబడిరి (రోమా 16:16 అపొ.కా. 20:28). అది క్రీస్తు శరీరమని పిలువబడెను (1 కొరింథీ 12:27). అయితే శరీరమే సంఘమైనందున (కొలస్స 1:18), పరిశుద్ధలేఖకుడు క్రీస్తు యొక్క ఆత్మీయ శరీరమైన క్రీస్తు సంఘమును గూర్చి మాట్లాడుచున్నాడు. అది క్రీస్తు నామమును ధరించుటచే ఈనాడు కూడా క్రీస్తును మహిమ పరచుచున్నది (అపొ.కా. 4:12).

ప్రపంచమందంతటా వేలకొలది యున్న వ్యక్తిగత సంఘములతో క్రీస్తు సంఘ మేర్పడియున్నది. ప్రతి స్థానిక సంఘము ప్రేమచేతను, ఏకాభిప్రాయము చేతను కలసి బంధింపబడియున్నది. క్రీస్తు దానికి శిరస్సు (ఎఫెసీ 5:23). సంఘములు పెద్దవియై, ఆత్మీయ బలమును పొందినపుడు, అర్హత గలవారు అందు పెద్దలు పరిచారకులు, సువార్తికులు, బోధకులుగ ఉందురు (1 తిమోతి 3 తీతు 1).

ప్రతి ఆదివారము ఆరాధన యుండును (అపొ.కా. 20:7). సభ్యులు వాక్యమును చదువుటకు (2 తిమో 2:15), ప్రార్థించుటకు (1 థెస్స 5:17), పాటలు పాడుటకును (ఎఫె 5:19), ప్రభు రాత్రి భోజనము చేయుటకు(1 కొరింథీ 11:23-30), కానుకలిచ్చుటకు (1 కొరింథీ 16:2) కూడుకొందురు.

ప్రభువు తన ప్రజలు పరిశుద్ధులుగాను, నిష్కళంకముగాను ఉండవలెనని కోరుచున్నాడు. (ఎఫెసీ 5:27). సర్వలోకమునకు సువార్త ప్రకటించుటయు (మార్కు 16:15 16) ఆపదలోనున్న వారికి సహాయము చేయుటయు సంఘపనియై యున్నది. (యాకో 1:27).

అంతము వరకు నమ్మకముగా నున్నవారికి జీవకిరీట మీయబడును (ప్రకటన 2:10).

ఇది క్రీస్తు ప్రభువు సంఘము, బైబిలు నందు దీనిని మాత్రమే నీవు చదువగలవు. దానిని గూర్చి నీవింకనూ తెలిసికొని దాని సభ్యుడవగుము.

# 9. క్రొత్త నిబంధన సంఘము

## (The New Testament Church)

సంఘమును గూర్చి సత్యమును తెలిసికొన గోరినయెడలమనము తప్పక క్రొత్త నిబంధనను సంప్రదించవలెను. అది ప్రవచనములలో చెప్పబడినను (యెషయా 2:2, 3 దానియేలు 2:44), వాటి నెరవేర్పును గూర్చి తెలిసికొనుటకు క్రీస్తు బోధనలలో మనము చూడవలెను.

సంఘమును గూర్చి మనుష్యుడు చెప్పిన వాటియందు మనకు ఆసక్తి లేదని గుర్తించుకొనవలెను. అయితే లేఖనములు ఏమి చెప్పుచున్నవో వాటి యందే మనకు ఆసక్తి యున్నదని గ్రహించుము. గనుక ఆరంభించుదము.

1. క్రీస్తు సంఘమును నిర్మించెను. "ఈ బండమీద నా సంఘమును కట్టుదును. పాతాళలోక ద్వారములు దానియెదుట నిలువనేరవు" అని ఆయనే చెప్పెను (మత్తయి 16:18). సంఘమును కట్టుదునని ఆయనే చెప్పెనని గ్రహించుము. గనుక అది ఆయనకే చెందును.

2. సంఘము యెరూషలేములో ఆరంభించబడెను. యెరూషలేము మొదలుకొని సమస్త జనములలో ఆయన పేరట మారు మనస్సును, పాపక్షమాపణయు ప్రకటింపబడును. వారు పై నుండి శక్తి పొందువరకు యెరూషలేములో నిలిచియుండుడి యని క్రీస్తు అపొస్తలులను ఆజ్ఞాపించెను (లూకా 24:46-48). ఇది ఎట్లు నెరవేరెనో అపొస్తలుల కార్యములు రెండవ అధ్యాయములో మనము చూడగలము.

3. అది క్రీ॥శ॥ 33వ సంవత్సరములో స్థాపించబడెను. అది క్రీస్తు పునరుత్థానుడైన 50 దినముల తరువాత స్థాపించబడెను. ఆయన తిరిగి లేచిన తరువాత మొదటి పెంతెకోస్తు దినమున అది ఆరంభమాయెను (అపొ.కా. 2).

4. అది దాని స్థాపకుడైన క్రీస్తు నామమును ధరించెను. పౌలు రోమాలోని సంఘమునకొక పత్రిక వ్రాసినపుడు అనేక సంఘముల నుండి శుభవచనములను దానికి పంపుతూ "క్రీస్తు సంఘములు మీకు వందనములు చెప్పుచున్నవి" యని చెప్పెను (రోమా 16:16). 1 కొరింథీ 12:27 లో అతడు క్రీస్తు సంఘమైన శరీరమును గూర్చి పలికెను. క్రీస్తే గనుక దానిని కట్టిన యెడల సహజముగా అది క్రీస్తుకే చెందును. గనుక అది క్రీస్తు సంఘము అయి ఉన్నది. అది మరింకొక సంఘమయిన యెడల క్రీస్తు కేలాగు చెందును ?

5. దాని సభ్యులు క్రైస్తవులు మాత్రమే. అపొ.కా. 11:26లో మొట్టమొదట అంతియొకయలో శిష్యులు క్రైస్తవులనబడిరి. ఇది దైవచిత్తానుసారముగ జరిగినదని మనకు తెలియును. ఏలయనగా క్రైస్తవుడను పేరును బట్టియే మనము క్రీస్తును మహిమ పరచవలెనని పేతురు నుడివెను (1 పేతురు 4:16).

6. సంఘము కొరకు తన ప్రాణము పెట్టుట కిష్టపడు నంతవరకు క్రీస్తు దానిని ప్రేమించెను. "పురుషులారా, మీరును మీ భార్యలను ప్రేమించుడి. అటువలె క్రీస్తు కూడ సంఘమును ప్రేమించి దాని కొరకు తన్ను తాను అప్పగించుకొనెను" (ఎఫె 5:25-27).

7. అది క్రీస్తు రక్తముచే కొనబడినది. ఎఫెసులో నున్న సంఘ పెద్దలతో పౌలు ఇట్లనెను : "దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన

తన సంఘమును కాయుటకు పరిశుద్ధాత్మ మిమ్మును దేనియందు అధ్యక్షులుగా ఉంచెనో ఆ యావత్తు మందను గూర్చియు, మీ మట్టుకు మిమ్మును గూర్చియు జాగ్రత్తగా ఉండుడి" (అపొ.కా. 20:28).

8. ఒకే ఒక్క సంఘమున్నది. దేవుని వాక్యము "శరీరమొక్కటే యనియు" (ఎఫెసీ 4:4), "ఆ శరీరము సంఘము" అనియు (ఎఫసీ 1:22, 23 కొల 1:18) చెప్పుచున్నది గనుక ఉన్న శరీరము ఒక్కటే అయితే, ఉన్న సంఘము ఒక్కటే.

9. క్రీస్తు దాని శిరస్సైయున్నాడు. "సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు ఆయనకు అన్నిటిలోను ప్రాముఖ్యము కలుగు నిమిత్తము ఆయన ఆదియై యుండి, మృతులలోనుండి లేచుటలో ఆది సంభూతుడాయెను" (కొలస్స 1:18). దీనిని ఆయన ఏ మానవునితోను పంచుకొనుటలేదు.

10. క్రీస్తే సంఘమునకు రక్షకుడై యున్నాడు : "క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నలాగున పురుషుడు భార్యకు శిరస్సై యున్నాడు. క్రీస్తు శరీరమునకు రక్షకుడై యున్నాడు" (ఎఫెసీ 5:23).

11. రక్షింపబడిన వారిని ప్రభువు తన సంఘముతో చేర్చును. ఒకడు రక్షింపబడుటకు క్రీస్తును నమ్మి బాప్తిస్మము పొందవలెనని బైబిలు బోధించుచున్నది (మార్కు 16:16). ఈ విశ్వాస బాప్తిస్మముల ద్వారా ఒకడు క్రీస్తు లోనికి, క్రీస్తు సంఘములోనికి ప్రవేశింపగలడని పౌలు చెప్పెను (గలతీ 3:26, 27:1 కొరింథీ 12:13). ఇంకొక మాటలో పెంతెకొస్తు దినమున సువార్తను విని, మారుమనస్సు పొంది తమ పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొంది రక్షింపబడిన ప్రతివారిని ప్రభువు తన సంఘముతో చేర్చెను (అపొ.కా. 2:47).

12. క్రీస్తు తన పెండ్లి కుమార్తెయైన సంఘము కొరకు మరల ఒకరోజు తిరిగిరాబోవుచున్నాడు. అది కళంకమైన ముడతయైనను అట్టిది మరి ఏదైనను లేక పరిశుద్ధమైనదిగాను, నిర్దోషమైనదిగాను, మహిమ గల సంఘముగాను ఆయన తన యెదుట దాని నిలువ బెట్టుకొనవలెనని ఆయన ఆశించుచున్నాడు (ఎఫెసీ 5:27). ఆయనకొక పెండ్లి కుమార్తె సంఘము ఉన్నదని, అది ఆయన నామమును ధరించుననియు మనము గుర్తుంచుకొనవలెను. సరిగదా ఆయన ఆ ఒక్కదాని కొరకే తిరిగి రాబోవుచున్నాడు.

నీవు క్రొత్త నిబంధనలో చదువుకొనదగు సంఘసభ్యుడవా ? లేని యెడల నీవు క్రీస్తు సంఘసభ్యుడవని ఏలాగు చెప్పుకొనగలవు ? ఈ సంగతుల నాలోచించి త్వరలో నీకు సమీపముగ నున్న క్రీస్తు సంఘమును దర్శించుము.

# 10. క్రీస్తు సంఘము ఇండియాలో ఎంతకాలము నిలుచును ?

(How long will the Church of Christ be in India?)

క్రీస్తు సంఘము ఇండియాలో ఎంతకాలము నిలుచును ? అనే ప్రశ్నను అనేకులు అడుగుచున్నారు. ఈ ప్రశ్నకు సమాధానము భారతదేశ ప్రజలే ఇయ్యవలెను. సంఘము ఈ దేశములో నిరంతరము నిలుచుట సాధ్యము. తగినంత మంది ప్రభువును ప్రేమించి, ఆయనకు విధేయులై నమ్మకముగా నుండిన యెడల అది సాధ్యము కాగలదు. అయితే దానియందు ప్రజల కాశక్తి లేనిచో సంఘము ఈ దేశములో జీవించుట కష్టము.

ఇక్కడ విదేశీయులెవరైనా ఉన్నను లేకపోయినను పరవాలేదు. విదేశీయ సహాయము వచ్చుచున్నను, రాకపోయినను పరవాలేదు. గుడులు ఏమైనా ఉన్నను లేకపోయినను పరవాలేదు. అయితే నిజానికి స్థానిక ప్రజలు ప్రభువు కోరునట్టి రీతిగ ఉండదలచుకొన్నారో లేదో అనునది అసలైన సమస్య. దానిపై ఈ సంఘ భవిష్యత్తు అంతయు ఆధారపడి యున్నది.

ఇది ఈ దేశమునకు, అన్ని దేశములకు వర్తించుచున్నది. ప్రజలు ఎక్కడ ప్రభువునకు లోబడి ఆయనను సేవింపకోరుదురో అక్కడ మాత్రమే ప్రభువు సంఘము నిలువగలదు. అయితే అట్టివారు లేనియెడల ప్రభువు సంఘము అక్కడ ఉండజాలదు.

నేడు ఉండి రేపు మాయమైపోవునట్టి సంస్థలాంటి సంఘములో సభ్యులుగా నుండుటకు స్థానిక ప్రజలు అనుమానించెదరు. అయితే

నీవు భయపడనవసరము లేదు. నీవొకసారి ప్రభువు కుటుంబము లోనికి జన్మించిన యెడలనీవు దానిలో చిరకాల సభ్యుడవే. అయితే మొట్టమొదట మీ ప్రాంతములో పనిని ప్రారంభించుటకు వచ్చిన పనివాడు యిప్పుడుండక పోవచ్చును. క్రీస్తును గాని, క్రైస్తవ్యమును గాని నీ దగ్గర నుండి ఎప్పుడు అతడు తనతో తీసికొనిపోలేడు. గనుక నీ ప్రాంతములో ఉన్న సభ్యులతో కలసి సంఘపనిని నడిపించుటకు నీవుతప్పక తెలుసుకొనవలెను.

క్రీస్తు సంఘము ఢిల్లీలో మాత్రమే కాదు గాని బొంబాయి, మద్రాసు, లక్నో, షిల్లాంగ్, హైదరాబాదు పట్టణములలోను, అనేక చిన్న పట్టణములలోను, గ్రామములలోను ఉన్నదని నీవు తెలుసుకొనుటలో నీకు కొంతవరకు ఆదరణ దొరకగలదు. అయితే హిందూ దేశమంతటిలోను యిప్పుడు లేకపోతే భవిష్యత్తులో ఉండకపోదు అని అర్ధము కాదు. నిజానికి ఈ దేశపు నలుమూలలకు క్రీస్తు సంఘము అతి త్వరిత గతిని వ్యాపించు చున్నది. దీనిని బట్టి ఆ సంఘము ఈ దేశములో నిరంతరము ఉండగలదని వ్యక్తమగు చున్నది.

క్రీస్తు సంఘము ఒక క్రొత్త సంఘము కాదు. అది హిందూ దేశమునకు ఆధునికంగా ఈ మధ్య వచ్చియుండవచ్చును. నిజానికి చరిత్రను బట్టి చూచినట్లయితే క్రీస్తు యొక్క సువార్త మరియు క్రీస్తు సంఘము, మొదటి శతాబ్దములోనే ఈ దేశమందు అపొస్తలుడైన తోమాచే బోధింపబడినవి. అకాశము క్రింద సమస్త సృష్టికి సువార్త ప్రకటించబడెను అని కొలస్స 1:23లో పౌలు వ్రాసినట్లు మనమెరుగుదుము. అందులో తప్పక హిందూ దేశము కూడ మిళితమై యుండును గదా. అయితే ఆనాడే సువార్తను విని దానికి లోబడిన

వారున్నారనుకొందాము. అయితే వారేమైరి ? అపొ.కా. 2:47 ప్రకారము వారు క్రీస్తుసంఘ సభ్యులైరి. అయితే వారికేమి సంభవించెను ? ఈ లోకములో అనేక చోట్ల ఏమి జరిగెనో అదే ఇండియాలో కూడ జరిగెను. కాలము గడచిన కొలది ప్రజలు దిగజారిపోయి విశ్వాసభ్రష్టులైరి. అందుచే అది సంఘముతో పోలిక లేకుండగనే మార్చివేయబడెను. అయితే గత కొద్ది సంవత్సరములలోను ప్రభువు సంఘము ఆదియందు ఎట్లు నిలబడెనో అట్లుండుటకు అది పునరుద్ధరింపబడుచున్నది.

క్రీస్తు సంఘము ఒక అమెరికా సంఘము కాదని నీ మనస్సు నందు గుర్తుంచుకొనుము. అది అమెరికాలో ఆరంభించబడలేదు గాని యెరూషలేములో యించుమించు రెండువేల సంవత్సరముల క్రితమే మొదలిడెను. అది ఒక డినామినేషన్‌కు చెందిన సంఘము కాదు. అది మనుష్యునిచే కాదు గాని, క్రీస్తు ద్వారా ప్రారంభించబడెను (మత్తయి 16:18).

బైబిలు నందు సంఘ సంపూర్ణ మాదిరి ఇయ్యబడియున్నది. అందు వలన ఆ మాదిరిని అనుసరించినపుడు ప్రభువు సంఘము స్థాపించబడుట జరుగును. అది ఈ దేశమందును, ప్రపంచ మందంతటను నిజముగా వర్తించును. ఆ మాదిరిని గూర్చి యిప్పుడు నీవే కొంత పరిశీలించుము :

1. అది సంఘ స్థాపకుని గూర్చి చెప్పుచున్నది (మత్త 16:18).

2. అది ఎక్కడ స్థాపించబడెనో చెప్పుచున్నది (అపొ.కా. 2).

3. అది ఎప్పుడు స్థాపించబడెనో తెలియజేయుచున్నది (అపొ.కా. 2)

4. అది ఏ నామమును ధరించెనో చెప్పుచున్నది (రోమా 16:16).

5. దాని సభ్యులు ఎవరి నామమును ధరించిరో చెప్పుచున్నది (అపొ.కా. 11:26)

6. దానియందు ప్రజలు సభ్యులెట్లయిరో అది చెప్పుచున్నది. (మార్కు 16:15, 16; అపొ.కా. 2:38, 47).

7. దాని ఆరాధన గూర్చి అది చెప్పుచున్నది (అపొ.కా. 20:7)

8. దాని ప్రధానాధికారి యెవరో అది చెప్పుచున్నది (కొలస్స 1:18)

9. ఎన్ని సంఘములున్నవో యను దానిని గూర్చి కూడ అది చెప్పుచున్నది (ఎఫెసీ 4:4; 1:22, 23)

మరియు అనేక సంగతులను గూర్చి అది చెప్పుచున్నది. అయితే ఈ మాదిరిని బట్టి ఎవరు అనుసరించిరో వారందరును క్రీస్తు సంఘ సభ్యులైరి. నీవు ఈ మాదిరి ననుసరించి నడచువారిని లోకములో ఎక్కడ కనుగొన్నను వారు నీవలెను, నీవు వారివలెను క్రీస్తు నందు ఒక్కరై యున్నారని, ఆయన శరీరమైన సంఘమందు ఏకమై యున్నారని వెంటనే గ్రహింపగలవు.

ఇంతవరకు మేము చెప్పిన ఈ సంగతులను బట్టి నీ బైబిలును తీసికొని అందున్న లేఖనములను పరిశీలించవలసినదిగా కోరుచున్నాము. దీనిని నీవు సత్యము అని గ్రహించిన యెడల దానిని అంగీకరించుము. అది సత్యము కాదని నీవు గ్రహించిన యెడల దానిని విసర్జింపుము. నీవు హృదయయపూర్వకముగా, నిర్మలమైన

మంచి మనస్సాక్షి కలిగి చదివిన యెడల తప్పక సత్యమును గ్రహించగలవు. ఎవరును నిన్ను మోసము చేయ ప్రయత్నించుట లేదు. మేము నీకు కేవలం సహాయం చేయనుద్దేశించు చున్నాము. అందువలననే నిన్ను దేవుని వాక్యమువైపు త్రిప్పుటకంటే మేము చూపవలసిన మంచి మార్గము మరొకటి లేదు. నీవు హిందూ దేశములో క్రీస్తు సంఘము నిలబడవలెనని ఆశించుచున్న యెడల తప్పక ప్రభువునకు లోబడుము. ఆయనకు నమ్మకముగా నుండి అనేకులను కూడా అట్లుండుటకు హెచ్చరించుము. నీద్వారాను, నీలాంటి వారి ద్వారాను ఇక్కడనున్న క్రీస్తు సంఘము తప్పక చిరకాలము నిలువగలదు.

# 11. నాలుగు బైబిలు ప్రశ్నలు

( Four Bible Questions )

ఒకే ఒక్క సంఘము ఉన్నదని బైబిలు విపులముగా బోధించు చున్నది (ఎఫె 4:4 కొల 1:18). అయితే ప్రపంచములో నేడు అనేక సంఘము లున్నవి గనుక బైబిలు చెప్పుచున్న ఆ నిజ సంఘము గూర్చి మనము తెలిసికొనుటెట్లు అనే ప్రశ్న ఉద్భవింపవచ్చును. అన్ని సంఘములు దేవుని వాక్యానుసారముగ నున్నట్లు ఆరోపించుదురు. సహజంగా ఒకే ఒక సంఘమున్నట్లయితే అవన్నియును ప్రభువునకు చెందవుగదా ? నిజసంఘమును నిర్ణయించుటకు నీవు నాలుగు సూక్ష్మప్రశ్నలు వేసిన చాలును. కావలెనన్న ఇంకా ఎక్కువ ప్రశ్నల నడుగవచ్చును. అయితే ఒక సంఘము నిజమైనదో కాదో తెలిసికొనుటకు నాలుగు ప్రశ్నలు సరిపడును.

ఈ ప్రశ్నలను అడుగుచు వాటికి బైబిలు నుండి జవాబులను కనుగొందము.

1. సంఘమును ఎవరు స్థాపించిరి ? క్రీస్తు, సంఘమును స్థాపించెనని బైబిలు బోధించుచున్నట్లు మనలో ప్రతివారు అంగీకరింతురు. క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొనబడినప్పుడు, "మరియు నీవు పేతురువు ఈ బండమీద నా సంఘమును కట్టుదును. పాతాళలోక ద్వారములు దానియెదుట నిలువనేరవు" అని క్రీస్తు పలికెను (మత్తయి 16:18). సంఘమును కట్టుదునని క్రీస్తే వాగ్దానము చేసెను గనుక దానిని కట్టిన వాడు తప్పకుండ ఆయనే గదా ? నా సంఘమును కట్టుదును, సంఘము లను కాదు అని క్రీస్తు చెప్పిన

సంగతి గుర్తించుకొనుము. ఆయన ఒక్క దానిచే నిర్మించెను. గనుక అది ఆయనకు చెందినదని ఆయన పలికెను. నా "సంఘము" అని ఆయన పలికెను. అది ఆయనది కాబోవు చున్నట్లయితే అది నీది, నాది కాదని యర్థము.

2. అది ఎక్కడ స్థాపించబడెను ? అపొస్తలుల కార్యములు రెండవ అధ్యాయము ప్రకారము అది యెరూషలేములో స్థాపించబడెను. అది మనకెట్లు ఎరుక? ఏలయనగా అపొస్తలులందరు పైనుండి శక్తి పొందువరకు యెరూషలేములో యుండవలెనని క్రీస్తు వారిని ఆజ్ఞాపించెను గనుక (లూకా 24:49). శక్తి వచ్చినపుడువారు యెరూషలేములో యుండిరి (అపొ.కా. 2:1-4). అంతేకాదు, ప్రవక్తయైన యెషయా కూడా దేవుని రాజ్యము లేక సంఘము యెరూషలేములో స్థాపింపబడునని ప్రవచించెను (యెష 2:2,3).

3. అది ఎప్పుడు స్థాపింపబడెను ? అపొస్తలుల కార్యములు 2వ అధ్యాయము ప్రకారము యెరూషలేములో సంఘము క్రీస్తుచే స్థాపించబడెను. గనుక అది ఇంచుమించు క్రీ॥శ॥ 33 వ సం॥లో స్థాపించబడెను. దీనిని బట్టి ప్రభువు సంఘము ఇంచుమించు రెండువేల సంవత్సరముల నుండి యున్నదని గ్రహింపవుచున్నది.

4. అది ఏ నామమును ధరించుకొనెను ? వ్యక్తిగత సంఘ సభ్యులు క్రైస్తవులనబడిరి : (అపొ.కా. 11:26 26:28 1 పేతురు 4:16). క్రైస్తవులందరు కలిసి సంఘమగుదురు. లేఖనములలో అది క్రీస్తు శరీరమన బడినది (1 కొరింథీ 12:27). అయితే ఆ శరీరము సంఘమైయున్నది. (కొలస్స 1:18). గనుక అది క్రీస్తు సంఘమై యున్నది. ఆయా ప్రదేశములలో యున్న సంఘములు అన్నియు

క్రీస్తు సంఘములనబడినవి (రోమా 16:16). క్రీస్తే గనుక సంఘమును స్థాపించిన యెడల సహజముగా అది క్రీస్తు నామమునే ధరించును. అది క్రీస్తు సంఘము కాని యెడల మరి యెవరి సంఘమగును ? అది ఆయన నామమును ధరించని యెడల అది క్రీస్తు సంఘమగునా ? అట్లు కానేరదు. ఇవి బైబిలు జవాబుతో కూడిన నాలుగు చిన్న ప్రశ్నలు. ఏదైనా ఒక సంఘము క్రీస్తు సంఘమోకాదోయని నీవు తెలిసికొనవలెనంటే ఈ నాలుగు ప్రశ్నలను అడిగి వాటికి జవాబును కనుగొనుము.

ఏదైనా ఒక సంఘము తాను క్రీస్తు సంఘమేయని ఆరోపించుకొన వచ్చు. అయితే అది ఒక మానవునిచే స్థాపించబడిన యెడల అది క్రీస్తు సంఘము కానేరదు. అది లండన్‌లోగాని, అమెరికాలోగాని, మరింకెక్కడయినా గాని స్థాపించబడినట్లయితే అది క్రీస్తు సంఘము ఎట్లగును ? అది గత కొన్ని శతాబ్ధములలో స్థాపించబడినట్లయితే అది క్రీస్తు సంఘముకంటె చాల క్రొత్తది. మరియు చివరిగా ఒక మానవ కల్పిత నామమును ధరించిన యెడల అది కేవలం ఒక డినామినేషన్‌కు చెందిన సంఘము మాత్రమే. గనుక ఒక సంఘము దేవునిదో లేక మానవునిదో తెలుసుకొనుటకు యిది ఒక పరీక్షయని యిప్పుడు నీవు గ్రహించలేవా ? ఈ పరీక్ష ఎన్నడు అపజయమొందదు.

ఏ సంఘము అయినను ఒక దానిలో తప్ప అన్ని అంశములలోను ప్రభువు సంఘమువలె తులతూగచున్నట్లు నీవు కనుగొనిన యెడల, అది యింకను క్రీస్తు సంఘము కానేరదు. అది బైబిలు బోధించు ఒకే ఒక్క సంఘమైతే అది అన్ని అంశములలోను బైబిలును బట్టి యుండును.

నా మిత్రుడా, నీవు క్రీస్తు సంఘ సభ్యుడవా ? ఈ నాలుగు

ప్రశ్నలను నీవు అడిగి చూడుము. అప్పుడు నీవు ఒక డినామినేషన్‌కు చెందిన సంస్థలో యున్నావని గ్రహించిన యెడల నీవు నీ బైబిలును బాగుగా చదివి, ప్రభువునకు లోబడుము. బైబిలు బోధించునట్లు నీవు చేసిన యెడల ప్రభువు నిన్ను రక్షించి తన సంఘముతో చేర్చును. ఆయన నిన్ను రక్షించి పొరబాటు చేసి మరొక సంఘముతో ఎన్నడును చేర్చడు గనుక నీవు భయపడనవసరము లేదు. ఆయన తన సంఘమును ఎరుగును గనుక నిన్ను దానిలోనే చేర్చును. అప్పుడు బైబిలులో నీవు చదువగల సంఘమందు నీవొక సభ్యుడవగుదువు. నేను ఈ సంఘములో లేదా ఆ సంఘములో ఎందుకున్నానోయని యికమీదట నీవు ఎవరికి సాకులు చెప్పి వివరించనవ సరం లేదు. ఏలయనగా ప్రభువునకు ఒకే ఒక్క సంఘమున్నది, నీవు దానియందు సభ్యుడవు.

# 12. క్రీస్తు సంఘమును నీ పట్టణములో గాని స్వగ్రామములో గాని ఎట్లు ఆరంభించవచ్చును

(How you can begin the Church of Christ in your own city or village)

క్రీస్తు సంఘములేని ఒక పట్టణములోగాని, గ్రామములో గాని నీవు బహుశ ఉండవచ్చును. అక్కడ మానవ కల్పితములైనట్టియు మతశాఖలకు చెందినట్టియు సంఘములుండవచ్చును. అయితే క్రీస్తు సంఘము ఇంకను స్థాపించబడలేదు. గనుక నేనేమి చేయవలెను అని నీవు ఆలోచించుచుండ వచ్చును. నీవున్న రీతిగనే యుండుట మంచిదా ? క్రీస్తు సంఘము ఉన్న ఊరుకు నీవు మారుట మంచిదా ? లేనియెడల నీఊరిలోనే యున్న సంఘములలో దేనిలోనైన నీవు సభ్యుడగుట మంచిదా ? ఇవి చాలా ప్రాముఖ్యమైన ప్రశ్నలు గనుక జవాబులు అంత సులభముగ దొరకవు.

నేను నీకు కొన్ని సలహాలను ఇయ్యవలెనని కోరుచున్నాను. నీవు క్రీస్తు సంఘ సభ్యుడవగుట సాధ్యమే. నీవు నీ ఊరిలో క్రీస్తు సంఘమును ఆరంభించుటకు ముందంజ వేయుట కూడ నీకు సాధ్యమే గనుక ఈ క్రింది సలహాలను పాటించుము :

1. నీవొక బైబిలును సంపాదించుకొనుము. నీవు దేవుని చిత్త ప్రకారము జరిగించాలని ఆసక్తి కలిగియుంటే నీకొక బైబిలు ఉండుట చాల అవసరము. బైబిళ్లు భారతదేశములో దొరకుచున్నవి. నీవొక ప్రతిని సంపాదించిన తరువాత దానిని శ్రద్ధగా పఠించుటకు మొదలిడుము. క్రొత్త నిబంధనను చదువునపుడు మరింత జాగ్రత్తగా

చదువుము. ఏలయనగా అందు నేటి ప్రజలకు క్రీస్తు యొక్క చట్టము వ్రాయబడి యున్నది. అట్లు చేయుటవలన నీవు రక్షింపబడుటకు ఏమి చేయవలెను ? క్రీస్తు సంఘ సభ్యుడగుటయెట్లు ? ఆరాధించుట యెట్లు ? క్రైస్తవ జీవతమును జీవించుట యెట్లు ? అనునవి నీవు తప్పక గ్రహించగలవు.

2. నీవు ముందు సత్యమునకు లోబడుము. నీవు ఆయన యందు విశ్వాసముంచి పాపముల విషయమై మారుమనస్సు నొంది క్రీస్తును మనుష్యుల యెదుట ఒప్పుకొని, బాప్తిస్మము (నీటిలో ముంచడము) పొందిన యెడల నీవు రక్షింపబడుదువని ప్రభువు బోధించెను (మార్కు 16:16 మత్తయి 10:32 అపో.కా. 2:38). అపొస్తలుల కాలములో ప్రజలు క్రీస్తు వైపు కెట్లు మార్పు నొందిరో తెలిసికొనుటకు అపొస్తలుల కార్యములు అను పుస్తకమును కూడ చదువుము. నీవు ప్రభువునకు విధేయుడగుటకు సిద్ధపడినప్పుడు లేఖనములు ప్రకారము నీకు బాప్తిస్మమిచ్చుటకు ఎవరినైనా కనుగొనుము. అతడు తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మని యొక్కయు నామములోనికి పాపక్షమాపణ నిమిత్తము నీటిలో నిన్ను ముంచుట కవకాశమున్న ఒక స్థలమునకు తీసికొని వెళ్ళగలుగునట్లు చూడుము. నీవు అట్లు బాప్తిస్మము పొందినందున నీవు తక్షణమే క్రీస్తు సంఘసభ్యుడవగుదువు. ఏలయనగా రక్షింపబడిన వారిని ప్రభువు తన సంఘముతో చేర్చును (అపో.కా. 2:47). నీవు కూడ ఒక క్రైస్తవుడవు మాత్రమే అగుదువు (అపో.కా. 11:26).

3. తరువాత నీ యింటిలో ఆరాధనను జరిగించుట మొదలిడుము. నీ యింటివారిని, నీ మిత్రులను, ఆసక్తి కలిగిన వారిని ఆహ్వానించుము. ఈ ఆరాధన కూటము ఆదివారమున జరుగవలెను.

అది దేవునికి ఇష్ట పూర్వకముగా నుండు నిమిత్తము అందు బైబిలును చదువ వలయును (2 తిమో 2:15), ప్రార్థన చేయవలెను (అపొ.కా. 2:42). పాటలు పాడవలెను. ప్రభురాత్రి భోజనము కూడ తప్పక జరిగించవలెను. రొట్టె క్రీస్తు శరీరమునకు గురుతుగాను ద్రాక్ష రసమును ఆయన రక్తమునకు గురుతుగాను వినియోగించవలెనని చెప్పెను. ఒకవేళ ద్రాక్షరసము బజారులో లేని యెడల నీవు ఎండుద్రాక్షలను కొని, వాటిని ఉడుకబెట్టి ఆ రసమును వినియోగింప వచ్చును. చివరిగా నీవు వర్ధిల్లిన కొలది దేవునికి కృతజ్ఞత చెల్లించు నిమిత్తము కానుకలు ఇయ్యవలెను (1 కొరింథీ 16:2).

కూటమునకు హాజరైనవారు కూడ ఇయ్యవచ్చును. డబ్బును యథార్థముగా లెక్కించి సువార్త ప్రకటించుటకును, బీదలకుసహాయము చేయుటకును ఉపయోగించవలెను. ఈ ఆరాధన క్రియలన్నియు వారములో మొదటి దినమైన ప్రతి ఆదివారమున జరిగించవలెను (అపొ.కా. 20:7).

4. ప్రతి ఆదివారమున నీ యింటిలో కూటము జరిగించుట మాత్రమే కాక నీ ఊరిలోనే మరింకొక చోటగాని, మరింకొక ఊరిలో గాని అట్టి కూటములు జరిగించుటకు ఏర్పాటు చేయవలెను. ఈ కూటములో ఎవరైనను సువార్తకు లోబడువరకు నీవు సువార్తను బోధించుట మాత్రము జరుగవలెను. వారు సంఘ సభ్యులైన తరువాత ఇంతకు ముందు చెప్పిన రీతిగా ఆరాధన కూటములను జరిగించవచ్చును. క్రొత్త నిబంధనలో చెప్పబడిన ప్రకారము ఇతరులు రక్షింపబడి సంఘ సభ్యులగుటకు ఏమి చేయవలెనో నీవు వారికి బోధించవలెను. వారు ప్రతీవారము దేవుని నారాధించు విధానమును క్రైస్తవ జీవితము జీవించు విధానమును వాక్యము నుండి వారికి

బోధించుము. నీవు ఈ పనిని చేసిన యెడల దేవుడు తప్పక నిన్ను దీవించును.

5. ఆరాధనలోను, బోధలోను జీవితములోను నీవు ప్రభువునకు నమ్మకముగా యుండుము. దేవుని సత్యమును వ్యాపింపజేయుటకు నీ శక్తి కొలది పనిచేయుము. నీవు ఉన్నచోటుననే నీవు క్రైస్తవుడవై క్రీస్తు సంఘ సభ్యుడవు కాగలవని జ్ఞాపకముంచుకొనుము. కావలసిన దంతయు ప్రభువునకు నీవిధేయతయే.

మేము నీకు తోడ్పడగలమని నీవనుకుంటే, తప్పక మమ్మును సంప్రదించుము.

# 13. క్రీస్తు నామము

## ( The Name of Christ )

క్రొత్త నిబంధన చదువునప్పుడు క్రీస్తు నామము అనేక మారులు చెప్పబడి యుండుటలో మనము ఆశ్చర్యపడవచ్చును. పేరు ప్రాముఖ్యము కాదని, పేరులో ఏమియు లేదని కొందరు వాదించుదురు. ఇది కొన్ని నామముల యెడల సత్యమే కావచ్చును గాని, ప్రభువు నామము అట్టిది కాదు. ఈ క్రింది సంగతులను గమనింపుము :

1. దేవుని ప్రజలు ఒక క్రొత్త నామమునుబట్టి పిలువబడుదురు (యెష 62:2). మనము క్రొత్త నిబంధనలో చూచినయెడల సంఘము క్రీస్తు నామమును ధరించవలెననియు (రోమా 16:16 1 కొరింథీ 12:13). వ్యక్తిగత సభ్యులు క్రైస్తవులని పిలువబడవలెననియు (అపొ.కా. 11:26) మనకు తెలియుచున్నది.

2. కుటుంబ నామము క్రీస్తు నామము. ఎఫెసీ 3:14, 15 లో పౌలు ఇట్లు పలికెను : "ఈ హేతువు చేత పరలోకము నందును, భూమి మీదను ఉన్న ప్రతి కుటుంబము ఏ తండ్రిని బట్టి కుటుంబమని పిలువబడుచున్నదో ఆ తండ్రి యెదుట నేను మోకాళ్ళూని ప్రార్థించుచున్నాను".

3. సంఘము క్రీస్తు యొక్క పెండ్లి కుమార్తెయని చెప్పబడినది. పెండ్లి కుమార్తె ఆయన పేరును ధరించును (ప్రకటన 21:19 22:17). క్రీస్తుకు ఒకే ఒక్క పెండ్లి కుమార్తె యున్నది. ఆయన తిరిగి వచ్చినపుడు ఆయన నామమును ధరించిన దానికొరకు వచ్చును (ఎఫె 5:27).

4. ఆయన నామము ప్రతినామమునకు పై నామము. "అందు చేతను పరలోకమందున్న వారిలోగాని, భూమి మీద ఉన్నవారిలో గాని, భూమి క్రింద ఉన్నవారిలోగాని, ప్రతివాని మోకాలు యేసు నామమున వంగునట్లును ప్రతివానినాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి, ప్రతి నామమునకు పై నామమును ఆయనకు అనుగ్రహించెను" (ఫిలిప్పీ 2:9-11).

6. క్రీస్తు నామమందు మనము విశ్వాస ముంచవలెను. "దేవుని కుమారుని నామమందు విశ్వాసముంచు మీరు నిత్యజీవము గలవారని తెలుసుకొనునట్లు నేను ఈ సంగతులను మీకు వ్రాయుచున్నాను" (1 యోహా 5:13).

7. క్రీస్తు నామమును ఒప్పుకొనవలెను "ప్రభువు నామమును ఒప్పుకొను ప్రతివాడు దుర్నీతినుండి తొలగిపోవలెను" (2 తిమో 2:19).

8. మారుమనస్సు పొంది క్రీస్తు నామమున బాప్తిస్మము పొందవలెను. "మీరు మారు మనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" (అపొ.కా. 2:38).

9. ప్రభువు నామమున ఆరాధనకు కూడుకొనవలెను. "ఏలయనగా ఇద్దరు ముగ్గురు నా నామమున ఎక్కడ కూడియుందురో అక్కడ నేను వారి మధ్యన ఉందునని" క్రీస్తు చెప్పెను (మత్త 18:20).

10. సమస్తమును ఆయన నామమున చేయవలెను. "మరియు మాటచేత గాని, క్రియచేత గాని మీరేమి చేసినను ప్రభువైన యేసు

ద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు, సమస్తమును ఆయన పేరట చేయుడి" (కొలస్స 3:17)

11. నీతిమంతులు ఆయన నామమును బట్టి హింసింప బడుదురు. "మీరు నా నామము నిమిత్తము అందరిచేత ద్వేషింప బడుదురు. అంతము వరకును సహించినవాడు రక్షింపబడును" (మత్తయి 10:22).

12. క్రీస్తు నామమున ప్రార్థన చేయవలెను. "మీరు నా నామమున దేని నడుగుదురో తండ్రి కుమారుని యందు మహిమ పరచుటకై దానిని చేయును" (యోహా 14:13).

13. క్రీస్తు నామమును దూషించకూడదు. "మీకు పెట్టబడిన శ్రేష్టమైన నామమును దూషించువారు వీరేగదా ?" (యాకోబు 2:7).

14. పాపక్షమాపణ క్రీస్తు నామమున దొరుకును. "చిన్నపిల్ల లారా, ఆయన నామమును బట్టి మీ పాపములు క్షమించబడినవి గనుక మీకు వ్రాయుచున్నాను" (1 యోహా 2:1).

15. ఆయన నామమున కృషి చేయవలెను. "నీవు సహనము కలిగి నా నామము నిమిత్తము భారము భరించి అలయలేదనియు నేనెరుగుదును" (ప్రక 2:3).

16. క్రీస్తు నామము ద్వారా నిత్యజీవము కలుగును. "యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును యివి వ్రాయబడెను" (యోహా20:31).

ఇప్పుడు క్రీస్తు నామము ఎంత ప్రాముఖ్యమైనదో నీవు తప్పక

గ్రహించి యుందువు. అది నిజమయిన యెడల నీవు, నేను వ్యక్తిగతము గాను, సంఘముగాను, క్రీస్తు నామమును ధరించుట అత్యవసరమని నీవు గ్రహింపగలవు. నేను క్రీస్తు సంఘ సభ్యుడను గనుక క్రైస్తవుడను మాత్రమే. నీ సంగతి ఏమి ? నీవు బైబిలు నందు చదువగల సంఘసభ్యుడవా? నీవు క్రైస్తవుడవా ? లేని యెడల ఈనాడే అట్లగుము.

# 14. నీవొక క్రైస్తవునిగా మాత్రము ఉండగలవు

(You can be just a Christian)

మత సంబంధముగా విభజింపబడియున్న లోకములో నేడు మనము జీవించుచున్నాము. వందల కొలది సంఘములు, వేలకొలది పేరులు, బిరుదులు మనకు కన్పించుచున్నవి. ఇవి క్రీస్తు రాజ్యమున కేమియు సహాయము చేయలేవు గాని అనేకులు దిగ్భ్రాంతి నొందుట మాత్రమః జరిగినది. ప్రజలు ఈ మత సంబంధ అలజడిని చూచి, తబ్బిబ్బులై చివరకు భక్తితత్వాన్ని కోల్పోవుట కూడ జరిగినది. అయితే ఇదేనా జవాబు? దీనికంటే శ్రేష్టమైన మార్గము తప్పక యుండకపోదు గనుక మత సంబంధ గందర గోళము జవాబు కానేరదు.

నీవు ఒక క్రైస్తవునిగా మాత్రము యుండుట సాధ్యమేయని నీ వెరుగు దువా ? అవును నీవును, మరి అందరును క్రైస్తవులుగా యుండవలెననెడి ఆశ కలిగియున్నట్లయితే మీరు క్రైస్తవులుగా మాత్రము ఉండుట సాధ్యమే. నీవు క్రీస్తు నామమున ధరించుకొన గలుగగా మనుష్యులిచ్చు పేర్లను, బిరుదులను ఎందుకు కలిగి యుండవలెను ? బైబిలు ఒక్కటియే నిన్ను క్రైస్తవునిగా మాత్రము చేయగలదు.

క్రొత్త నిబంధన కాలములో ప్రజలు క్రైస్తవులుగా మాత్రము ఉండిరి. ఉదాహరణకు, "మొట్టమొదటిగా శిష్యులు అంతియొకయలో క్రైస్తవులన బడిరి" యని మనము చదువగలము (అపొ.కా. 11:26). అయితే ఏ రకమైన క్రైస్తవులు ? అనే ప్రశ్న సహజంగా మనకు రావచ్చును. కాని ఆ కాలమందు వారు కేవలము క్రైస్తవులని మాత్రమే అనబడిరి. మరల పౌలు అగ్రిప్ప రాజుకు బోధించుచుండగా "నన్నింత సులభముగా క్రైస్తవుని చేయజూచు చున్నావే" యని రాజు పలికినట్లు

చదువగలము (అపొ.కా. 26:28). క్రీస్తు ప్రభుని బోధకు లోబడినట్లయిన అతడు క్రైస్తవుడగునని ఈ రాజు ఎట్లెరుగును ? నిజానికి రాజు ఆ సంగతిని ఎరిగినవాడని లేదా దానిని గూర్చి బోధింపబడినవాడని గ్రాహ్యమగుచున్నది. ఎట్లయినను అతడు క్రీస్తుకు లోబడినవాడైన యెడల క్రైస్తవుడ నగుదునని రాజు యెరిగెను. చివరిగా పేతురు యిట్లు వ్రాసెను : "ఎవడైనను క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించిన యెడల అతడు సిగ్గుపడక ఆ పేరును బట్టియే దేవుని మహిమ పరచవలెను" (1 పేతురు 4:16).

క్రైస్తవుడను నామము క్రొత్త నిబంధనలో మూడు సార్లు మాత్రమే ఉపయోగింపబడెను. ప్రతిసారి ఎవరైతే క్రీస్తుకు లోబడియున్నారో అట్టి వ్యక్తులనుద్దేశించి, ఆ పదము నుపయోగింపబడినట్లు విపులముగా తెలియుచున్నది లేదా ఒకడు క్రీస్తుకు విధేయుడైనప్పుడు అతడు క్రైస్తవుడైనట్లు తెలియజేయుటకుపయోగింపబడెను. క్రైస్తవుడనగా క్రీస్తువంటివాడు. క్రీస్తు స్వభావమును ఆత్మను కలిగినవాడు అని యర్థము. ఎవడైనను ప్రభువునకు లోబడి ఆయన నామమును ధరించుకొనకుండ ఎట్లుండగలడు ? క్రీస్తు నామమునగాక మానవకల్పిత నామమును ధరించుకొను వారిలో క్రీస్తు స్వభావము గాని, ఆత్మగాని ఎట్లుండును ? వారు క్రీస్తు వంటి వారెట్లుగును ? అది అట్లు ఎప్పుడు కానేరదుగదా ?

పేరులో ఏ విశేషమును లేదని చాలమంది చెప్పుదురు. అయితే క్రీస్తు నామమునే రక్షణ యున్నదని లేఖనములు చెప్పుచున్నవి (అపొ.కా. 4:12). మరింకొక నామమున రక్షణ లేనేలేదు. కొరింథులో నున్న కొందరు సభ్యులు విభజింపబడి వారిలో ఒకడు నేను పౌలు వాడను, ఒకడు అపొల్లోవాడను మరియొకడు నేను కాఫావాడను, ఇంకొకడు నేను క్రీస్తు వాడనని చెప్పుకొనుట మొదలిడిరి. అయితే

పౌలు వారిని అందుకు మెచ్చుకొనలేదు గాని ఖండించెను. "సహోదరులారా ! మీరందరు ఏకభావముతో మాటలాడవలెననియు, మీలో కక్షలు లేక యేక మనస్సు తోను, ఏక తాత్పర్యముతోను మీరు సన్నద్ధులై యుండవలెననియు మన ప్రభువైన యేసుక్రీస్తు పేరిట మిమ్మును వేడుకొనుచున్నాను" (1కొరింథీ 1:10). వారి బుద్ధి హీనతను బయలుపరచుచూ అతడిట్లనెను : "క్రీస్తు విభజింపబడి యున్నాడా ? పౌలు మీకొరకు సిలువ వేయబడెనా ? పౌలు నామమున మీరు బాప్తిస్మము పొందితిరా ?" (1 కొరింథీ 10:13). అవును, క్రీస్తు విభజింపబడలేదని, ఆయనే వారికొరకు సిలువ వేయబడెనని, ఆయన నామముననే వారు బాప్తిస్మము పొందితిరని వారెరుగుదురు. గనుక వారు మనుష్యుల నామములను ధరించుటకంటె క్రీస్తు నామమును ధరించవలెనని గ్రహింపగుచున్నది. అదే ఈనాడును వర్తించును.

బైబిలునందు వర్తించని పేర్లను బిరుదులను నీవు ధరించుకొని యున్నయెడల బైబిలు బోధించునట్టి క్రైస్తవుడవు కావు. ఒకవేళ బైబిలును బట్టియున్న పేరునే నీవు ధరించుకొనవచ్చును. అయితే దానిని ప్రభువు నీకు ఉద్దేశించని యెడల దానిని నీవు ధరించుటలో పొరబడుచున్నావు. క్రైస్తవుడను పేరుకు ముందుగాని, వెనుకగాని నీ వింకొకటి కల్పించుకొని యున్న యెడల నీవు ప్రభువు నామమును దుర్వినియోగము చేయుచున్నావు. అందుచే నీవు బైబిలు బోధించు రీతిగ క్రైస్తవుడవు కానేరవు. ఏదో ఒకరకమైన క్రైస్తవుడవై నేను క్రైస్తవుడను మాత్రమే యని నీవనుకొనలేవు. అయితే క్రైస్తవుడవు లేదా క్రైస్తవుడవు కానివాడవు.

బైబిలు చదివి దాని ప్రకారము నీవు చేయవలెని మేము నిన్నడుగు

చున్నాము. నీవట్లు చేసిన యెడల నీవు కేవలము క్రైస్తవుడవు మాత్రము కాగలవు. అంతకంటె ఎక్కువ కాదు, తక్కువ కాదు, అది సరిపోవును గదా ? నీవు క్రైస్తవునిగా యుండగలిగినపుడు అంతకంటె హెచ్చు తగ్గులుగా ఎందుకు ఉండవలెను ?

నీవు ప్రభుని మాటలను విని (రోమా 10:17), దేవుని యందు విశ్వాసముంచి (హెబ్రీ 11:6), నీ పాపముల విషయమై మారుమనస్సు నొంది (అపో.కా. 17:30), నీ పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిన యెడల (అపో.కా. 2:38 మార్కు 16:16) అప్పుడు ప్రభువు నిన్ను రక్షించును. నీవొక క్రైస్తవుడవు మాత్రము అగుదువు. నీవు చూపిన ఈ విధేయత నిన్ను ప్రభువు సంఘ సభ్యునిగా చేయును. దానిని గూర్చియే నీవు బైబిలునందు చదువగలవు (అపో.కా. 2:47 మత్త 16:18 రోమా 16:16).

నీవు క్రైస్తవుడు మాత్రమై క్రీస్తు సంఘ సభ్యునిగా నుండి యెడల నీవు సరియైన మార్గము నందున్నట్లు ఎరుగుదువు. నీవు క్రీస్తు నామము ధరించి, ఆయన సంఘ సభ్యుడని అందరు సంతోషముతో చెప్పుకొనవచ్చును. దీనిని బట్టి నీవు ఒక మతశాఖకు చెందినవాడవు కావనియు మనుష్యుల బోధల ననుసరించుట లేదనియు, నీవు చేయుభక్తి పూర్వక పనులన్నిటికి బైబిలు నుండి నిరూపణ నీయగలవనియు అర్థము. అప్పుడు మాటచేత గాని, క్రియచేతగాని మీరేమి చేసినను ప్రభువైన యేసు ద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు, సమస్తమును ఆయన పేరట చేయుడియని పౌలు ఎందుకు చెప్పెనో గ్రహించి ఆనందముతో నుండగలవు (కొలస్స 3:17).

# 15. క్రైస్తవ్యము నీకేమి చేయగలదు

(What Christianity can do for you)

ప్రపంచములో క్రైస్తవ్యము చేసినంత మేలును మరొకటి ఏమియును చేయలేదు. దాని నంగీకరించువారు కూడ దానిలన మార్చబడిరి. మానవుడు ఎంత చెడ్డవాడైనను దాని ప్రభావము వలన అతడు అంత మంచివాడాయెను. క్రైస్తవ్యము రానియెడల ఈ లోకసంగతి ఎట్లుండునో ఒక్కసారి ఆలోచించుము. అప్పుడు మనము నిజానికి జీవించుచున్నట్లయిన జీవించుటకిది దౌర్భాగ్యస్థలమై యుండును.

మానవజాతికి అంతటికి క్రైస్తవ్యము ఎంతో చేసినను అది స్వభావికముగా వ్యక్తిగతమైనది. మనము దానినుండి గొప్ప మేలులను పొందవలెనంటే మనము దానిని అంగీకరించుటకు మొదలిడ వలసినదే, దానికి కర్తయైన యేసుక్రీస్తు యొక్క బోధలను బట్టి నడుచుచు విధేయత చూపించుట వలన మాత్రమే ఇది జరిగించ బడును. అట్లు చేయుట ద్వారా నీతి సూత్రములు మన జీవితమునందు ప్రవేశించును. వాటిని ఫలింపజేయుటకు మనమవకాశం ఇచ్చునంత మట్టుకు మనము దీవింపబడుదుము.

క్రైస్తవ్యము నంగీకరించిన తరువాత చెప్పరానన్ని దీవెనలు, మేళ్ళు కలుగునని కొందరు భావించెదరు. అట్టి వారు ధనవంతుల మగుదుమని, వారికున్న సమస్త సమస్యలు ఏమియు చేయనవసరం లేకుండగనే పరిష్కారమవునని భావించెదరు. నిజానికి ఆత్మీయ సంగతులపై ఆసక్తి లేక యిహలోక సంబంధమైన లాభములు నపేక్షించు వారు ఇట్లు ఆలోచించెదరు. వారి కలలు నెరవేరక

పోవుటచే త్వరలో నిరాశ జెంది వారు మరొకవైపు అతి సులభముగా మరలుదురు.

క్రైస్తవ్యము సూక్ష్మమైనది. ఎవరు దాని విలువను కనుగొనగలరో అట్టివారి కొరకందనేక మేలులు కలవు. విశ్వాసము, విధేయత, సేవ, నమ్మకత్వము అను వాటి రూపమందు దాని మూల్యము కలదు. ఎవరు దానిని హృదయపూర్వకముగా అంగీకరించిరో వారనేక రీతులుగ భౌతికముగను ఆధ్యాత్మికముగాను దవించబడిరి. అట్టిదే నీకును సంభవింపగలదు.

1. గత పాపముల నుండి రక్షణను క్రైస్తవ్యము నీకు తేగలదు. తనకు విధేయులైన వారందరికి క్రీస్తు నిత్య రక్షణకు కారకుడాయెను (హెబ్రీ 5:9). "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును. నమ్మనొల్లని వానికి శిక్ష విధించబడునని" ఆయన చెప్పెను (మార్కు 16:16). మనుష్యుడు పాపి గనుక క్షమాపణ నొందుట అవుసరము. మనుష్యుని అతి ప్రాముఖ్యమైన ఆత్మను కడిగి ఆయన పరిశుద్ధ పరచగలడు (లూకా 19:10 మత్తయి 26:26).

2. దేవుని వాగ్ధానము లనేకముల యొద్దకు క్రైస్తవ్యము నిన్ను చేర్చగలదు. పరిశుద్ధాత్మ అను వరము (అపొ.కా. 2:38), సంఘముతో చేర్చబడుట (అపొ.కా. 2:47), ప్రభుని సన్నిధి (మత్త 28:20), ప్రార్ధన చేయు తరుణము (యోహా 9:31), నిత్య జీవిత నిరీక్షణ యను వాగ్ధానములన్నియు క్రైస్తవుని కీయబడినవి.

3. క్రైస్తవ్యము అర్ధికముగాను, ఆత్మీయముగాను మేలు చేయును. "కాబట్టి మీరు ఆయన రాజ్యమును, నీతిని మొదట వెదకుడి అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును" అని క్రీస్తు బోధించెను

(మత్తయి 6:33). మనము మొదట దేవుని రాజ్యమును లేదా సంఘమును ఉంచితేనే అవన్నియు మనకు అనుగ్రహింపబడునని గ్రహించుము. క్రైస్తవులు అనేకమారులు వారు యింకా ఎక్కువగా ఎందుకు దీవించబడుట లేదో యని తలంచుచుందురు. అయితే వారు ప్రభువు కొరకు ఎంత తక్కువ చేయుచున్నారో గమనించాలి. మత్తయి 5వ అధ్యాయమును చదవండి.

4. మనము మేలు చేయుటకు క్రైస్తవ్య మవకాశములు నిచ్చును. "ఒకని భారముల నొకడు భరించి ఈలాగున క్రీస్తు నియమమును పూర్తిగా నెరవేర్చుడి" (గలతీ 6:1). కాబట్టి మనకు సమయము దొరికిన కొలది అందరి యెడలను, విశేషముగా విశ్వాస గృహమునకు చేరిన వారి యెడలను మేలు చేయుదము" (గలతీ 6:10).

5. ఎంత ఎక్కువగా మనము యిస్తే అంత ఎక్కువగా మనము పొందుదుమని క్రైస్తవ్యము బోధించుచున్నది. పౌలు కొరింథులో నున్న సహోదరుల నిట్లు హెచ్చరించెను. "కొంచెముగా విత్తువాడు కొంచెముగా పంటకోయును. సమృద్ధిగా విత్తువాడు సమృద్ధిగా పంటకోయును" (2 కొరింథీ 9:6). "మనుష్యుడు ఏమి విత్తునో ఆ పంటనే కోయును" (గలతీ 6:7). ఏమియు యియ్యనందున అనేకులు ఏమియు పొందరు సరిగదా ఎందుకు పొందుట లేదాయని వారు తలంచెదరు.

6. పుచ్చుకొనుటకంటె యిచ్చుట మేలని క్రైస్తవ్యము బోధించు చున్నది. యేసే దానిని చెప్పెను (అపో.కా. 20:35). "తన ప్రాణమును దక్కించుకొనగోరువాడు దానిని పోగొట్టుకొనును గాని నా నిమిత్తము తన ప్రాణము పోగొట్టుకొనువాడు దానిని దక్కించుకొనును" అని

ఆయన చెప్పెను (మత్తయి 10:39).

7. ఇహము నుండి పరమునకు పోవు జీవ మార్గమును క్రైస్తవ్యము చూపించుచున్నది. "మనుష్యులు మీకేమి చేయవలెనని మీరు కోరుదురో అలాగున మీరును వారికి చేయుడి" యని యేసు బోధించుచున్నాడు (లూకా 6:31). మనుష్యుడు తన శత్రువులను ప్రేమింపవలెననియు (మత్త 5:44), తనవలె తన పొరుగువారిని ప్రేమింపవలెననియు (మత్త 22:39), ఆయన చెప్పుచున్నారు. క్రైస్తవుడు ఈ లోకమును ప్రేమింపక (1 యోహా 2:15), తనను తాను పవిత్రునిగా నుంచుకొనుచు (మత్త 5:8), దేవునికి సజీవ యాగముగా అర్పించుకొనవలెను (రోమా 12:1). చివరకు దొరకు ఫలితమేమనగా శాంతి, సంతోషము, నిత్యజీవ నిరీక్షణ గల మంచి జీవితము (కొలస్స 1:5). ఇంతకంటె ఎక్కువ ఏమి కావలెను ?

గనుక క్రైస్తవ్యము చాలా లాభదాయకమైనది. గాని ఒకడు దానిలో ఏమి వెచ్చించునో దానినే తిరిగి పొందును. నీవు దానికొరకై ఏమియును వెచ్చించుట లేనియెడల దాని నుండి ఏమియును దొరుకునని నీవు కనిపెట్టవద్దు. గాని నిన్ను దేవునికి సమర్పించుకొని దాని సూత్రములను నీ జీవితములో పనిచేయుట కవకాశమిచ్చిన యెడలనీవూహించు దాని కంటె ఎక్కువగా ఆశీర్వదించబడుదువు.

# 16. క్రైస్తవులు కాని కొందరు

(Some who are not Christians)

అనేకులు క్రైస్తవులమని చెప్పుకొందరు. అయితే ఆలాగున చెప్పుకొనువారందరు క్రైస్తవులు కారు. ఇది ఒక గొప్ప దెబ్బవలె నీకు తగులవచ్చును. అయినను ఇది నిజమే.

1. క్రైస్తవులమని చెప్పుకొను తల్లిదండ్రులకు ఒకడు పుట్టిన యెడల అతడు క్రైస్తవుడు కానేరడు. మానవమతములు కొన్నింటిలో ఒకడు జన్మముతోనే బౌద్ధుడని, హిందువుడని, ముస్లిముడని చెప్పబడునని నే నెరుగుదును. ఒక విధంగా చూచిన ఈ సంగతి కేథలిక్కులకు కూడా వర్తించుచున్నది. అయితే పవిత్రమైన క్రొత్త నిబంధన క్రైస్తవ్యములో ఇది వర్తించదు. క్రైస్తవ కుటుంబములో జన్మించిన మాత్రముననే ఎవడును క్రైస్తవుడు కానేరడు. ఒకడు క్రీస్తునందు విశ్వసించి ఆయనకు విధేయుడై, తిరిగి జన్మించుట ద్వారా దేవుని కుటుంబములో ప్రవేశించినప్పుడే అతడు నిజముగా క్రైస్తవుడని చెప్పుకొనవచ్చును (యోహాను 3:3–6).

2. పుట్టినప్పుడే ఎవడైనను చిలకరింపు పొందితే దానిని బట్టి అతడు క్రైస్తవుడు కానేరడు. మొదటిగా బాప్తిస్మము చిలకరింపు కాదు గాని అది నీటి సమాధి (కొలస్స 2:12 రోమా 6:3, 4 అపొ.కా. 8). రెండవదిగా బాప్తిస్మము పొందుచున్న వాడు ముందు దేవుని వాక్యమును విని (రోమా 10:17), దానినినమ్మి (రోమా 10:10), తన పాపముల విషయమై మారుమనస్సు పొంది (లూకా 13:3) యేసు దేవుని కుమారుడని ఒప్పుకొనిన మీదటనే బాప్తిస్మము పొందలెను. బాప్తిస్మము పొందబోవుచున్న వానికొరకు ఈ క్రియలను

మరియొకడు చేయలేడు. మూడవదిగా, చిన్న పిల్లలు బాధ్యత యుక్తవయస్సు వచ్చువరకు వారు అమాయకులే (మత్తయి 18:1-3). గనుక పుట్టినప్పుడే చిలకరింపు పొందినను, మరింకెప్పుడు చిలకరింపు పొందినను, పొందినయతడు క్రైస్తవుడు కానేరడు. క్రీస్తుకు లోబడినప్పుడే ఒకడు క్రైస్తవుడు కాగలడు. చిలకరింపు దేవుని ఆజ్ఞ కాదు గాని మానవ కల్పితమైనది.

3. క్రీస్తు దేవుని కుమారుడని ఎవరైనను నమ్ముచున్న యెడల ఆ నమ్మికను బట్టి మాత్రమే వారు క్రైస్తవులు కానేరరు. క్రీస్తు దేవుని కుమారుడని మనము తప్పక నమ్మవలయును. అయితే యిది మాత్రమే చాలదు. నమ్మికయుంచిన మాత్రముననే ఒకడు క్రైస్తవుడు కానేరడు. అట్లయితే నిజానికి దయ్యములు కూడ క్రైస్తవులగును ఏలయనగా దయ్యములును నమ్మి వణకుచున్నవి బైబిలు చెప్పుచున్నది (యాకోబు 2:19). ఒకడు క్రైస్తవుడు కావలెననిన అతడు క్రీస్తునందు విశ్వాసముంచవలెను. ఆ విశ్వాసమును బట్టి యేసు దేవుని కుమారుడని నమ్ముట మాత్రమే గాక, ఆయన బోధనలన్నిటికి లోబడ గల్గునట్టి విశ్వాసము అతడు కలిగియుండవలెను (హెబ్రీ 5:8, 9 1 పేతురు 2:21). అంతేకాదు అతడు మరణ పర్యంతము నమ్మకముగా యుండవలెను (ప్రకటన 2:10).

4. ఒకడు ఏదైనా డినామినేషన్‌కు చెందిన సంఘసభ్యుడైనంత మాత్రమున క్రైస్తవుడు కానేరడు. ఈనాడు అనేక సంఘములున్నవి గనుక క్రైస్తవులమని చెప్పుకొనువారనేకులు గలరు. అయితే వారు మోసపోయిరి. క్రీస్తు ననుసరించు వాడెవడును డినామినేషన్ సంఘసభ్యుడు కానేరడు. బైబిలు ఒక్కటి మాత్రమే క్రైస్తవులను చేయగలదు (అపో.కా. 11:26). లేఖనములు మనలను వేరుపచవు

గాని క్రీస్తు నందు మనలను ఏకము చేయును (1 కొరింథీ 1:10). గనుక ఎవడైనను మానవకల్పిత సంఘ సభ్యుడయిన యెడల అతడు క్రైస్తవుడు కాడని యర్థము. అతడన్నిరకముల సాకులను, వాదనలను చేయవచ్చును గాని, అతడు బైబిలు బోధించునట్టి నిజక్రైస్తవుడు కాదనునది యథార్థమై నిలుచును. అతడు నిజంగా క్రైస్తవుడయితే డినామినేషన్ సంఘములో యుండక నిజంగా క్రీస్తు సంఘ సభ్యుడై క్రైస్తవునిగా మాత్రమే యుండును (అపో.కా. 2:47 1 పేతురు 4:16). బైబిలును బాగుగా చదివి నీవే గమనించుము.

5. క్రైస్తవుడని చెప్పుకొనునంత మాత్రమున ఎవడును క్రైస్తవుడు కానేరడు. ఈ లోకములో అనేకులు అనేకరములైన ఆరోపణలను చేసికొనవచ్చును. అయితే వాటిని నిరూపించని యెడల వారు అబద్ధికులు, మోసగాండ్రు అగుదురు. ఇది యిట్లుండగా అనేకులు క్రైస్తవులమని సులభముగా చెబుతూ యుంటారు. అలాగున చెప్పుకొనుచుండువారు క్రైస్తవులేయని చాలమంది కూడ భావించెదరు, అది అట్లు కాదు. ఒకడు దేవుని వాక్యము మూలమగును, తన జీవిత మూలముగను క్రైస్తవుడయినట్లు నిరూపించలేనియెడల అతడెన్ని ఆరోపణలు చేసికొనుచున్నను క్రైస్తవుడు కానేరడు (మత్తయి 7:21-23).

నీ స్థితిని నీవే పరీక్షించుకొనుమని నీకు మనవి చేయుచున్నాను. నీవు క్రైస్తవుడవా ? నీవు బైబిలు బోధనల ప్రకారము ఉన్న వానివా ? దానిని ఋజువు పర్చగలవా ? నీవు ప్రభువునకు లోబడితివా ? నీవు ఆయన యెడల నమ్మకముగా నున్నావా ? లేనియెడల నీవు ఆయనయందు విశ్వసించి, పాపముల విషయమై మారుమనస్సు పొంది, క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొని నీ పాపక్షమాపణ కొరకు

బాప్తిస్మము పొందుట ద్వారా క్రైస్తవుడవుకమ్ము (మార్కు 16:15, 16 అపొ.కా. 2:38). క్రీస్తు నిన్ను రక్షించి, తన సంఘముతో చేర్చుకొనును (అపొ.కా. 2:47). అప్పుడు నీవు క్రైస్తవుడవు మాత్రమే కాగలవు (అపొ.కా. 11:26). నీవు నమ్మకముగా నున్న యెడల నిత్యరక్షణ నీదగును (రోమా 6:23 యోహాను 14:1-3).

# 17. రక్షణ పొందుట యెట్లు ?

(What must one do to be Saved ? )

అందరు పాపము చేసినవారే (రోమా 3:23). నీతిమంతుడు ఒక్కడును లేడు (రోమా 3:10). పాపముల వలన వచ్చు జీతము మరణము (రోమా 6:23). ఇట్టి విధమైన అనేక వచనములను మనము చెప్పుకొనవచ్చును. వీటన్నిటిని బట్టి మనుష్యుడు నశించిపోయెనని, దేవుని కోల్పోయి నిరీక్షణ లేని వానిగయుండెనని తెలియవచ్చుచున్నది. గనుక మనుష్యుడు రక్షణ పొందుట యెట్లు ? మనము అపొస్తలుల కార్యములు అను పుస్తకమును చదివిన యెడల తెలిసికొనగలము.

మార్పు నొందిన వారిని గూర్చి తెలుపు 11 సంఘటనలు అపొస్తలుల కార్యములలో వ్రాయబడియున్నవి. మనకిక్కడ సమయము, స్థలము లేనందున వారందరు రక్షణ పొందుటకు ఏమేమి చేసిరో విపులముగ వ్రాయుటకు వీలులేదు. అయితే ఈ పాఠ్యభాగమందు మూడు సంఘటనలను వివరించుకొందము. ప్రతి సంఘటనలలోను ఇంచుమించు ఒకే ప్రశ్న ఏమనగా “రక్షణ పొందుటకు నేనేమి చేయవలెను ?” పై సంఘటనలను ఒక్కొక్క దానిని గమనించుచు జవాబును పొందుదము దయచేసి గమనించండి.

1. పెంతెకోస్తు దినమున “అయ్యలారా, మేమేమి చేతుము ?” అని ప్రజలు ప్రశ్నించిరి (అపొ.కా. 2వ అధ్యా).

ఇక్కడ అపొస్తలుడైన పేతురు, మిగిలినవారు అవిశ్వాసులకు

మొదటిసారిగా సువార్తను బోధించిరి. క్రీస్తు నిజంగా సిలువ వేయబడినప్పుడు దానిలో అనేకులు పాల్గొనిరి. గనుక అట్టివారిలో క్రీస్తే దేవుని కుమారుడను విశ్వాసము మొదట కలిగించవలెను. అందుకొరకు నజరేయుడైన యేసు చేత అద్భుతములను మహత్కార్యములను, సూచక క్రియలను వారి మధ్యను దేవుడు చేయించెనని పేతురు వారికి జ్ఞాపకము చేసెను. యేసును సిలువ వేయించి చంపినను, ఆయన మూడవ దినమున సమాధి నుండి తిరిగి లేచినట్లును, ఆయన వారికి కన్పడినట్లును, పరలోకపు తండ్రి యొద్దకు తిరిగి ఎక్కిపోయినట్లును, పేతురు వారికి బోధించెను. క్రీస్తును గూర్చి అనేక ప్రవచనములన్నిటిని ఆయన నెరవేర్చెననియు, ఆయన ఇప్పుడు దావీదు సింహాసనాసీనుడై యున్నట్లును అతడు చెప్పెను. "వారు ఈ మాట విని హృదయములో నొచ్చుకొని సహోదరులారా, మేమేమి చేతుమని పేతురును, కడమ అపొస్తలులను అడుగగా, పేతురు - మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి. అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు. ఈ వాగ్దానము మీకును మీపిల్లలకును, దూరస్థులందరికిని, అనగా ప్రభువైన మన దేవుడు తన యొద్దకు పిలిచిన వారి కందరికిని చెందునని వారితో చెప్పెను" (అపొ.కా. 2:37-39). "కాబట్టి అతని వాక్యము నంగీకరించిన వారు బాప్తిస్మము పొందిరి. ఆ దినమందు ఇంచుమించు మూడువేలమంది చేర్చబడిరి" (అపొ.కా. 2:41). మరియు ప్రభువు రక్షణ పొందుచున్న వారిని అనుదినము వారితో (సంఘముతో చేర్చుచుండెను (అపొ.కా. 2:47).

సువార్త బోధింపబడెను, ప్రజలు దానిని విశ్వసించిరి.

మారుమనస్సు పొందిరి. పాక్షమాపణ కొరకు బాప్తిస్మము పొందిరని దయచేసి గమనిం చుము. అయితే ఏమి జరిగెను ? వారు రక్షింపబడి సంఘముతో చేర్చబడిరి.

2. "ప్రభువా, నేనేమి చేయవలెను?" అని పౌలు ప్రశ్నించెను (అపొ.కా. 22:10).

తనకున్న శక్తినంతటిని ప్రభువు సంఘమును నాశనము చేయవలె నని ప్రయత్నించుచు, క్రీస్తును హింసించుచున్న మనుష్యుడు ఇతడు. అతడు దమస్కునకు ప్రయాణము చేయుచుండగా ప్రభువు అతనికి అగుపడెను. "అతడు ప్రయాణము చేయుచు దమస్కు ద్గరకు వచ్చినప్పుడు అకస్మాత్తుగా ఆకాశము నుండి యొక వెలుగు అతని చుట్టు ప్రకాశించెను. అప్పుడు అతడు నేలమీద పడి, సౌలా, సౌలా, నీవేల నన్ను హింసించు చున్నావని తనతో ఒక స్వరము పలుకుట వినెను. ప్రభువా, నీవెవడవని అతడడుగగా ఆయన - నేను నీవు హింసించుచున్న యేసును లేచి పట్టణములోనికి వెళ్ళుము. అక్కడ నీవు ఏమి చేయవలెనో అది నీకు తెలుపబడునని చెప్పెను". అతడు పట్టణములోనికి వెళ్ళి మూడు దినములు చూపులేక అన్నపానము లేమియు పుచ్చుకొనక ప్రార్థించు చుండెను. దమస్కులోని అననీయ అను శిష్యునికి ప్రభువు దర్శనమందు కన్పడి, సౌలు ఏమి చేయవలెనో చెప్పుటకు అతనిని అననీయ నొద్దకు పంపించెను. పౌలు తనకు జరిగిన ఈ అనుభవమును గూర్చి చెబుతూ అననీయ అతని యొద్దకు వచ్చి "గనుక నీవు తడవు చేయుట ఎందుకు? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగి వేసుకొనుమని" చెప్పెననెను (అపొ.కా. 22:16).

పౌలు ఎప్పుడు రక్షింపబడెను ? ప్రభువు అతనికి కనబడినప్పుడు అని కొందరు అంటారు. అయితే అతడు పట్టణములోనికి వెళ్ళగా అతడేమి చేయవలెనో తెలుపబడునని ప్రభువు చెప్పెను. అతడు ప్రార్ధన ద్వారా రక్షింపబడెనని కొందరందురు. అది నిజమే. అయితే నీవు లేచి బాప్తిస్మము పొంది, నీ పాపములను కడిగివేసుకొనుమని అననీయ అతనితో ఎందుకు చెప్పెను ? నిజం ఏమంటే, పెంతెకోస్తునాడు ప్రజలు ఎట్లు రక్షింపబడిరో అట్లే అతడును రక్షింపబడెను. అతడు సువార్త వినెను. దానిని విశ్వసించెను. పాపముల నుండి మార్పు పొందెను. ప్రభువును దేవుని కుమారుడని అంగీకరించెను. తన పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందెను.

3. "అయ్యలారా, రక్షణ పొందుటకు నేనేమి చేయవలెను ?" అని ఫిలిప్పీ చెరసాల అధిపతి అరచెను (అపొ.కా. 16).

పౌలు సీలాలు గట్టి దెబ్బలు తిని చెరసాలలో వేయబడిరి. అద్భుత రీతిగ వారందరి బంధకములు ఊడెను. ఖైదీలందరు పారిపోయి రనుకొని చెరసాల అధిపతి భయపడెను. తన కత్తి తీసికొని తన్ను తాను చంపుకొన బోయెను. "అప్పుడు పౌలు - నీవు ఏ హానియు చేసికొనవద్దు. మేమందరము యిక్కడనే యున్నామని బిగ్గరగా చెప్పెను. అతడు దీపము తెమ్మని చెప్పి, లోపలికి వచ్చి, వణకుచు పౌలుకును, సీలకును, సాగిలపడి, వారిని వెలుపలికి తెచ్చెను" (అపొ.కా. 16:28, 29). అయ్యలారా, రక్షణ పొందుటకు నేనేమి చేయవలెనని అతడడుగగా, "అందుకు వారు ప్రభువైన యేసునందు విశ్వాస ముంచుము. అప్పుడు నీవును, నీ యింటి వారును రక్షణ పొందుదురని చెప్పిరి" (అపొ.కా. 16:31). చాలమంది యింతటితో ఆగిపోయి ఈ మనుష్యుడు రక్షణ పొందవలెనంటే చేయవలసినది ఇంతే అని

అందురు. కాని యిదే మొదలు. ఈ మనుష్యుడెవడు ? ఒక అవిశ్వాసి. గనుక అతడు మొదట విశ్వసించుట ఎంతో ప్రాముఖ్యము. అట్లు చేయుటకు వారు "అతనికిని అతని ఇంటనున్నవారి కందరికిని దేవుని వాక్యము బోధించిరి. రాత్రి ఆ గడియలోనే అతడు వారిని తీసికొనివచ్చి, వారి గాయములు కడిగెను వెంటనే అతడును, అతని యింటనున్న వారందరును బాప్తిస్మము పొందిరి. మరియు అతడు వారిని యింటికి తోడుకొనివచ్చి భోజనము పెట్టి దేవునియందు విశ్వాసముంచినవాడై తన యింటివారందరితో కూడ ఆనందించెను" (అపొ.కా. 16:32-34).

ఈ మనుష్యుడు, తన యింటివారు ఏమి చేసిరి ? దేవుని వాక్యమును వారు వినినప్పుడు వారు నమ్మిరి కాని ప్రభువు ఇచ్చిన ఆజ్ఞ ఏమి ? "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును" (మార్కు 16:16). ప్రభువు వాక్యమును వినిన ఫలితముగా అతడు ఖయిదీల గాయములను కడుగుట ద్వారా మారుమనస్సును వ్యక్తపరచెను. రాత్రి ఆ గడియలోనే బాప్తిస్మము పొందెను. పౌలు చేసిన బోధనలో ఈ ఆజ్ఞలు ఒక భాగమై యుండెను. లేని యెడల చెరసాల అధిపతి వాటిని వినియే యుండక పోవును.

ఇప్పుడు మనము రక్షణ పొందుట ఎట్లు ? పై నుదహరింప బడినట్లే. ఒకడు సత్యవాక్యమును వినవలెను. దానిని విశ్వసించవలెను. తన పాపములను గూర్చి మారుమనస్సు పొందవలెను క్రీస్తును ఒప్పుకొనవలెను. బాప్తిస్మము పొందవలెను. ఈ క్రింది వచనములను జాగ్రత్తగా పఠించుము: హెబ్రీ 11:6; రోమా 10:10; లూకా 13:3; అపొ.కా. 17:30; మత్తయి 10:32; మార్కు 16:15, 16; అపొ.కా. 2:38 మొదలగునవి.

## 18. రక్షణ మార్గము

( The Plan of Salvation )

మానవుడు పాపియని బైబిలు బోధించుచున్నది. "అందరును పాపము చేసి దేవుడను గ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారని" పౌలు చెప్పెను (రోమా 3:23). "పాపము వలన వచ్చు జీతము మరణము అని కూడ అతడు చెప్పెను (రోమా 6:23). దీనిని బట్టి మనుష్యుడు రక్షణ పొందుట అవుసరము. అయితే అతడెట్లు రక్షింపబడగలడు ? బైబిలే దీనిని బయలుపరచుచున్నది.

దేవుడు మనుష్యుని చేసెను. అతడు దేవుని నుండి తొలగిపోయినను మరల తిరిగి చేరుటకు దేవుడే మార్గము నేర్పరచెను. ఈ మార్గము అంతయును దేవుని కరుణ, కృప, ప్రేమలపై ఆధారపడి యున్నది (యోహాను 3:16; ఎఫెసీ 3:8, 9). మనుష్యుడు ఆయన యొద్దకు రావలెనని దేవుడు ఒత్తిడి చేయడు కాని రమ్ము అని ఆయన ఆహ్వానించు చున్నాడని జ్ఞాపకముంచు కొనవలెను. అట్లు చేయువారు తప్పక రక్షణ పొందగలరు.

మానవుడు రక్షణ పొందుటకు దేవుడు 5 చిన్న మెట్లను మాత్రమే ఉంచియున్నాడు :

1. ఒకడు సత్యమును వినవలెను. "ఈయన నా ప్రియ కుమారుడు, ఈయన యందు నేనానందించుచున్నాను. ఈయన మాటలను వినుడి" (మత్తయి 17:5). "కాగా వినుట వలన విశ్వాసము

కలుగును వినుట క్రీస్తును గూర్చిన మాట వలన కలుగును" (రోమా 10:17).

2. ఒకడు దేవుని యందును, క్రీస్తు దేవుని కుమారుడనియును విశ్వాసముంచవలెను. "విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్ను వెదకువారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెను" (హెబ్రీ 11:16). "మీరు దేవుని యందు విశ్వాసముంచుచున్నారు. నాయందును విశ్వాస ముంచుడి"యని క్రీస్తు చెప్పెను (యోహా 14:1). "కుమారుని యందు విశ్వాసముంచువాడే నిత్యజీవము గలవాడు, కుమారునికి విధేయుడు కానివాడు జీవము చూడడు గాని దేవుడు ఉగ్రత వాని మీద నిలిచి యుండునని" క్రీస్తు చెప్పెను (యోహా 3:36). ఇంకను అనేక వచనములను మనము ఇక్కడ చూపవచ్చును గాని వీటిని బట్టియే రక్షణ పొందుటకు విశ్వాసము అతి ప్రాముఖ్యమని నీవు గమనించగలవు. అయితే ఇందులో ఏ ఒక్కటియు విశ్వాసము మాత్రముననే రక్షణ దొరుకునని బోధించుట లేదని గమనించుము.

3. ఒకడు తన పాపముల విషయమై మారుమనస్సు పొందవలెను. "మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరు అలాగే నశింతురు" అని క్రీస్తు పలికెను (లూకా 13:3). "ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచిచూడనట్టుగా ఉండెను; ఇప్పుడైతే అంతటను, అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు" అని పౌలు ప్రకటించెను (అపొ.కా. 17:30). "కొందరు ఆలస్యమని యెంచు కొనునట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాడుగాని యెవడును నశింపవలెనని

యిచ్చయింపక, అందరు మారు మనస్సు పొందవలెనని కోరుచు మీ యెడల దీర్ఘశాంతము గలవాడై యున్నాడు". మారుమనస్సు అనగా పాపముల విషయమై మనస్సును మార్చుకొనుటయని అర్థము. పాపము నుండి మరలుట వేరొక దిక్కునకు వెళ్ళుట లేదా పాపములను పరిత్యజించుటయని యర్థము. ఎవడైనను మంచి జీవితమును జీవించవలెననిన అతడు మొదట పాపమునకు స్వస్తి చెప్పవలెను. ఇదే ప్రభువు కోరుచున్నది.

4. ఒకడు క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొనవలెను. "మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొను వాడెవడో పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొందును" అని క్రీస్తు చెప్పెను (మత్తయి 10:32). "ఏలయనగా నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును, రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును. అపొ.కా. 8వ అధ్యాయములో ఐతియోపీయుడైన నపుంసకుడు బాప్తిస్మము పొందక ముందు ఇట్టి ఒప్పుకోలును చేసెను. దీనినే మంచి ఒప్పుకోలు అని సాధారణముగా అందురు. దీనికంటే మంచి ఒప్పుకోలు ఇంకేమి ఉన్నది ?

5. ఒకడు రక్షణ పొందుటకు బాప్తిస్మము పొందవలెను. క్రీస్తు దీనిని విపులపరచెను "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును నమ్మని వానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:16). "మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" (అపొ.కా. 2:38). "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది. అదేదనగా శరీర మాలిన్యము తీసివేయుటకు కాదు గాని యేసుక్రీస్తు పునరుత్థాన

మూలముగా దేవుని విషయము నిర్మలమైన మనస్సాక్షి నిచ్చు ప్రత్యుత్తరమే" (1 పేతురు 3:21). "గనుక నీవు తడవు చేయుట ఎందుకు ? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసుకొనుము" (అపో.కా. 22:16). బాప్తిస్మమొక్కటేయని బైబిలు బోధించుచున్నది (ఎఫెసీ 4:5). అది ఒక సమాధి అది నీటి సమాధి (కొలస్స 2:12 అపో.కా. 8:36-39). ఈ ఒక్క బాప్తిస్మమును తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి పొందవలెను (మత్తయి 28:18-20). అది ఒకనిని క్రీస్తునందును, ఆయన సంఘమునందును చేర్చును (రోమా 6:3 1 కొరింథీ 12:13).

ఈ చిన్న ఆజ్ఞలకు లోబడుట ద్వారా ఒకడు తన గత పాపముల నుండి రక్షింపబడి, ప్రభువు సంఘముతో చేర్చబడును. అతడు క్రైస్తవుడై, తన జీవిత కాలమంతయు నమ్మకముగా దేవుని సేవించిన యెడల మోక్ష రాజ్యము అతనిదగును. పైన చెప్పబడిన సంగతులను గూర్చి ఈదినమే చర్య తీసుకొనుమని మిమ్మును హెచ్చరించు చున్నాము.

# 19. క్రీస్తు లోనికి మెట్లు

( Steps into Christ )

మనము పొందవలసిన దీవెనలన్నియును క్రీస్తునందున్నవని లేఖనములు బోధించుచున్నవి. అందు రక్షణయను దీవెన చాలా ప్రాముఖ్యమైనది. వానిలో కొన్నింటిని యిక్కడ వినుము : "కాగా ఎవడైనను క్రీస్తు నందున్న యెడల వాడు నూతన సృష్టి పాతవి గతించెను. యిదిగో సమస్తమును క్రొత్తవాయెను" (2 కొరింధి 5:17). "మన ప్రభువైన యేసు క్రీస్తు యొక్క తండ్రియగు దేవుడు స్తుతింపబడునుగాక. ఆయన క్రీస్తు నందు పరలోక విషయములలో ఆత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదమును మనకనుగ్రహించెను" (ఎఫెసీ 1:3). "ఈ సంకల్పమును బట్టి ఆయన పరలోకములో ఉన్నవే గాని, భూమి మీద ఉన్నవే గాని, సమస్తమును క్రీస్తు నందు ఏకముగా సమకూర్చవలెనని తనలో తాను నిర్ణయించుకొనెను" (ఎఫెసీ 1:10).

ఈ దీవెనలన్నియును క్రీస్తునందున్నందు వలన క్రీస్తు లోనికి ప్రవేశించుట యెట్లు అని సహజముగా మనము అడుగువచ్చును. దీనికి జవాబు నిచ్చుటకు మరల మనము దేవుని వాక్యము వెదుకవలెను. మనము దానిని చదువుచుండగా మనము ఎక్కవలసిన కొన్ని మెట్లున్నవని యర్థమగును. అందున్న ప్రతిమెట్టు, మరింకొక మెట్టువలె బహు ప్రాముఖ్యమైనది. ఈ అఖరి మెట్టును దాటగానే క్రీస్తునకు వెలుపల ఉన్నవాడు క్రీస్తు లోనికి మార్పు చెందును. ఏదైనా ఒక భవనములో మనము ప్రవేశింప వలెననిన, దానికి ముందున్న మెట్లన్నిటిని దాటినను, అఖరి మెట్టును దాటిన తరువాతనే మనము ఆ భవనములోనికి ప్రవేశింపవచ్చును. క్రీస్తు లోనికి నడిపించు మెట్లు

కూడ అంతే. అవి గ్రహించుకొనలేనంత కష్టతరమైని కావు. ఇప్పుడు ఆ మెట్లు ఏమిటో చూతము :

1. మొట్టమొదటి మెట్టుగా ఒకడు క్రీస్తును గూర్చి గాని దేవుని గూర్చి గాని వాక్యమును వినవలెను. ఆయన రూపాంతరము పొందినప్పుడు "ఈయన నా ప్రియ కుమారుడు, ఈయన యందు నేనానందించు చున్నాను. ఈయన మాటలను వినుడి" యని దేవుడు క్రీస్తును గూర్చి పలికెను (మత్తయి 17:5). "కాగా వినుటవలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును" అని పౌలు బోధించెను (రోమా 10:17). అందువలననే అపోస్తులులందరు సర్వలోకానికి సువార్త ప్రకటింపవలెనని క్రీస్తు ఆజ్ఞాపించెను. ఎవడైనను క్రీస్తును గూర్చి వినకపోయిన యెడల విధేయుడు కానేరడు.

మొదటి మెట్టు చాలా ప్రాముఖ్యమైనది. అయితే అది ఒక్కటి మాత్రమే క్రీస్తులోనికి చేర్చదు. మనము ఇక్కడే ఆగిపోయిన యెడల అది విచారకరమగును.

2. రెండవ మెట్టు : ఒకడు దేవుని యందును, యేసుక్రీస్తు దేవుని కుమారుడనియు విశ్వసించవలెను. "విశ్వాసము లేకుండ దేవుని ఇష్టుడై యుండుట అసాధ్యము దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్ను వెదకువారికి ఫలము దయచేయు వాడనియు నమ్మవలెను (హెబ్రీ 11:6). "మీరు దేవుని యందు విశ్వాసముంచు చున్నారు. నాయందును విశ్వాసముంచుడి" యని క్రీస్తు నుడివెను (యోహా 14:1). "కాగా మీ పాపములలోనే యుండి మీరు చనిపోవుదురని మీతో చెప్పితిని. నేను ఆయననని మీరు విశ్వసించని

యెడల మీరు మీ పాపము లోనే యుండి చనిపోవుదురని క్రీస్తు వారితో చెప్పెను" (యోహా 8:24).

గనుక రక్షణ పొందవలెననిన విశ్వాసము ప్రాముఖ్యమని వేరే చెప్పనవుసరము లేదు. అయితే విశ్వాసము మొక్కటి మాత్రమే మనలను రక్షించదు. క్రీస్తులోనికి చేర్చదు. అయితే రక్షణ మార్గములో వేసిన ఒక ప్రాముఖ్యమెట్టు అది. పౌలు ఇట్లు చెప్పుచున్నాడు : "ఏలయనగా నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును. రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును" (రోమా 10:10). గనుక విశ్వాసము రక్షణ పొందు నిమిత్తము అత్యవసరము.

3. మూడవ మెట్టుగా ఒకడు తన పాపముల విషయమై మారు మనస్సు పొందవలెను. విచక్షణ జ్ఞానము కలిగిన వారందరు దేవుని దృష్టిలో పాపులు, పాపము వలన వచ్చు జీతము మరణము (రోమా 3:23 6:23). గనుక దీనికి పరిష్కారమేమి ? మారుమనస్సు, మారుమనస్సు అనగా నేమి ? అది మనస్సు మార్చుకొనుట, మార్పు నొంది వేరొక మార్గమున నడచుట, జీవితము నందున్న పాప మంతటిని పరిత్యజించుట. అట్లు చేయుట ద్వారా మేలైన జీవితమును జీవించుట. మానవుడుతన పాపములలో రక్షింపబడనేరడని క్రీస్తు ఎరిగినవాడై యుండి ఇట్లు చెప్పెను : "మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరును ఆలాగే నశింతురు" (లూకా 13:3). పౌలు ఇట్లు బోధించెను : "ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచి చూడ నట్లుగా ఉండెను. ఇప్పుడైతే అంతటను, అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు" (అపొ.కా. 17:30). పేతురు కూడ ఇట్లు ప్రసంగించెను : "మీరు మారు మనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున

బాప్తిస్మము పొందుడి అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" (అపో.కా. 2:38).

ఒకడు ప్రభుని తన హృదయపూర్వకముగా విశ్వసించి తన పాపముల నుండి తిరిగి పోయినను అతడు రక్షింపబడుటకు ఇది మాత్రమే చాలదు. అతడు దాటవలసిన మెట్లు యింకను యున్నవి.

4. నాలుగవ మెట్టుగా ఒకడు యేసుక్రీస్తు దేవుని కుమారుడని తన నోటితో ఒప్పుకొనవలెను. "మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొను వాడెవడో పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొందును" అని క్రీస్తు చెప్పెను (మత్తయి 10:32). అపొస్తలుల కార్యములు 8:37 లో ఒక నపుంసకుడు దీనిని జరిగించినట్లు గమనించగలము. రక్షణ కలుగునట్లు ఒకడు నోటితో ఒప్పుకొనునని మనము గ్రహించితిమి (రోమా 10:10). అయితే ఇంకా మిగిలిన దేమి? క్రీస్తులోనికి, రక్షణ లోనికి జేర్చు ఒక్క ఆఖరిమెట్టుమాత్రమే. పైన చెప్పబడిన మెట్లు అన్నియును అవుసరమే గాని ఈ ఆఖరి మెట్టు చివరిగా క్రీస్తు లోనికి చేర్చును. దాని నొకమారు పరిశీలించెదము.

5. అయిదవ మెట్టుగా ఒకడు తన పాపక్షమాపణ నిమిత్తము క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందుట ద్వారా నీటిలో ముంచబడవలెను. అట్లు చేయుట ద్వారా అతడు క్రీస్తులోనికి ఆయన సంఘములోనికి చేర్చబడును. బాప్తిస్మము యొక్క ప్రాముఖ్యతను ఈ వచనములో మనము తెలిసికొనవచ్చును : మార్కు 16:16; అపో.కా. 2:38; అపో.కా. 22:16; 1 పేతురు 3:21 మొదలగునవి. పౌలు ఇట్లు వ్రాసెను : "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము

ఆయన మరణము లోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా ?" (రోమా 6:3). మరల అతడు ఇట్లు వ్రాసెను : "యేసు క్రీస్తు నందు మీరందరు విశ్వాసము వలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" (గలతీ 3:26, 27).

క్రీస్తు లోనికి ప్రవేశించుటకు ఒక్క మార్గము మాత్రమే యున్నది. అది బాప్తిస్మము అను క్రియ మాత్రమే. అయితే బాప్తిస్మమొక్కటే రక్షించునని దాని అర్థము కాదు. ఇంతకు ముందు చెప్పినట్లు ఈ ఆఖరి మెట్టు దాటడానికి ముందున్న మెట్లు కూడా దాటివచ్చుట చాలా ప్రాముఖ్యము. ఒకడు ఈ మెట్లన్నిటిని దాటిన తరువాత మాత్రమే రక్షింపబడునని గ్రహించుము. ప్రభువు విధించిన షరతులన్నిటిని జరిగించినవాడే రక్షింపబడగలడు. నీవు క్రీస్తు నందు ఉన్నావా ? ఈ మెట్లన్నిటిని దాటకపోతే నీవు క్రీస్తునందు లేవు. ప్రతి ఒక్క మెట్టును దాటి క్రీస్తు లోనికి ప్రవేశించవలెనని నీకు విజ్ఞప్తి చేయుచున్నాము.

# ౨౦. క్రొత్త జన్మ

( The New Birth )

మనమనేక సార్లు తిరిగి జన్మించుటను గూర్చి తిరిగి జన్మించిన క్రైస్తవులను గూర్చి క్రొత్త జన్మను గూర్చియు వినుచుందుము. వాటి భావమేమి ? వాటిని గూర్చి నీవు అడిగిన యెడల క్రీస్తును ఎవరు ఆత్మరక్షకునిగా అంగీకరించెదరో వారికది వర్తించునని సాధారణముగా చెప్పుదురు. ఇంకా ముందుకు నీవు వారి నడిగిన యెడల ఏవోవో చెప్పుదురు. గానిదేవుని వాక్యముతో సమైక్యత కలుగునట్లు వారు దానిని వివరించరు.

ఇది బైబిలు అంశమయినందున దీని విషయమై బైబిలు ఏమి చెప్పుచున్నదో చూడవలెను. మొదటిగా దీనిని గూర్చి బైబిలు నందు వ్రాయబడిన వచనమును చదువుట మంచిది. "యూదుల అధికారి యైన నీకొదేమను పరిసయ్యుడొకడుండెను. అతడు రాత్రియందు ఆయన యొద్దకు వచ్చి – బోధకుడా, నీవు దేవుని యొద్దనుండి వచ్చిన బోధకుడవని మేమెరుగుదుము దేవుడతనికి తోడైయుంటేనే కాని నీవు చేయుచున్న సూచక క్రియలను ఎవడును చేయలేడని ఆయనతో చెప్పెను. అందుకు యేసు అతనితో – ఒకడు క్రొత్తగా జన్మించితేనే గాని అతడు దేవుని రాజ్యమును చూడ లేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను. అందుకు నీకొదేము ముసలివాడైన మనుష్యుడు ఏలాగు జన్మింపగలడు ? రెండవమారు తల్లి గర్భమున ప్రవేశించి జన్మింపగలడా ? అని ఆయన నడుగగా యేసు యిట్లనెను – ఒకడు నీటి మూలముగాను, ఆత్మ మూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చయముగా

చెప్పుచున్నాను. శరీరమూలముగా జన్మించినది శరీరమును, ఆత్మ మూలముగా జన్మించినది ఆత్మయునై యున్నది. మీరు క్రొత్తగా జన్మింపవలెనని నేను నీతో చెప్పినందుకు ఆశ్చర్యపడవద్దు. గాలి తన కిష్టమైన చోటును విసరును నీవు దాని శబ్దము విందువే గాని అది యెక్కడ నుండి వచ్చెనో, యెక్కడికి పోవునో నీకు తెలియదు. ఆత్మ మూలముగా జన్మించిన ప్రతివాడును అలాగే యున్నాడనెను" (యోహా 3:1–8).

ఈ క్రొత్త జన్మ భౌతిక సంబంధమైన జన్మకాదు అని మొదట మనము గమనించవలెను. నీటిని గూర్చి అందు చెప్పబడినందున యిది భౌతిక జన్మయే యని అనేకులు వివరించుటకు పూనుకొందురు. కాని అట్లు కాదు. నీకొదేము కూడ ఇదియొక భౌతిక జన్మయే యని తలంచెను గాని అట్లు కాదు అని ప్రభువు తెలియజేసెను. అది భౌతిక జన్మ కానియెడల ఆత్మీయ జన్మ కావచ్చును. గనుక "ఒకడు నీటి మూలముగాను ఆత్మ మూలముగాను జన్మించితేనేగాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" అని యేసు చెప్పెను (యోహాను 3:5). నిజానికి ఆయన చెప్పుచున్నదేమిటి?

1. ప్రభువు రాజ్యములో ప్రవేశించుటకు ఒకే ఒక్క మార్గము ఉన్నది. దాని ద్వారానే గాక మరింకొక మూలముగ ప్రవేశింపలేడు అని ప్రభువు చెప్పుచున్నారు.

2. ఇక్కడ ఒకడు (మానవుడు) అనుమాట పురుషులకు, స్త్రీలకు వర్తించును గనుక విచక్షణజ్ఞానముగల వారందరు ఆ మార్గముననే రావలెను. పసిబిడ్డలు ఇందు చేర్చబడలేరు.

3. జన్మించుట క్రొత్త జన్మ ఆత్మీయ జన్మయైనందున అందు రెండు ప్రాముఖ్యాంశములున్నవి : నీరు, ఆత్మ. ఇందు ఆత్మ ద్వారా

పుట్టి నీటి ద్వారా జన్మించవలెను.

4. నీరు : ఇందున్న నీరు బాప్తిస్మము సూచించుచున్నది. ఇది సామాన్యమైన నీరు అని నీవు గమనించవలెను. క్రైస్తవ మతములో నీరును ఉపయోగించు క్రియ ఒక్కటే యున్నది, అది బాప్తిస్మము. గనుక ఒకడు నీటిలో బాప్తిస్మము పొందుట ద్వారా పాతిపెట్టబడినప్పుడు (రోమా 6:3, 4), దానిలో నుండి తిరిగి లేచుట లేక క్రొత్తగా జన్మించుట జరుగును.

5. ఆత్మ: క్రొత్తజన్మలో ఒకడు ఆత్మ ద్వారా పుట్టింపబడినవాడగును. అది యెట్లు ? దేవుని వాక్య మూలముగా వాక్యము ఆత్మ ద్వారా ఈయబడెను. అది మంచి హృదయములో విత్తబడినపుడు, అది జనించి విధేయతకు ఫలించును. విశ్వాసి దేవునికి తన జీవితము నర్పింప నిశ్చయించును. ఐహికము నుండియు, పాపము నుండియు తొలగును. యేసు నందు బాప్తిస్మము పొంది ఒక క్రొత్త మానవుని వలె పాపముల నుండి కడుగబడి దేవుని కుటుంబములో జన్మించినవాడగును. పేతురు ఇట్లు చెప్పుచున్నాడు: “మీరు క్షయబీజము నుండి కాక శాశ్వతమగు జీవము గల దేవుని వాక్య మూలముగా అక్షయ బీజము నుండి పుట్టింప బడినవారు గనుక నిష్కపటమైన సహోదర ప్రేమ కలుగునట్లు మీరు సత్యమునకు విధేయులగుట చేత మీ మనస్సులను పవిత్ర పరచుకొనిన వారైయుండి యొకనినొకడు హృదయపూర్వకముగాను, మిక్కుటముగాను ప్రేమించుడి” (1 పేతురు 1:22, 23). గనుక జనింపజేయుటకు ఆత్మ దేవుని వాక్యమూలముగా పనిచేయును. విధేయత ద్వారా ఒకడు బాప్తిస్మము పొందును. అట్లు అతడు నీటి మూలముగాను ఆత్మమూలముగాను జన్మించును. ఇది సూక్ష్మమైనది.

6. రాజ్యము : ఇది దేవుని రాజ్యము అయిన సంఘము (మత్తయి 16:18, 19). దానిలోనికి ప్రవేశించుటకు ఒకే ఒక మార్గమున్నదని, అది నీటి ద్వారాను ఆత్మమూలముగను జన్మించుట ద్వారానే యని యేసు చెప్పెను.

భౌతిక జన్మకు, ఆత్మీయ జన్మకు గల భేదమును చూపించుటకు యేసు గాలిని ఉదాహరణముగా నిచ్చి చెప్పెను. ఒకడు గాలిని చూడలేక పోయినను దాని ఫలితములను గుర్తింపవచ్చును. అట్లే ఆత్మ కూడ దాని పనులు మనము చూడకపోయినను ఫలితములు మాత్రమే చాల విపులముగ నగుపడును. ఆత్మ వాక్యము ద్వారా పనిచేయును. దాని బోధకు విధేయత చూపుట ద్వారా ఒకడు రక్షింపబడును. ప్రభువు రాజ్యములో ప్రవేశించును మరియు ఆత్మఫలములను ఫలించును (గలతీ 5:22, 23).

రక్షింపబడుటకు గాని, దేవుని రాజ్యమయిన సంఘములో ప్రవేశించుటకు గాని ప్రభువు రెండు మార్గములనుంచలేదు. రక్షణ పొందుటకు చేయవలసిన విధులన్నిటిని గూర్చి క్రొత్త నిబంధనలో యున్న బోధ అంతయు మార్కు 16:16, అపొ.కా. 2:38 మరియు ఇట్టి ఇతర వచనములలో ఐక్యత కలిగినదై యున్నది. ఒకడు సత్యమును వినినపుడు (రోమా 10:17), దానిని విశ్వసించినపుడు (రోమా 10:10), తన పాపముల విషయమై మారుమనస్సు పొందినపుడు (అపొ.కా. 17:30), క్రీస్తును ఒప్పుకొనినపుడు (రోమా 10:10), బాప్తిస్మము పొందినపుడు (అపొ.కా. 2:38; 22:16), అతడు ఈ క్రియలన్నిటి ద్వారా తిరిగి జన్మించినవాడై ప్రభువు సంఘమందు ప్రవేశించును (1 కొరింథీ 12:13; అపొ.కా. 2:47). దేవుని వాక్యము వలన నీవు తిరిగి జన్మించితివా? లేదా? గమనింపుము.

# 21. క్రొత్త నిబంధన బాప్తిస్మము

## ( New Testament Baptism)

బాప్తిస్మము బైబిలు అంశమై యున్నది. బైబిలు లేనియెడల బాప్తిస్మమను క్రియను గూర్చి మనకు ఏమియు తెలియక యుందుము. గనుక దేవుడే దానికి కర్తయని భావించవలెను. దానిని తన వాక్యము ద్వారా ఆయన మనకు బయలుపరచ నుద్దేశించ్చెను. అందువలన దాని సత్యమును గ్రహించుటకు మనము ప్రోత్సహించబడవలెను.

1. ఒక్కటే బాప్తిస్మము ఉన్నది. ఎఫెసీ 4:5లో పౌలు యిట్లు చెప్పుచున్నాడు. "ప్రభువు ఒక్కడే, విశ్వాసమొక్కటే, బాప్తిస్మము ఒక్కటే". వేరే కొన్ని బాప్తిస్మములుండెను గాని, క్రీ॥శ॥ 61 లేక 65 సంవత్సరము నాటికి ఒక్కటే బాప్తిస్మము ఉండెనని ఆత్మావేశలేఖకుడు వ్రాసెను. మానవుడు తరువాత కొన్నిటిని కలిపెను గాని యిట్టిది లేఖనములకు కేవలము వ్యతిరేకముగ నున్నది.

2. బాప్తిస్మము యొక్క అర్థము : కొలొస్స 2:12లో యీలాగున వ్రాయబడెను : "మీరు బాప్తిస్మమందు ఆయనతో కూడ పాతిపెట్టబడిన వారై ఆయనను మృతులలో నుండి లేపిన దేవుని ప్రభావమందు విశ్వాసించుట ద్వారా ఆయనతో కూడ లేచితిరి". మరల "క్రీస్తు యేసు లోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణము లోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా ? కాబట్టి తండ్రి మహిమ వలన క్రీస్తు మృతులలో నుండి యేలాగు లేపబడెనో, ఆలాగే మనమును నూతన జీవము పొందినవారమై నడచుకొనునట్లు మనము బాప్తిస్మము వలన మరణములో పాలు పొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి" (రోమా 6:3, 4). గనుక బాప్తిస్మము ఒక సమాధి.

ఇది చిలకరింపు. కుమ్మరింపు అను వాటిని తక్షణమే తొలగించుచున్నది.

3. బాప్తిస్మము ఒక నీటి సమాది. బాప్తిస్మమొక సమాధి మాత్రమే గాక అది నీటిలో సమాధియని అపొ.కా. 8వ అధ్యాయము బోధించుచున్నది. ఐతియోపియో దేశస్థుడైన నపుంసకుడు మార్పు చెందినపుడు, "వారు త్రోవలో వెళ్ళుచుండగా నీళ్ళున్న యొకచోటికి వచ్చినపుడు నపుంసకుడు ఇదిగో నీళ్ళు, నాకు బాప్తిస్మమిచ్చుటకు ఆటంకమేమని అడిగి రథము నిలుపుమని ఆజ్ఞాపించెను. ఫిలిప్పు నపుంసకుడు యిద్దరును నీళ్ళ లోనికి దిగిరి. అంతట ఫిలిప్పు అతనికి బాప్తిస్మమిచ్చెను. వారు నీళ్ళలో నుండి వెడలివచ్చినపుడు ప్రభువు ఆత్మ ఫిలిప్పును కొనిపోయెను. నపుంసకుడు సంతోషించుచు తన త్రోవను వెళ్ళెను" (అపొ.కా. 8:36-39).

4. బాప్తిస్మము పాపక్షమాపణ కొరకై యున్నది. "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి. అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు" (అపొ.కా. 2:38). అపొ.కా. 22:16ను కూడా చదువుము.

5. బాప్తిస్మము రక్షించును : "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింబడును, నమ్మినవానికి శిక్ష విధింపబడును" అని క్రీస్తు చెప్పెను (మార్కు 16:16). "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము యిప్పుడు మిమ్మును రక్షించుచున్నది అదేదనగా శరీరమాలిన్యము తీసివేయుట కాదుగాని యేసుక్రీస్తు పునరుత్థాన మూలముగా దేవుని విషయము నిర్మలమైన మనస్సాక్షి నిచ్చు ప్రత్యుత్తరమే" (1 పేతురు 3:21). బాప్తిస్మము ఎప్పుడు రక్షించును ? ఆయన ఆజ్ఞపించిన రీతిగ ఎవడు ప్రభువునందు విశ్వాసముంచి, మారుమనస్సు పొంది, ఆయనను ఒప్పుకొని బాప్తిస్మము పొందునో అప్పుడు అది రక్షించును (అపొ.కా.

10:48). అప్పుడే గాని అంతకు ముందు కాదు.

6. బాప్తిస్మము ఒకని క్రీస్తులోనికి తెచ్చును. "యేసుక్రీస్తు నందు మీరందరు విశ్వాసము వలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" (గలతీ 3:26, 27). రోమా 6:3, 4 ను కూడ చదువుము.

7. బాప్తిస్మము ఒకని సంఘములోనికి తెచ్చును. "ఏలయనగా యూదులమైనను, గ్రీసు దేశస్థులమైనను, దాసులమైనను, స్వతంత్రులమైనను, మనమందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి. మనమందరము ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి. మనమందరము ఒక్క ఆత్మను పానము చేసినవారమైతిమి" (1 కొరింథీ 12:13). ఆ శరీరమే సంఘము (కొలస్స 1:18 ఎఫెసీ 1:22, 23).

8. బాప్తిస్మము క్రొత్త జన్మను కలిగించును, "యేసు యిట్లనెను ఒకడు నీటిమూలముగాను, ఆత్మమూలముగాను జన్మించితేనేగాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో చెప్పుచున్నాననెను" (యోహాను 3:5).

9. బాప్తిస్మమందు యేసుక్రీస్తు యొక్క మరణ, సమాధి, పునరుత్థానముల సాదృశ్యము కలదు. రోమా 6 అధ్యాయము చదువుము.

పైన చెప్పబడిన వాక్యమును బట్టి రక్షింపబడుటకు బాప్తిస్మము చాల ప్రాముఖ్యమని విపులపరచబడినది. అట్టి వచనములనేకములు యింకను చెప్పుకొనవచ్చును. గాని నీవు దేవుని ఆజ్ఞానుసారముగ బాప్తిస్మము పొందితివా ? లేనియెడల నీవు తప్పనిసరిగ పొందవలెను.

# 22. బాప్తిస్మము యొక్క ప్రయోజనము

( The Purpose of Baptism )

బాప్తిస్మము ఒక బైబిలు అంశము. లేఖనములలో అది విపుల ముగా విశదపరచబడినను అనేకులు దానిని అపార్థము చేసికొనిరి. వారు దాని ప్రయోజనము నెరుగనందున అది ఒక ప్రధాన సమస్యగా నున్నది. దేవుని వాక్యము దానిని గూర్చి ఏమి బోధించుచున్నది ?

మొట్టమొదటగా ఒకే ఒక్క బాప్తిస్మము ఉన్నదని గ్రహించుము (ఎఫెసీ 4:5). యోహాను బాప్తిస్మము, శ్రమల బాప్తిస్మము మొదలగునవి యుండెను. కాని పౌలు క్రీ॥శ॥ 64వ సం॥లో ఈ సంగతి వ్రాయుసరికి ఒకే బాప్తిస్మముండెను. అది నిజమయితే దేనిని గూర్చి పౌలు తలంచుచుండెనో మన మెట్లు నిర్ణయించగలము? అది సులభమే. మనము చేయవలసినదంతా అపొస్తలుల కార్యములను తిరుగవేసి అందు మార్పు చెందినవారి సందర్భములను పరీక్షించ వలయును. అట్లు చేసినప్పుడు బాప్తిస్మము ఒక సమాధియని, అది నీటి సమాధియని, అది పాపములను కడిగివేయునని, పాపక్షమాపణ కొరకని ప్రభువు దానిని ఆజ్ఞాపించెనని మనము కనుగొందుము (అపొ.కా. 8:27-39 22:16 2:38 10:48).

బాప్తిస్మమును గూర్చిన వచనములు బైబిలునందు చదువునప్పుడు కొందరు అది పరిశుద్ధాత్మ బాప్తిస్మమును గూర్చి అన్ని చెప్పి దాటి పోవుదురు. అయితే పరిశుద్ధాత్మ బాప్తిస్మము ఎన్నడును ఆజ్ఞాపింపబడలేదని దయచేసి జ్ఞాపకముంచుకొనుము. అది ఎన్నడును బోధింపబడలేదు కూడ. అయితే నీటి బాప్తిస్మము కాక మరి ఏదైనా బాప్తిస్మము గూర్చి బైబిలు చెప్పుచున్న యెడల అది యోహాను

బాప్తిస్మమనియు లేదా పరిశుద్ధాత్మ బాప్తిస్మము అనియు దానిని గూర్చి విపులముగా చెప్పబడెను. అయితే బాప్తిస్మము అను పదము ఒక్కటే మార్కు 16:16లోను, అపో.కా. 2:38లోను వున్నట్లు అగుపడిన యెడల అట్టిది నీటి బాప్తిస్మమును గూర్చి చెప్పబడెనని గమనించుము. ఎఫెసీ 4:5లో చెప్పబడిన ఒక్కటే బాప్తిస్మమునకు ఇది కూడ వర్తించును.

తరువాత, కాని ప్రయోజనమునకు బాప్తిస్మము పొందుట సాధ్యమని గమనించుము. ఉదాహణకు : ఒకడు రక్షింపబడవచ్చును అప్పుడు బాప్తిస్మము పొందవచ్చునని అనేకులు బోధించుదురు. మరల ఒకడు రక్షింపబడిన తరువాత, సంఘములో ప్రవేశించుటకు బాప్తిస్మము పొందవలెనని చెప్పుచున్నారు. ఈ రెండు సందర్భముల లోను బాప్తిస్మము ప్రయోజనము లేనిదగును. ఎవడైనను లేఖనముల ప్రకారము ఒక డినామినేషన్ సంఘము లోనికి బాప్తిస్మము పొందుట అసాధ్యము. అందువలన అనేకులు బాప్తిస్మము పొందక పోయినను, దానిని పొందాము అని తలంచుటలో వారు మోసగించబడుచున్నాడు. ఒకడు నీటిలో ముంచబడినను, అతడు వాక్య ప్రకారము బాప్తిస్మము పొందెనని యర్ధము కాదు. లేఖనముల ప్రకారము ఉన్నట్టి బాప్తిస్మము ఒక్కటే. అది బైబిలు బాప్తిస్మమగునట్టు దానిని సరియైన ప్రయోజనమునకై జరిగింపవలెను. అది సరియైన ప్రయోజనమునకు కాని యెడల అది ఆ ఒక్క బాప్తిస్మము కానేరదు. గనుక మోసపోవద్దు. అట్టి సందర్భములో ఒకడు తిరిగి ముంచబడ వలెను. అతడు రక్షింపబడినందుకు కాదుగాని, రక్షింపబడుటకు ముంచబడవలెను. అప్పుడ మాత్రమే లేఖనముల యందున్నట్టి ఒక్కటే బాప్తిస్మము పొందినవాడగును.

లేఖనములను బట్టి బాప్తిస్మమునకున్న ప్రయోజనముల నిప్పుడు పరిశీలించుదము :

1. విశ్వాసము, మారుమనస్సు, ఒప్పుకోలు జరిగించిన తరువాత ఒకడు రక్షింపబడుటకు బాప్తిస్మము పొందవలెను. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును. నమ్మనివానికి శిక్ష విధింపబడునని" క్రీస్తే చెప్పెను (మార్కు 16:16). బాప్తిస్మము తరువాతనే రక్షణను క్రీస్తు ఉంచెను. కాని దానికి ముందుకాదు. నమ్మనివాడు శిక్ష తప్పక నొందును. అయితే రక్షింపబడుటకు ఒకడు నమ్మి బాప్తిస్మమును పొందవలయును. మరల పేతురు ఇట్లు వ్రాసెను: "దానికి సాదృశ్య మైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది. అదేదనగా శరీర మాలిన్యముతీసివేయుట కాదు గాని, యేసుక్రీస్తు పునరుత్థాన మూలముగా దేవుని విషయము నిర్మలమైన మనస్సాక్షి నిచ్చు ప్రత్యుత్తరమే" (1 పేతరు 3:21). బాప్తిస్మము రక్షించుట లేదు అని ఎవరు చెప్పగలరు ?

2. బాప్తిస్మము పాపక్షమాపణ కొరకై యున్నది. "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ, నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు అని పేతురు బోధించెను" (అపొ.కా. 2:38).

3. బాప్తిస్మము పాపములను కడిగివేయును. "గనుక నీవు తడవు చేయుట యెందుకు ? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగి వేసుకొనుము" అని పౌలు హెచ్చరించెను (అపొ.కా. 22:16).

4. బాప్తిస్మము ఒకని క్రీస్తు రక్తములోనికి చేర్చును. పౌలు రోమీయులకును, గలతీయులకును యిట్లు వ్రాసెను. "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మన మందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా ?" (రోమా 6:3). "యేసు క్రీస్తు నందు మీరందరు విశ్వాసము వలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొనియున్నారు" (గలతీ 3:26, 27). ఎవడైనను బాప్తిస్మము పొందకమునుపే రక్షింపబడితినని చెప్పుకొనుచున్న యెడల అతడు క్రీస్తునకు వెలుపల ఉండి రక్షింపబడునని, అతడు క్రీస్తు లేనివాడని చెప్పుకొనుచున్నట్లు గ్రహింపవుచున్నది. అబద్ధపు సిద్ధాంతముల ద్వారా ఒకని క్రియలు ఇట్లు ఒప్పుకొనుట జరుగును.

5. బాప్తిస్మము ఒకని సంఘమందు చేర్చును. "ఏలయనగా యూదుల మైనను, గ్రీకు దేశస్థులమైనను, దాసులమైనను, స్వతంత్రుల మైనను మనమందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి. మనమందరము ఒక్కఆత్మను పానము చేసిన వారమైతిమి" (1 కొరింథి 12:13). ఇక్కడ చెప్పబడిన శరీరము సంఘమై యున్నది (కొలస్స 1:18). ఇక్కడ చెప్పబడిన బాప్తిస్మము పరిశుద్ధాత్మ బాప్తిస్మము కాదుగాని అది నీటి బాప్తిస్మము. ఒకని సంఘములో చేర్చుటకు పరిశుద్ధాత్మ బాప్తిస్మము ఎన్నడు యీయబడలేదు కాని ఆత్మ వాక్యము ద్వారా యిచ్చు నడిపింపును బట్టి ఒకడు శరీరము లోనికి లేదా సంఘములోనికి బాప్తిస్మము పొందును.

6. బాప్తిస్మము నందు ప్రభువు యొక్క మరణము, సమాధి, పునరుత్థానముల సాదృశ్యములున్నవి (1 కొరింథీ 15:1-4). క్రీస్తు

సిలువపై మరణించినట్లు, పాపి తన పాపముల విషయమై మరణించును. క్రీస్తు సమాధిలో పాతిపెట్టబడినట్లు అతడు నీటిలో పాతిపెట్టబడును. క్రీస్తు సమాధి నుండి పునరుత్థానుడైనట్లు, అతడు ప్రభువునందు నూతన పురుషుడై లేచును (1 కొరింథీ 5:17 రోమా 6:1-12).

7. బాప్తిస్మము క్రొత్త జన్మను కలిగించును. "యేసు యిట్లనెను ఒకడు నీటిమూలముగాను ఆత్మ మూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (యోహాను 3:5). ఇది ఆత్మ బాప్తిస్మము కాదుగాని నీటి బాప్తిస్మమని మనము గమనించుచున్నాము. ఆత్మ వాక్యము ద్వారా పనిచేయుచు మనలను నడిపించుటచే ప్రభువు రాజ్యము లేక సంఘములోనికి ప్రవేశించుటకు బాప్తిస్మము పొందుట అవసరమని మనకు బోధింపబడినది. మరల 2 కొరింథీ 5:17, 1 పేతురు 1:21-22లను చదువుము.

బాప్తిస్మము మాత్రమే రక్షించదు గాని, రక్షణ పొందుటకు బాప్తిస్మము అవసరము. నీవు వాక్యప్రకారము బాప్తిస్మము పొందితివా? లేని యెడల నీవు బాప్తిస్మము నొందెదవని మేము ప్రార్థించుచున్నాము.

# 23. సిలువపై నున్న దొంగ

(The thief on the Cross)

బైబిలు అంతటిలోను మనము బాగుగా ఎరిగిన వ్యక్తులో యేసుతో కూడ సిలువ వేయబడిన దొంగ ఒకడు. ఆత్మరక్షణార్థమై బాప్తిస్మము అవసరము అని చెప్పుచున్నారు, "ఈ దొంగ సంగతి యేమి "? అని కొందరు అడుగుదురు. ప్రభువు ఏమి చెప్పెను ? అని వారడుగరు గాని, ఆ దొంగ బాప్తిస్మము పొందకుండగనే రక్షింపబడెను గదా ? అని అడుగుదురు. క్రొత్త నిబంధనలో కనపడని ఒక సిద్ధాంతమును నిరూపించుట కొరకై జ్ఞానము కలిగిన వారట్లు యుక్తిగా నడుచుకొనుట విచారమే. వారు వాదించుటకు ఏ సాకును దొరకక సహాయము కొరకు ఈ దొంగ యొద్దకు వెళ్ళుట వింతగానే యున్నది. ఒకని ఆచారములను నిరూపించుట కొరకు దొంగ యొద్దకు వెళ్ళుట ఎంత వింత ?

బాప్తిస్మము లేకుండ ఆ దొంగ రక్షింపబడెనను దానిని ఆధారముగ చేసికొని వాదించువారు అనేక సంగతులను మరచిపోవుచున్నారు.

1. దొంగ బాప్తిస్మము పొందెనని గాని పొందలేదు అనిగాని ఎవరును నిరూపించలేరు. పరిశుద్ధ రికార్డులో ఈలాగు వ్రాయబడెను : "ఆ సమయమున యెరూషలేము వారును, యూదయ వారందరును, యొర్దాను నదీ ప్రాంతముల వారందరును అతని యొద్దకు వచ్చి తమ పాపములు ఒప్పుకొనుచు యొర్దాను నదిలో అతని చేత బాప్తిస్మము పొందుచుండిరి" (మత్తయి 3:5, 6). గనుక ఈ దొంగ యోహానుచే బాప్తిస్మము పొందినవారిలో ఒకడై యుండవచ్చును.

అయితే అతడు దొంగ కదా యని ఎవరైన అడుగవచ్చును. అవును, బాప్తిస్మము పొందిన తరువాత ఇతడు దొంగ అయిఉండవచ్చును. అట్టివారిని గూర్చి బహుశ నీవును తప్పక విని యుండవచ్చు. అసలు సంగతి యేమిటంటే ఈ దొంగ బాప్తిస్మము పొందకనే రక్షింపబడెను. గనుక మనము ఈనాడు రక్షింపబడుటకు బాప్తిస్మము పొందనవుసరము లేదని చెప్పుట ఎంతో వింతగనున్నది.

2. ఆ దొంగ మోషే ధర్మశాస్త్ర ప్రకారము జీవించెను. క్రీస్తు కూడ అట్లు జీవించెను. ఆ చట్టము క్రింద అనేకుల పాపములను క్రీస్తు క్షమించెను. అట్లు చేయుటకు ఆయనకు అధికారము ఉండెను. గనుక ఆ దొంగ రక్షింపబడెనో లేదోయనినేనెవరితోను వాదించనవుసరము లేదు. ప్రస్తుత ప్రశ్న అది కాదు. ప్రశ్న యేమిటంటే 'అతడు ఏ చట్ట ప్రకారము జీవించెను' ? అనునది.

3. క్రీస్తు మరణించక ముందు ఆవలివైపు ఆ దొంగ నివసించెను. ప్రభువుని అతడు వేడుకొనుసరికి ఆయన ఇంకను ఈ లోక పాపముల కొరకై మరణించలేదు. గనుక రక్షింపబడుటకు ఈ దొంగను మాదిరిగా మనమెట్లు చేసికొనగలము ?

4. క్రీస్తు సిలువపై మరణించినప్పుడు క్రొత్త నిబంధనను ఆయన తన రక్తముతో ముద్రవేసెను : "శాసనమును వ్రాసినవాడు మరణము పొందితేనే అది చెల్లును అది వ్రాసినవాడు జీవించుచుండగా అదిఎప్పుడైనను చెల్లునా ?" అని యుండుట మనము చూడగలము (హెబ్రీ 9:17). గనుక క్రీస్తు చనిపోకముందు నీ పాపములు క్షమింపబడియున్నవి అని చెప్పుటకు ఆయనకు అధికారము ఉండెను. అయితే ఆయన చనిపోయిన తరువాత ఆయన శాసనము

అములులోనికి వచ్చెను. ఆయన ఆ దొంగకు ఒకటి చెప్పినను, అపొస్తలులకు మాత్రము "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును. నమ్మనివానికి శిక్ష విధింపబడును" అని చెప్పెను (మార్కు 16:15–16). ఆయన దీనినెప్పుడు చెప్పెను ? ఆయన మరణమునకు ముందా ? వెనుకా ? మరణించిన తరువాత గదా ! అయితే అపొస్తలులు ఏమి బోధించిరి ? ప్రభువు వారినేమైతే ఆజ్ఞాపించెనో దానినే బోధించిరి. రక్షణ మార్గమును బోధించుటలో ఒక్కసారి కూడ వారు సిలువపై నున్న దొంగను మాదిరిగా చూపించలేదు. అపొస్తలుల కార్యములను పుస్తకమంతటిలోను ప్రభువు వారికి బోధించిన దానినే వారు బోధించినట్లు మనము చూడగలము. దాని ఫలితార్థముగ ప్రజలు విశ్వసించిరి. మారుమనస్సు పొందిరి. క్రీస్తును ఒప్పుకొనిరి. వారి పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము నొందిరి.

5. క్రీస్తు శాసనము మార్పు చేయబడదు. నిరర్థకము కానేరదు. ప్రభువు దానియందేమి యిమిడ్చెనో అది నిరంతరము ఉండును. ఏలయనగా ఆయన రక్తముచే అది ముద్ర వేయబడినది (ప్రకటన 22:18, 19; గలతీ 1:6–9).

6. క్రీస్తు శాసనము సులభమైనది. తేలికయైనది, దాని నర్థము చేసికొనగోరువాడు అర్థము చేసికొనగలడు. దాని నపార్థము చేసుకొనుటకు మాత్రము ఎవరి సహాయమైనా అవుసరమగును !

7. చనిపోవుటకు సిద్ధముగాన్న వారి సహాయార్థము సిలువపైనున్న దొంగను మాదిరిగా చేసుకొనలేము. నీవు, నేను క్రీస్తు

చట్ట ప్రకారము తీర్పు నొందుదుము. గాని ఆ దొంగ అయితే అతడు ఏ చట్టము క్రింద జీవించి మరణించెనో దాని ప్రకారము తీర్పునొందును. బాప్తిస్మము పొందకుండ ఫలాన విధముగ రక్షింపబడవచ్చునని మానవులు అనేక సాకులను చెప్పుచుందురు. అయితే నిరూపించుటకు బైబిలునందు ఒక్క మాదిరి కూడ లేనేలేదు. మనకు తెలిసినదంతా ప్రభువు ఏమి చెప్పెనో, ఇప్పటికి ఏమి చెప్పుచుండెనో అది మాత్రమే : "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును. నమ్మనివానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:16). నేను బైబిలును అనేక పర్యాయములు పఠించితి గాని దీనికి వేరైయున్న వాక్యములను కనుగొనలేదు. రక్షణ పొందుటకు మనుష్యులు ఏమి చేయవలెనని ప్రభువు బోధించెనో దాని చేసిన యెడల మనుష్యులందరు ఆయన యిచ్చిన షరతులపై రక్షింపబడుదురు.

బాప్తిస్మము ఒక్కటి మాత్రమేగాని మరింకేదైనా ఒక్కటి మాత్రమే గాని రక్షించునని మేము చెప్పుటలేదని గమనించుము. గాని రక్షింపబడుటకు ఏమి చేయవలెనని ప్రభువు చెప్పెనో దానిని మాత్రమే మేము బలపరచుచున్నాము. అందు బాప్తిస్మము ఒకటి. విశ్వాసము, మారుమనస్సు ఎంత అవుసరమో బాప్తిస్మము కూడా అంతవసరము! అంతే.

# 24. శిశు బాప్తిస్మము

## ( Infant Baptism )

నేటి మతాచారములలో శిశు బాప్తిస్మము బహుగా వ్యాపించినది. గాని దానిని గూర్చి బైబిల ఎక్కడను బోధించుట లేదు. లేఖనములు సంపూర్తి చేయబడిన అనేక సంవత్సరముల యనంతరము అది ఆరంభించబడెను. ఆరిజన్ అనునతడు సంఘ చరిత్రలో మొదటిగా శిశు బాప్తిస్మము గూర్చి వ్రాసెను. 6వ శతాబ్దములో కేథలిక్కు సంఘము స్థాపించబడిన తరువాత ఈ ఆచారము వారవలంభించిరి. అనేక సంవత్సరముల తరువాత బాప్తిస్మమునకు బదులుగా చిలకరింపు మొదలు పెట్టబడెను. దీనిని బట్టి ఆ సంఘము చీలికలాయెను. చిలకరింపును అంగీకరించిన వారు దాని నాచరించుచుండిరి. వారు రోమన్ కేథలిక్కులు అయిరి. దానిని తిరస్కరించిన వారు నేటికింకను ముంచుటను చేయుదురు. వారిని గ్రీక్ ఆర్థోడాక్స్ కేథలిక్కు సంఘమందురు.

మానవులందరు ఆదిమపాపముతో పుట్టినవారు అని తలంచుటచే శిశు బాప్తిస్మము ఉద్భవించెను. పుట్టిన శిశువులందరు ఆదాము చేసిన ఆదిమ పాపముతో పుట్టుదురు అని కొందరి ఉద్దేశము. మానవులందరు పాపఫలితము ననుభవించుదురనుమాట నిజమే. అయితే ఒకడు మరింకొకని పాపమునకు ఎన్నడును వారసుడు కాడు. "ఆజ్ఞాతిక్రమమే పాపము" అని 1 యోహాను 3:4 మనకు చెప్పుచున్నది. క్రొత్తగా జన్మించిన శిశువు దీనినెట్లు చేయగలడు ? వానికి చట్టమే తెలియదు. దేవుని ప్రవక్త ఎప్పుడో యిట్లు చెప్పెను : "పాపము చేయువాడే మరణము నొందును తండ్రి యొక్క దోషశిక్షను

కుమారుడు మోయుటలేదని కుమారుని దోష శిక్షను తండ్రి మోయడు. నీతిపరుని నీతి ఆ నీతిపరునికే చెందును. దుష్టుని దుష్టత్వము ఆ దుష్టునికే చెందును" (యెహెజ్కేలు 18:20).

యేసు ఇట్లు బోధించెను : "మీరు మార్పునొందిన బిడ్డలవంటి వారైతేనే గాని పరలోక రాజ్యములో ప్రవేశింపరని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (మత్తయి 18:3). మరల "చిన్న పిల్లలను ఆటంక పరచక వారిని నా యొద్దకు రానియ్యుడి పరలోక రాజ్యము ఈలాంటి వారిదని ఆయన చెప్పెను (మత్తయి 19:14). గనుక చిన్న బిడ్డలు పవిత్రులు. పాపము లేనివారు గనుక పాపభారము లేనివారని ప్రభువు చిన్నబిడ్డలను గూర్చి బోధించెను. నిజానికి వారు పాపముతోను, అవినీతితోను నిండిన వారైతే మీరు మార్పునొంది బిడ్డలవంటి వారైతేనే గాని పరలోక రాజ్యములో ప్రవేశింపరు అని ఆయన బోధింపక పోవును. మరల వారు పాపముతో నిండినవారైతే అట్టివారిదే పరలోక రాజ్యము అని ఆయన బోధించకపోవును.

చిన్నబిడ్డలు పాపము లేనివారుగ ఈ లోకమందు జన్మించెదరు. పాపముతో నిండియున్న ఈ లోకమందు వారు జన్మించవచ్చును గాని జన్మించినప్పుడే పాపము లేని వారుగ జన్మించుదురు. మంచి చెడ్డల నెరుగు వయస్సు వచ్చువరకు ఒకడు దేవుని దృష్టిలో పవిత్రముగాను, పాపములేని వానిగను ఉండును. విచక్షణ జ్ఞానము కలుగుచుండగా అతడు తన క్రియలకు బాధ్యుడగును. అప్పుడు మాత్రమే అతడు ప్రభువునకు లోబడవలెను.

దేవుని వాక్యమందు వివరించబడిన రక్షణ మార్గము విచక్షణ జ్ఞానము గలవారికి ఉద్దేశింపబడినది. శిశువుల కొరక రక్షణ మార్గమును ప్రభువు ఈయలేదు. వారు పాపము లేనివారు గనుక దేవుని యెదుట

క్షేమముగ యున్నారు. వారు చనిపోయిన యెడల ప్రభువుతో ఉండుటకు వెళ్ళుదురు. దావీదు తన కుమారుడు చనిపోయిన తరువాత నేను వాని యొద్దకు పోవుదును గాని వాడు నా యొద్దకు మరల రాడని చెప్పెను (2 సమూయేలు 12:22).

తల్లిదండ్రులు ఎంత మంచివారైనను వేరొక వ్యక్తి ఆత్మను గూర్చిన సంగతిని వారు ఎట్లు నిశ్చయించగలరు ? ఒక శిశువు గ్రహించుకొన లేని దాని నుండి బలవంతముగా తనకు అంటగట్టిన దానినుండి మేలును ఎట్లు పొందగలడు ? ప్రభువు తన శాసనమును విని గ్రహించుకొనగలిగిన వారికి (మత్తయి 28:19 రోమా 10:17), హృదయపూర్వకముగా విశ్వసించ గలిగినవారికి (రోమా 10:10 హెబ్రీ 11:6), తమ పాపముల విషయమై మారుమనస్సు పొందగలిగిన వారికి (లూకా 13:3 అపొ.కా. 17:30), ప్రభువును తమ నోటితో ఒప్పుకొన గలిగినవారికి (రోమా 10:10 మత్తయి 10:32), తమ పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందగలిగిన వారికి (అపొ.కా. 2:38) ఉద్దేశించి ఆజ్ఞాపించెను. ఒక శిశువు వీటిని చేయగలడా? చేయలేడుగదా ? శిశువు ప్రార్థన చేయగలడా ? ప్రభురాత్రి భోజనమందు పాల్గొనగలడా ? ఇతరులకు దేవునికి గూర్చి బోధించగల్గునా ? శిశువు చేయలేడని నీ వెరుగుదువు. అయినను ప్రతి క్రైస్తవుడు వీటన్నిటిని చేయవలెను. గనుక దేవుని చట్టము పసిబిడ్డలకు వర్తించదు గాని అది పెద్దలకు బాధ్యతాయుక్త వయస్సు వచ్చినవారికి, పాపులకు వర్తించును.

నిజానికి శిశు బాప్తిస్మము బాప్తిస్మము కానేరదు. అది చిలకరింపు గాని కుమ్మరింపుగాని అయి యుండవచ్చును. కాని అది బాప్తిస్మము కాదు. బైబిలు బాప్తిస్మము ఒక సమాధి. అపొస్తలుడైన పౌలు ఇట్లు

చెప్పుచున్నాడు. "మీరు బాప్తిస్మమందు ఆయనతో కూడ పాతిపెట్టబడిన వారై ఆయనను మృతులలో నుండి లేపిన దేవుని ప్రభావమందు విశ్వసించుట ద్వారా ఆయనతో కూడ లేచితిరి" (కొలస్స 2:12). "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణము లోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా ? కాబట్టి తండ్రి మహిమ వలన క్రీస్తు మృతులలో నుండి యేలాగు లేపబడెనో, అలాగే మనమును నూతన జీవము పొందిన వారమై నడుచుకొనునట్లు మనము బాప్తిస్మము వలన మరణములో పాలుపొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి" (రోమా 6:3, 4). అపొస్తలుల కార్యములు 8వ అధ్యాయములో నపుంసకుని ఫిలిప్పు నీటిలోనికి తీసికొనివెళ్ళి బాప్తిస్మము ఇచ్చిన మాదిరి మనకు కనబడుచున్నది. ఏమి జరిగెను? ఫిలిప్పు అతనిని నీటిలో ముంచెను లేదా పాతిపెట్టెను. బాప్తిస్మము సరియైన ప్రయోజనమునకు పొందవలెను. నమ్మి బాప్తిస్మము పొందవలెనని క్రీస్తు బోధించెను (మార్కు 16:16) మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందవలెనని పేతురు చెప్పెను (అపొ.కా. 2:38). దానిని తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మని యొక్కయు నామములోనికి జరిగించవలెనని క్రీస్తు బోధించెను (మత్తయి 28:19). బాప్తిస్మము ఒక్కటే (ఎఫెసీ 4:5). ఒకని క్రీస్తు లోనికి సంఘమందు చేర్చుటకు అది ప్రతిసారి ముంచుట లేక నీటిలో పాతిపెట్టుట యగును (గలతీ 3:26, 27:1 కొరింథీ 12:13).

పసిబిడ్డలు ఎవరు బాప్తిస్మము పొందనవుసరము లేదుగాని వారి తల్లులు, తండ్రులు ప్రభువునకు విధేయులగుట అత్యవుసరము. నీవు వాక్య ప్రకారము బాప్తిస్మము పొందితివా ?

# 25. ఒకడు తిరిగి బాప్తిస్మము పొందవలెనా ?

( Should one be Baptised again ? )

ఒకడు బాప్తిస్మము పొందవలెనని బైబిలు తప్పక బోధించు చున్నది. దీనికి అనేక కారణములున్నవి. బాప్తిస్మము రక్షించుచున్నది (1 పేతురు 3:21) అది పాపక్షమాపణ కొరకు (అపొ.కా. 2:38) ఒకని అది క్రీస్తు నందును, సంఘము నందును చేర్చును (రోమా 6:3, 4 1 కొరింథీ 12:13). అయినను బాప్తిస్మము ఒక్కటే యని వాక్యము చెప్పుచున్నది (ఎఫెసీ 4:5). ప్రశ్న ఏమంటే ఒకడు బాప్తిస్మము పొందిన యెడల అతడు తిరిగి బాప్తిస్మము పొందవలెనా?

ఒకడు వాక్యప్రకారము బాప్తిస్మము పొందిన యెడల, ఏ సందర్భములోనయినను అతడు తిరిగి బాప్తిస్మము పొందనవుసరము లేదు. అట్లు బాప్తిస్మము పొందుట అసాధ్యము. వాక్య ప్రకారము ఒక్కసారి మాత్రమే బాప్తిస్మము పొందనగును.

గనుక ఒకడు వాక్యప్రకారము బాప్తిస్మము పొందెనా ? యనెడి ప్రశ్న ఉద్భవించును. నిజానికి లక్షలాది ప్రజలు బాప్తిస్మము పొందక పోయినను పొందితిమని తలంచుదురు. ఇక్కడ కొన్ని అట్టి సందర్భములను చూద్దాం :

1. పసిపిల్లలవలె నున్నపుడు చిలకరింపు పొందినవారు ఎన్నడును బాప్తిస్మము పొందలేదు. చిలకరింపు బాప్తిస్మము కాదు. వాక్యాధారము లేని ఒక మానవ ఆచారము అది. బాప్తిస్మము ఒక సమాధియని, అది నీటి సమాధియని వాక్యము బోధించుచున్నది (కొలస్స 2:12 రోమా 6:3,4 అపొ.కా. 8:36-39). తరువాత శిశు బాప్తిస్మమును బైబిలు ఎక్కడను సమ్మతించుటలేదు. సరికదా

పసికందులు పాపులు కారు అని అది బోధించుచున్నది (మత్తయి 18:1-3). ప్రభువునకు లోబడుట కొరకు వాక్యమును విని విశ్వసించి, మారుమనస్సు పొంది, ప్రభువని ఒప్పుకొని పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందగల్గునట్టి వయస్సును కలిగినవాడై యుండవలెనని అది బోధించుచున్నది (రోమా 10:7 యోహాను 3:16 అపొ.కా. 17:30 మత్తయి 10:32 అపొ.కా. 2:38). గనుక ఎట్లు చూచినను ఒకడు చిన్నప్పుడే చిలకరింపు నొందిన యెడల అతడు ఎన్నడును బాప్తిస్మము పొందలేదు గనుక అతడు ప్రభువు ఆజ్ఞాపించినట్లు బాప్తిస్మము పొందవలెను (మార్కు 16:15-16).

2. అటువలె వయస్సు వచ్చిన తరువాత చిలకరింపు పొందినవారు ఎన్నడును బాప్తిస్మము పొందలేదు. చిలకరింపు బాప్తిస్మము కాదు అని, బాప్తిస్మము అనగా నీటిలో ముంచుట యని బైబిలు బోధించు చున్నట్లు గమనించుము.

చిలకరింపే బాప్తిస్మము అని నిరూపించుటకు ఎట్టి మార్గమును లేదు. నీవు ఒక నిఘంటువులో చూచినను కూడ బాప్తిస్మము అనగా చిలకరింపు కాదని గ్రహించగలవు. సర్వాధికారము నాకియ్యబడెనని యేసు చెప్పెను (మత్తయి 28:18-20). చిలకరింపునకు, కుమ్మరింపునకు ఆయన అనుమతినియ్యలేదు. వాటిని బాప్తిస్మము అని అంగీకరించినవారు ప్రభువుని గాక మానవుని వెంబడించుచున్నారు. గనుక ఎవడైనను చిలకరింపు పొందిన యెడల అతడు ఎన్నడును బాప్తిస్మము పొందలేదు. గనుక అతడు తిరిగి బాప్తిస్మము పొందుటకని కాదు గాని, వాక్యప్రకారము బాప్తిస్మము పొందవలెను.

3. ఒక డినామినేషన్ సంఘములో చేరుటకు ముంచడము పొందిన వారు వాక్యప్రకారము బాప్తిస్మము పొందలేదు. బైబిలు

బాప్తిస్మము నీటి సమాధి, అంతేకాదు. సరియైన ప్రయోజనమునకు జరిగించవలెను (మత్తయి 28:19, 20). బైబిలు బోధించునట్లు ఎవడైనను బాప్తిస్మము పొందిన యెడల, అతడు మానవకల్పిత సంఘమందు చేర్చబడడు కాని, ప్రభువు అనుమతి చొప్పున బాప్తిస్మము పొంది రక్షింపబడిన ప్రతివానిని ఆయన తన సంఘముతో చేర్చుకొనును. ఒకడు ముంచడం పొందినను యింకా ఒక డినామినేషన్‌లో యున్నట్లయిన అతడు బాప్తిస్మము సరియైన ప్రయోజనము కొరకు పొందవలెను. అప్పుడు మాత్రమే అతడు నిజమైన ఒక్కటే బాప్తిస్మము పొందినవాడగును.

గనుక బాప్తిస్మము ప్రాముఖ్యమైనది. దానిని సరిగ జరిగించవలెను. లేనియెడల అది బాప్తిస్మము కానేరదు. అనేకులు వాక్య ప్రకారము బాప్తిస్మము పొందకపోయినను బాప్తిస్మము పొందితిమని నాతో చెప్పిరి. అయితే చిలకరింపు బాప్తిస్మము కాదని వారు గ్రహించినప్పుడు లేదా నిజ బాప్తిస్మము డినామినేషన్‌లో చేర్చదు అని గ్రహించినప్పుడు వారు వాక్య ప్రకారము బాప్తిస్మము పొందిరి. అప్పుడు మాత్రమే వారు బాప్తిస్మము పొందితిమని చెప్పగలిగిరి. ఇట్టి ఒక సందర్భమును అపొస్తలులు కార్యములు 19వ అధ్యాయములో మనము చూడగల్గుదుము.

నీవు వాక్యప్రకారము బాప్తిస్మము పొందితివా ? లేని యెడల "నీవు తడవు చేయుట ఎందుకు ? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి, బాప్తిస్మము పొంది, నీ పాపములను కడిగి వేసుకొనుము" (అపో.కా. 22:16).

# 26. విశ్వాసము వలన కలుగు రక్షణ

( Salvation By Faith )

విశ్వాసము వలన రక్షణ కలుగునని బైబిలు విపులముగా బోధించుచున్నది. ఒకడు విశ్వాసము వలన రక్షణ నొందును. మనము విశ్వాసము వలన నీతిమంతులముగా తీర్చబడుదుము. పౌలు ఇట్లు చెప్పుచున్నాడు "కాగా ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలు లేకుండ విశ్వసము వలన మనుష్యులు నీతిమంతులుగా తర్చీబడుచున్నారని యెంచుచున్నాము" (రోమా 3:28). ఇక్కడే మోషే ధర్మశాస్త్రమును గూర్చి చెప్పబడెను. "కాబట్టి విశ్వాసము వలన మనము నీతిమంతులముగా తీర్చబడి, మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా దేవునితో సమాధానము కలిగియుందము" (రోమా 5:1). ఇట్టి వచనములనేకములను మనము చెప్పుకొనవచ్చును. గనుక విశ్వాసమువలన రక్షణ దొరకునని తప్పక అంగీకరించవలయును. విశ్వాసమువలన రక్షణ యున్నదని మనము కాదనకపోయినను, విశ్వాసమువలన మాత్రమే రక్షణ యున్నదని చెప్పు వచనములలో 'మాత్రమే" అను పదమును చేర్చి చదువుచుందురు. అట్లు చేయుటలో విశ్వాసము వలన మాత్రమే రక్షణ యున్నదనిపించును. ఇది సత్యము కాదు. విశ్వాసము వలన మాత్రమే రక్షణ లేదు. "మనుష్యుడు విశ్వాసమూలమున మాత్రము కాక క్రియల మూలముననుు నీతిమంతుడని యెంచబడునని మీరు దీనివలన గ్రహించితిరి" యని యాకోబు చెప్పుచున్నాడు (యాకోబు 2:24).

ఒకడు విశ్వాసమూలమున మాత్రము రక్షింపబడకపోయిన యెడల విశ్వాసము వలన రక్షణ యున్నదని చెప్పుటలో లేఖనముల

భావమేమి ? నిజానికి విశ్వాసమనగా యేసుక్రీస్తు దేవుని కుమారుడని మానసికముగా అంగీకరించుట కంటె ఎక్కువ దానిలో యున్నది. విశ్వాసమునందు దేవుని వాక్యప్రకారము నడుచుకొనుట, ప్రభువు చిత్తమును నెరవేర్చుట, ప్రభువుని సేవించుట యను పని యిమడ్చబడి యున్నవి. ఆయన ఆజ్ఞలను గైకొని ఆయనకు విధేయులై పనిచేయుట అందున్నది. ఇది విశ్వాసము నుండి దేనిని తీసివేయదు, దేవుని కృపను తొలగించదు. అయితే ప్రభువు మనకు రక్షణ నందించు చున్నాడు. దానిని విశ్వాసముతోను విధేయతతోను మనము అందుకొని అంగీకరించవలెను. రక్షింపబడుటకు ప్రభువు ఆజ్ఞాపించిన వాటినన్నిటిని మనము చేసిన తరువాత కూడ రక్షణ దేవుని కృపవలనను విశ్వాస మూలముగను కలుగును.

అది ఎట్లు పనిచేయునో పరిశీలించుదము. ఉదాహరణకు యోహాను 3:16ను తీసికొనుము. క్రీస్తు ఇట్లు చెప్పెను : "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టినవాని యందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను". ఈ వచనము చెప్పగనే ఆయన యందు విశ్వాసముంచు ప్రతివాడు నిత్యజీవము పొందునని ప్రభువు చెప్పెను గదా? యని కొందరు అడుగుదురు. అది నిజమే. కాని ఆయన విశ్వాసము మాత్రమే అని చెప్పలేదు. అయితే దేనిని విశ్వసించవలెను ? అని మనము అడుగవలెను. యేసునందు విశ్వాసముంచు ప్రతివాడును అని కనబడుచున్నది. గనుక ఇప్పుడు ప్రశ్న యేమంటే : నీవు యేసునందు విశ్వాసముంచుచున్నావా? అవును అని నీవు సమాధానమియ్య వచ్చును. అప్పుడు ఆయన చెప్పురీతిగ చేయునంత వరకు ఆయన

యందు విశ్వాసముంచుచున్నావా? అట్లయితే నీవు ఆయనకు లోబడుము. ఆయన బోధలకు లోబడునంతగా నీవు ఆయనను నమ్మని యెడల నీ విశ్వాసము మృతమైనది.

యోహాను 3:36 గమనించుము : "కుమారుని యందు విశ్వాసముంచువాడే నిత్యజీవము గలవాడు, కుమారునికి విధేయుడు కానివాడు జీవము చూడడుగాని దేవుని ఉగ్రత వాని మీద నిలిచి యుండును". విశ్వాసము మాత్రము ఉంచువాగేయని చెప్పుటలేదు అని గమనించుము. అయితే విధేయత చూపనివాని కేమి జరుగునో కూడ చెప్పబడియున్నది. ఇంకొక మాటలో విశ్వసించి విధేయత కలిగిన వానికి నిత్యజీవము కలదు గాని విశ్వసించని వారు విధేయత చూపనివారు జీవము చూడలేరు.

రోమీయులకు పౌలు ఇట్లు చెప్పెను : "యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలో నుండి ఆయనను లేపెననినీ హృదయ మందు విశ్వసించిన యెడల నీవు రక్షింపబడుదువు" (రోమా 10:9). దాని తరువాత వచనములో విశ్వాసము, ఒప్పుకోలు రక్షణ కలుగునట్లు అవసరమని అతడు చెప్పెను. ఒకడు అట్లు విశ్వసించి ఒప్పుకొనిన యెడల ప్రభువు ఆజ్ఞాపించిన దానిని అతడు చేయడా? అపొ.కా. 8:26-39 లో నున్న ఒక మాదిరిని పరిశీలించుదము. "ప్రభువు దూత-నీవులేచి దక్షిణముగా వెళ్ళి యెరూషలేము నుండి గాజాకు పోవు అరణ్య మార్గమున కలిసికొనుమని ఫిలిప్పుతో చెప్పగా అతడు లేచి వెళ్ళెను. అప్పుడు ఐతియొపీయులు రాణియైన కందాకే క్రింద మంత్రియై ఆమె యొక్క ధనాగారము అంతటి మీదనున్న ఐతియోపీయుడైన నపుంసకుడు ఆరాధించుటకు యెరూషలేమునకు వచ్చి యుండెను. అతడు తిరిగి వెళ్ళుచు, తన రథము మీద కూర్చుండి

ప్రవక్తయైన యెషయా గ్రంథము చదువు చుండెను. అప్పుడు ఆత్మ ఫిలిప్పుతో నీవు ఆ రథము దగ్గరకు పరుగెత్తుకొని బోయి అతని కలిసికొనుమని చెప్పెను. అతడు ప్రవక్తయైన యెషయా గ్రంథము చదువుచుండగా విని నీవు చదువునది గ్రహించుచున్నావా ? అని అడుగగా అతడు ఎవడైనను నాకు త్రోవ చూపకుంటే ఏలాగు గ్రహింపగలనని చెప్పి, రథమెక్కి తనతో కూర్చుండుమని ఫిలిప్పును వేడుకొనెను..... అందుకు ఫిలిప్పు నోరు తెరచి ఆ లేఖనము ననుసరించి అతనికి యేసును గూర్చిన సువార్తను బోధించెను. వారు త్రోవలో వెళ్ళుచుండగా నీళ్ళున్న యొకచోటికి వచ్చినపుడు నపుంసకుడు ఇదిగో నీళ్ళు నాకు బాప్తిస్మమిచ్చుటకు ఆటంకమేమని అడిగి రథము నిలుపుమని ఆజ్ఞాపించెను (ఫిలిప్పు–నీవు పూర్ణ హృదయముతో విశ్వసించిన యెడల పొందవచ్చునని చెప్పెను. అతడు యేసుక్రీస్తు దేవుని కుమారుడని విశ్వసించుచున్నానని యుత్తరమిచ్చెను. ఫిలిప్పు, నపుంసకుడు ఇద్దరు నీళ్ళలోనికి దిగిరి. అంతట ఫిలిప్పు, అతనికి బాప్తిస్మమిచ్చెను". ఈ నపుంసకుడు ప్రభువును విశ్వసించి, ఒప్పుకొని ఆయనకు విధేయుడయ్యెను. అందువలన అతడు రక్షింపబడెను.

అపొ.కా. 16:31లో "ప్రభువైన యేసునందు విశ్వాసముంచుము అప్పుడు నీవును, నీ యింటివారును రక్షణ పొందుదురు" అని చెరసాల అధిపతికి చెప్పబడెను. అనేకులు ఇక్కడ పొరబడుదురు. చెరసాల అధిపతి యెవరు ? అవిశ్వాసి గనుక అతడు ముందు విశ్వసించ వలెను. అతడు వాక్యము విని, విశ్వసించి పౌలు సీలాలు గాయము లను కడుగుట ద్వారా మారుమనస్సును తెలిపి తన యింటివారితో సహా బాప్తిస్మము పొందెను.

యేసు యొక్క ప్రత్యేక ఆజ్ఞలను మరచిపోకుము. ఉదాహరణకు "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును. నమ్మనివానికి శిక్ష విధింపబడునని" ప్రభువు చెప్పెను (మార్కు 16:16). "మీరు మారు మనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుడి" యని పేతురు చెప్పెను (అపో.కా. 2:38). ప్రభువు విశ్వాసము వలన మాత్రమే రక్షింపబడుదురని ఒకసారి చెప్పి, వారు లోబడుటకు యింకా ఆజ్ఞలున్నవని మరొకసారి చెప్పునా ? అట్లు ఎన్నడు కాదు. విశ్వసించినవాడు ప్రభువు ఆజ్ఞలకు లోబడుట ద్వారా దానిని నిరూపించును. చరిత్రలో విశ్వాసము వలన నడుచుకొనిన వారిని గూర్చి హెబ్రీ 11వ అధ్యాయము చదువుము.

ఈ అంశమును ముగించక ముందు ఉన్న ప్రశ్న ఏమంటే నీకున్న విశ్వాసమెంత ? ప్రభువు ఒకసారి ఈ ప్రశ్నను వేసెను. "నేను చెప్పు మాటల ప్రకారము మీరు చేయక ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచుట ఎందుకు ?" (లూకా 6:46). విశ్వాసము వలన మాత్రమే రక్షణ కలుగునను సిద్ధాంతమును నీవు పట్టుకొనిన యెడల ప్రభువు ఆ ప్రశ్నను నిన్నే అడుగవచ్చును. కొన్ని వచనములను వేరుపరచవద్దు, అపార్థము చేసుకొనవద్దు, వాక్యప్రకారము లేని బోధను చేయవద్దు. ప్రభువునందు విశ్వసించి ఆయన చెప్పినవి చేసిన యెడల అప్పుడు మాత్రమే నీవు విశ్వాసము మూలమున రక్షింపబడుదువు.

# 27. క్రొత్త నిబంధన ఐక్యత

( New Testament Unity)

క్రైస్తవ లోకము ఈనాడు విభజింపబడి యున్నది. వారు కేథలిక్కులని, ప్రొటెస్టాంటులని, డినామినేషన్లు అని, గుంపులని, శాఖలని విభాగింపబడియున్నారు. వారందరు ఒకే ప్రభువును సేవించువారు కూడ. అందులో ఎక్కడో కొంత దోషము ఉన్నదని అందరు గుర్తించెదరు. అందువలన వారిలో ఐక్యత నెలకొల్పుటకు అనేక ప్రయత్నములు జరుగుచున్నవి. ఐక్యతను నెలకొల్పుటకు ఆయా శాఖల నాయకులు సాధారణాంశములు కొరకు వెదుకుచున్నారు. ఈ ప్రజలు ఐక్యతను గూర్చి మేలుకొనుచున్నందున హర్షించదగినదే గాని, వారందరు తమ విశ్వాసప్రమాణ పుస్తకములను వింత నమ్మకములను, నామములను, సిద్ధాంతములను, ఆచారములను పరిత్యజించి బైబిలు బోధించురీతిగ నడుచుకొనుటకు బైబిలు నొద్దకు వచ్చువరకు ఆ ఐక్యత వారికి లభించదు. అట్లు చేయగలిగినప్పుడు నిజమైన ఐక్యత సమకూడును.

దేవుడు విభజనను, గందరగోళమును ద్వేషించును. ఇది వాక్యములో విపులముగనే యున్నది. కొరింథులో నున్న సంఘములో విభజనలు ఏర్పడగా పౌలు దానిని తక్షణమే ఖండించెను. వాక్యమును గమనించుము: “సహోదరులారా, మీరందరు ఏకభావముతో మాటలాడవలెననియు, మీలో కక్షలు లేక యేక మనస్సుతోను, ఏక తాత్పర్యముతోను, మీరు సన్నద్ధులై యుండవలెననియు మన ప్రభువైన యేసుక్రీస్తు పేరిట మిమ్మును వేడుకొనుచున్నాను. నా సహోదరులారా, మీలో కలహములు కలవని మిమ్మును గూర్చి క్లోయె యింటివారి

వలన నాకు తెలియవచ్చెను. మీలో ఒకడు నేను పౌలువాడను, ఒకడు నేను అపొల్లో వాడను, మరియొకడు నేను కేఫావాడను, ఇంకొకడు- నేను క్రీస్తువాడనని చెప్పుకొనుచు చున్నారని నా తాత్పర్యము. క్రీస్తు విభజింపబడియున్నాడా ? పౌలు మీకొరకు సిలువ వేయబడెనా ? పౌలు నామమున మీరు బాప్తిస్మము పొందితిరని యెవరైనను చెప్పకుండునట్లు, క్రిస్పునకును గాయియుకును తప్ప మరియెవరికిని నేను బాప్తిస్మమియ్యలేదు. అందుకై దేవునికి కృతజ్ఞతాస్తుతలు చెల్లించుచున్నాను. స్తెఫను ఇంటివారికిని బాప్తిస్మమిచ్చితిని వీరికి తప్ప మరియెవరికైనను బాప్తిస్మమిచ్చితినేమో నేనెరుగను. బాప్తిస్మ మిచ్చుటకు క్రీస్తు నన్ను పంపలేదు గాని, క్రీస్తు యొక్క సిలువ వ్యర్థము కాకుండునట్లు వాక్చాతుర్యము లేకుండ సువార్త ప్రకటించుకే ఆయన నన్ను పంపెను" (1 కొరింథీ 1:10, 17).

పైన చెప్పబడిన దానిలో ఐక్యత కొరకు పౌలు చేసిన వాదమును గమనించుము. విభజనను ఖండించుచు, విభజింపబడిన వారి చాందస్యమును చూపించుట కతడు మూడు సామాన్య ప్రశ్నల నడిగెను. మొదటిది - "క్రీస్తు విభజింపబడెనా?" ఆయన విభజింపబడలేదని వారెరుగుదురు. రెండవది - "పౌలు మీ కొరకు సిలువ వేయబడెనా ?" ప్రభువే వారి కొరకు సిలువ వేయబడెనని వారెరుగుదురు. ఆఖరిగా - "మీరు పౌలు నామమున బాప్తిస్మము పొందితిరా ?" లేదు. వారు పౌలు నామమున కాదు గాని క్రీస్తు నామమున బాప్తిస్మము పొందిరి. గనుక దీని భావమేమంటే వారందరు క్రీస్తునందు ఏకమై యుండవలెను. అది ఎంత సులభము !

కొరింథులో నున్న సందర్భమును బట్టి అతడు కొద్దిమందికే బాప్తిస్మమిచ్చినందుకు పౌలు సంతోషమును వ్యక్తపరచెను. లేని యెడల

వారు పౌలు నామమున మేము బాప్తిస్మము పొందితిమని చెప్పుకొందురు. దీనిని మనస్సులో నుంచుకొని బాప్తిస్మమిచ్చుటకు నేను రాలేదు గాని సువార్త ప్రకటించుటకు వచ్చితినని అతడు పలికెను. సహజముగా అతడు సువార్త ప్రకటించెను. వినినవారు కొందరు పౌలు చేతను, మరికొందరు యితరుల చేతను బాప్తిస్మము పొందిరి. పౌలు బాప్తిస్మమునకు వ్యతిరేకముగ బోధించుటలేదు. అట్లయిన అతడు ఎవరికిని బాప్తిస్మము యియ్యకుండును ! అయితే ప్రస్తుత సందర్భమును బట్టి కొందరికే అతడు బాప్తిస్మము మిచ్చినందున ఆనందించెను.

రోమా 16:17, 18లో పౌలు యిట్లు చెప్పెను : "సహోదరులరా, మీరు నేర్చుకొనిన బోధకు వ్యతిరేకముగా భేదములను, ఆటంకములను కలుగజేయు వారిని కనిపెట్టి యుండుడని మిమ్ములను బ్రతిమాలుకొను చున్నాను. వారిలోనుండి తొలగిపోవుడి. అట్టివారు మన ప్రభువైన క్రీస్తుకు కాక తమ కడుపునకే దాసులు వారు యింపైన మాటలవలనను, ఇచ్చకముల వలనను నిష్కపటుల మనస్సులను మోసపుచ్చుదురు". భేదములు కలుగజేయువారిని కనిపెట్టుకొని యుండవలెనని అపొస్తలుడు చెప్పుచున్నాడు. అట్టివారి నుండి తొలగిపోవలెను. ఎందుచేత ? ఏలయనగా వారు క్రీస్తును సేవింపక ఇంపైన మాటలవలన నిష్కపటులను మోసగించుదురు. అయితే అట్టివారిని హర్షించుమని, మెచ్చుకొనవలెనని లేదా సహించవలెనని అతడు చెప్పలేదు. గనుక దేవుని వారము అని చెప్పుకొను వారందరు దేవునివారు కారు అనియు, బైబిలును బోధించుట లేదనియు మనము గ్రహించుట ఎంతయో మేలు.

క్రీస్తు ఐక్యత కొరకు ప్రార్థించెను. ఐక్యత అనగా ఏకత్వము

పరిపూర్ణత్వము, పవిత్రత్వము. ఆయన యిట్లు ప్రార్థించెను : "మరియు నీవు నన్ను పంపితివని లోకము నమ్మునట్లు, తండ్రీ నాయందు నీవును, నీయందు నేనును ఉన్నలాగున, వారును మనయందు ఏకమై యుండవలెనని వారికొరకు మాత్రము నేను ప్రార్థించుట లేదు వారి వాక్యము వలన నాయందు విశ్వాసముంచు వారందరు ఏకమై యుండవలెనని వారి కొరకును ప్రార్థించుచున్నాను" (యోహాను 17:20, 21). ఇక్కడ అపొస్తలుల కొరకును, వారి వాక్యము ద్వారా విశ్వాసులైన వారందరి కొరకును క్రీస్తు ప్రార్థించెను. ఎంతమట్టుకు? తండ్రియగు దేవుడు కుమారుడైన క్రీస్తు ఏకమై యున్నంతమట్టుకు. అది నిజమైన ఐక్యత.

మరల పౌలు వ్రాసిన దానిని చూచిన యెడల, అందు ఐక్యత కొరకు ఒక పునాది ఈయబడెను: "కాబట్టి మీరు సమాధానమను బంధము చేత ఆత్మ కలిగించు ఐక్యతను కాపాడుకొనుట యందు శ్రద్ధ కలిగిన వారై ప్రేమతో ఒకని నొకడు సహించుచు, మీరు పిలువబడిన పిలుపునకు తగినట్టుగా దీర్ఘశాంతముతో కూడిన సంపూర్ణ వినయముతోను, సాత్వికముతోను నడుచుకొనవలెనని ప్రభువును బట్టి ఖైదీనైన నేను మిమ్మును బ్రతిమాలుకొనుచున్నాను. శరీరమొక్కటే ఆత్మయు ఒక్కడే, ఆ ప్రకారమే మీ పిలుపు విషయమైయొక్కటే నిరీక్షణ యందుండుటకు పిలువబడితిరి. ప్రభువు ఒక్కడే, విశ్వాసమొక్కటే, బాప్తిస్మమొక్కటే అందరికి తండ్రియైన దేవుడు ఒక్కడే. ఆయనఅందరికి పైగా ఉన్నవాడై అందరిలోను వ్యాపించి, అందరిలో ఉన్నాడు" (ఎఫెసీ 4:4–6). ఒక్కొక్కటే అని చెప్పబడినప్పుడెన్ని ? ఒక్కటే. ఒక్కటే అనగా ఎన్ని ? ఒక్కటి మాత్రమే గదా! అనేక రకాల సంఘములు ఉన్నప్పుడు, వాటినన్నిటిని ఒకచోట చేర్చి అవన్నియు ఒక్కటే అని చెప్పుట

వింతగానే యుండును.

నా మిత్రులారా, దేవుడు మనకు ఇచ్చిన గ్రంథము ఒక్కటే. అది బైబిలు. మనమందరము దానిని చదివి, విశ్వసించి దాని బోధలకు లోబడిన యెడల మనమందరము ఒకే బోధకు లోబడుదుము. ఒకే సంఘమందు చేర్చబడుదుము. ఒకే నామమును ధరించుదుము. ఒకే రీతిగా ఆరాధించుదుము. ఒకే సంగతిని బోధించుదుము గదా. బైబిలు మనలను విభజించదుగాని అది ఏకపరచును. మనమందరము విభజింపబడవలెనని క్రీస్తు బోధించలేదు. కాని మనమందరము ఆయనలో ఒకటై యుండవలెనని కోరెను. మనము దేవుని చిత్తమును జరిగించినప్పుడు తప్పక ఐకమత్యము ఉండును. అంతకుముందు కాదు.

# 28. క్రొత్త నిబంధన ఆరాధన

( New Testament Worship )

క్రొత్త నిబంధన 3 రకములైన ఆరాధనను గూర్చి చెప్పుచున్నది. మొదటిది-తెలియని ఆరాధన. ఏథెన్సు ప్రజలు విగ్రహములను పూజించుట వలన తెలియని ఆరాధను చేయుచున్నారని పౌలు చెప్పెను (అపో.కా. 17:23-31). రెండవది-వ్యర్థారాధన. ఈ ఆరాధన శూన్యమైనది, పనికిరానిది. ఏలయనగా అది మానవకల్పిత సిద్ధాంత ములపై ఆధారపడి యున్నది. "మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించు చున్నారు" అని క్రీస్తు పలికెను (మత్తయి 15:9). మూడవది సత్యారాధన : దేవుడు కోరునట్టి ఆరాధన ఇది. "దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధించ వలెను" అని చెప్పి క్రీస్తు దీనిని బలపరచెను. మన ఆరాధనమూర్తి దేవుడై యుండవలెనని దయచేసి గమనించుము. ఆయన నారాధించవలెనని దేవుడు మనలను బలవంతము చేయడు గాని, అట్లు చేయుటకు మనము నిశ్చయించుకొనిన యెడల మన ఆరాధన ఆత్మతోను, సత్యముతోను ఉండవలెను. ఆత్మతో ఆరాధించుట అనగా నిష్కపటముగ, భక్తిభావముతో ఆరాధించుట సత్యముతో ఆరాధించుట యనినపుడు సత్యవాక్యమయిన క్రొత్త నిబంధన ననుసరించి ఆరాధించుట ఈ విధముగ మాత్రమే మన ఆరాధన సత్యమైనదై అంగీకారయోగ్యముగ నుండును.

మనము దేవుని సత్యముతో ఆరాధించవలెను. గనుక, ఆ సత్యము ఏమిటో, మనము చేయవలసినదేమిటో కనుగొనవలెను. దీనిని

కనుగొనుటకు మనము క్రొత్త నిబంధన తట్టు తిరగవలెను. సత్యముతో ఆరాధించవలెనని దేవుడు మనలను కోరినప్పుడు ఆయన కోరు దానిని సత్యవాక్యములో తప్పకబయలుపరచి యుండును. క్రొత్త నిబంధను చదువునప్పుడు ఆదిమ క్రైస్తవులు ఆరాధనలో కనీసము అయిదు సంగతులను జరిగించినట్లు మనము కనుగొనగలము. అవి ఈ క్రింద నీయబడినవి.

1. క్రైస్తవులు దేవుని వాక్యమును ధ్యానించుటకు కూడుకొనిరి. అపో.కా. 20:7లో పౌలు ఒక కూటములో ప్రసంగించుట చూడగలము. మనము లేఖనములను పరిశోధింపవలెనని క్రీస్తు బోధించెను (యోహాను 5:39). వాక్యమును పఠించవలెనని పౌలు తిమోతిని హెచ్చరించెను (2 తిమో 2:15). బైబిలును చదువుకుండగా ఆరాధన జరిగించుటను మనము ఊహించుకొనలేము. దేవుడు ఈ విధముగా మనతో మాటాలాడును గనుక ఇది సరియైనది.

2. వారు ప్రార్థన చేయుటకు కూడుకొనిరి. ఆదిమ క్రైస్తవులు "అపొస్తలుల బోధయందును, సహవాసమందును, రొట్టె విరుచుట యందును, ప్రార్థన చేయుటయందును ఎడతెగక యుండిరని" మనము అపో.కా. 2:42లో చూడగలము. ఎడతెగక నిత్యము ప్రార్థన చేయుడి (1 థెస్స 5:17) యని పౌలు చెప్పినందున ఇది కూడ తప్పక ఆరాధనయై యుండును. మనము విసుగక నిత్యము ప్రార్థన చేయవలెననిక్రీస్తు కూడ బోధించెను (లూకా 18:1). మానవుడు ఈ విధముగ దేవునితో మాట్లాడును గనుక ప్రార్థనలేని ఆరాధన ఆరాధన కాదు అని మనము ఊహింపవచ్చును.

3. వారు దేవునికి స్తుతిగానములు చేయుటకు కూడుకొనిరి. మొదటిగా ఎఫెస్సీ 5:19 చూద్దాం. "ఒకని నొకడు కీర్తనలతోను సంగీతముల తోను, ఆత్మసంబంధమైన పాటలతోను హెచ్చరించుచు,

మీ హృదయములలో ప్రభువును గూర్చి పాడుచు కీర్తించుడి". మరియు కొలస్స 3:16ను కూడ గమనించుము. రెండు రకములైన సంగీతము ఉన్నదని, అది గాత్రము, జంత్రము అని గమనించుము. దేవుడు ఆరాధనలో స్వరగానములు కోరినట్లు వాక్యము ప్రబోధించుచున్నది. హెబ్రీ 13:15లో క్రైస్తవులు క్రొత్త నిబంధనను బట్టి పరిపాలింప బడవలెను. ఆయిన మన జిహ్వాఫలములను కోరెను గాని శీతలమై నిర్జీవమై మనస్సు లేనదై యున్న యంత్రగానమును ఆయన కోరలేదు. దేవుని మనము సంతోషపరచవలెనని జ్ఞాపకముంచుకొనుము.

4. మొదటి క్రైస్తవులు ప్రభురాత్రి భోజము నందు పాలుపొందు టకు కూడుకొనిరి. మత్తయి 26:26–28లో క్రీస్తు ఈ భోజనమును స్థాపించెను. రొట్టె ఆయన శరీరమునకు, ద్రాక్షరసము ఆయన రక్తమునకు గురుతుగా వాటినిచ్చెను. 1 కొరింథీ 11వ అధ్యాయములో ప్రతి క్రైస్తవుడు రొట్టెను తిని ద్రాక్షరసమును త్రాగునపుడు క్రీస్తు శరీర రక్తములకు జ్ఞాపకార్థముగా చేయవలెనని పౌలు వ్రాసెను. అపొ.కా. 20:7లో మొదటి క్రైస్తవులు రొట్టె విరుచు టకు ఆదివారమున కూడుకొనినట్లు ఒక మాదిరి మనకున్నది. మనము కూడుకొనుట మానరాదని హెబ్రీ 10:25లో హెచ్చరింపబడినది.

5. వారు వర్ధిల్లిన కొలది కానుకలు ఇచ్చుటకు కూడుకొనిరి. కొరింథులో నున్న సంఘమును పౌలు ఇట్లు హెచ్చరించెను : "నేను వచ్చినపుడు చందా పోగుచేయకుండ ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును తాను వర్ధిల్లిన కొలది ఇయ్యవలెనని" గమనించుము. ఎంతైనా కొంత ఇయ్యవలెనని లేదు. ఇది ఇష్టపూర్వక అర్పణ. కాని వారు వర్ధిల్లిన కొలది ఇయ్యవలెనని యున్నది గనుక ప్రతివారు ఎంత మట్టుకు వర్ధిల్లిరో నిశ్చయించుకొని యిచ్చుట మంచిది.

గనుక లేఖనములు బయలుపరచు ఆరాధన ఇది. మొదటి క్రైస్తవులు ప్రతి ఆదివారము ఈ విధముగ ఆరాధన జరిగించుటకు కూడుకొనిరి. మనము క్రైస్తవులమయితే వారికంటే తక్కువ చేయగలమా ?

# 29. వారములో మొదటి దినము

## (The First Day of the Week)

ప్రతి వారములోను ఏడు దినములున్నవి. అయితే దేవుని ఏ దినమున క్రైస్తవుడు ఆరాధించవలెను ? ఏదైనా ఒక దినము ఆరాధన దినముగ ప్రత్యేకింపబడెనా ? బైబిలు ఏమి బోధించుచున్నది ?

ధర్మశాస్త్ర ప్రకారము యూదుల ఆరాధన దినము సబ్బాతు దినమై యుండెనని మనమందరము ఎరుగుదుము. ఇతర మతములలో చూచిన ముస్లిములు శుక్రవారమును, బౌద్ధులు 'పోయా' దినముునను ఆరాధించెదరు. అయితే క్రైస్తవుల సంగతి యేమి ? ఆరాధన చేయు దినము ఏదైనను సరియైనదేనా ?

మనలో అనేకులు యూదుల చట్టబద్ధమైన సబ్బాతు దినము ఇంకను అమలులో నున్నదని చెప్పుదురు. అయితే అది యూదులకు మాత్రమే యియ్యబడెనని గమనించుము (నిర్గమ 20:1-17). మనకు యియ్యబడిన ధర్మశాస్త్రము కంటె అది వేరైనది, అది నెరవేర్చబడినది, తొలగించబడినది (యోహాను 1:17 మత్తయి 5:17-19). క్రీస్తు సబ్బాతు నాచరించెను. ఏలయనగా ఆయన వేరొక చట్టము క్రింద జీవించి మరణించెను. ఆ దినమును ఆచరించవలసినదిగా క్రీస్తు ఒక్కసారి కూడ ఆజ్ఞ యివ్వలేదని గుర్తుంచుకొనుట మంచిది. అపొస్తలులు కూడ ఆజ్ఞ యివ్వలేదని గుర్తించుకొనుట మంచిది. అపొస్తలులు కూడ దాని నాచరించలేదు. ఆజ్ఞాపించలేదు. పౌలు సబ్బాతు దినమున సమాజ మందిరములలో ప్రవేశించెను. గాని ఆరాధించుటకు వెళ్లలేదు. అయితే అతడు ఎందుకు వెళ్ళెను ? దేవుని వాక్యమును బోధించుటకు. అతని ఉద్దేశమును యూదులు కనుగొనిన

తరువాత, అతనికి యూదుల దేవాలయములలో ప్రవేశము లభించక పోయెను.

కేథలిక్కులు ఆరాధన దినమును మార్చివేసిరి యని చెప్పువారు కొందరున్నారు. బైబిలును మేము యిచ్చితిమని కేథలిక్కులు ఆరోపించు కొందురు. అయితే యీ రెండు అబద్ధమే. క్రీస్తు ధర్మశాస్త్రము క్రింద నున్న వారెన్నడును సబ్బాతును ఆచరించినట్లు బైబిలు ఎక్కడ బోధించుట లేదు. చరిత్ర కూడ అట్లు చెప్పుటలేదు.

సత్యవాక్యమును మనము సరిగ విభజింప గలిగి (2 తిమో 2:15), మోషే ధర్మశాస్త్రమునకును, క్రీస్తు ధర్మశాస్త్రమునకును గల భేదమును గ్రహించినపుడు, మోషే చట్టముతో కూడ సబ్బాతు దినము ఎత్తివేయబడెనని (2 కొరింథీ 3:6-16), క్రీస్తు చట్టము ఒక క్రొత్త దినమును అనగా ఆదివారమును ఆరాధన దినముగ ప్రవేశపెట్టెనని చూడగలము. అపొ.కా. 15:13-19 వరకు చదివిన యెడల అన్యజనులలో నుండి క్రైస్తవులయిన వారిని సబ్బాతు నుండియు, మోషే చట్టము నుండియు పరిశుద్ధాత్ముడు విడుదల చేసెనని గ్రహించగలవు.

ఆదివారమును గూర్చి, వాక్యప్రకారము లేని అనేక అభిప్రాయము లను నీవు పొందక ముందు కొన్ని సంగతులను చూపించ గోరుచున్నాను. మొదటిది- వారములో మొదటి దినము క్రైస్తవ సబ్బాతు దినము కాదు. అది విశ్రాంతి దినము కాదు. ఆచరించవలసిన దినము కూడ కాదు. అది పరిశుద్ధ దినము కాదు. అయితే అదేమిటి ? అది క్రైస్తవులు సమాజముగ కూడుకొని దేవుని నారాధించుటకు ప్రత్యేక పరచబడిన ప్రభువు దినము. పాతనిబంధన సబ్బాతుతో దానికి ఏమియు పోలికలు లేవు.

ఆదివారమును గూర్చి వాక్యమేమి చెప్పుచున్నది గమనించుము:

1. ఆదివారమున క్రీస్తు సమాధి నుండి లేచెను (మత్తయి 28:1-7). ఆయన పునరుత్థానుడైన తరువాత ఆదివారమున తన శిష్యులను రెండుసార్లు కలిసికొనెను (యోహాను 20:1, 19, 26).

2. పరిశుద్ధాత్ముడు పెంతెకోస్తు దినమున కుమ్మరింపబడెను. అది ఆదివారము (అపో.కా. 2:1-4), అది మనకెట్లు తెలియును ? ఏలయనగా పెంతెకోస్తు ఎల్లప్పుడు వారములో మొదటి దినముననే వచ్చెను.

3. మొట్టమొదటిగా సువార్త వారములో మొదటి దినమున ప్రకటింపబడెను.

4. సంఘము ఆదివారమున స్థాపించబడెను (అపో.కా. 2:38-47).

5. ఆదివారమున శిష్యులు రొట్టె విరుచుటకు కూడుకొనిరి.

"ఆదివారమున మేము రొట్టె విరుచుటకు కూడినప్పుడు పౌలు మరునాడు వెళ్ళనై యుండి వారితో ప్రసంగించుచు అర్ధరాత్రి వరకు విస్తరించి మాటలాడుచుండెను" (అపో.కా. 20:7).

6. ఆదివారమున క్రైస్తవులు కానుకల నీయవలెనని చెప్పబడెను. "పరిశుద్ధుల కొరకైన చందా విషయమైతే నేను గలతీయ సంఘములకు నియమించిన ప్రకారము మీరును చేయుడి. నేను వచ్చినప్పుడు చందా పోగుచేయకుండ ప్రతి ఆదివారము మీలో ప్రతివాడును తాను వర్ధిల్లిన కొలది తన యొద్ద కొంతసొమ్ము నిలువ చేయవలెను" (1 కొరింథీ 16:1-2). ఇది బహిరంగ సమావేశము అని పౌలు చెప్పిన మాటలను బట్టి గ్రహింపగు చున్నది. ఆరాధన దినము సబ్బాతు దినమయిన

యెడల పౌలు క్రైస్తవులను ఆదివారము కేవలము చందా నిచ్చుటకే ఎందుకు కూడుకొనవలెనని చెప్పెను ? సబ్బాతు దినమును యింకను ఆచరించువారు పౌలు బోధను గ్రహింపకయున్నారా ? అయితే ఎందుకు గ్రహింపకయున్నారు ?

7. ఆ దినము సమీపించిన కొలది క్రైస్తవులు సమాజముగా కూడుకొనుట మానరాదు (హెబ్రీ 10:25). ఆ దినము ఆదివార దినము. యోహాను దానిని ప్రభువు దినమని చెప్పెను (ప్రకటన 1:10). అది ఆరాధన దినము, ప్రభువును వెనుకనుంచుట కంటె ముందునుంచు దినము.

ఇంకను పాతనిబంధన ననుసరించువారు రోమా 7:1-7 2 కొరింథీ 3వ అధ్యాయము ఎఫెసీ 2 కొలస్స 2 హెబ్రీ 8:7-10లను జాగ్రత్తగా మరియొకసారి చదువవలెను. మనము మోషే ద్వారా కలిగిన ధర్మశాస్త్రము క్రిందలేము గాని క్రీస్తు ధర్మశాస్త్రము క్రిందయున్నామని గ్రహించవలెను. ఆయన చట్ట ప్రకారము ఉన్నట్టి దినమందు ఆయనను ఆరాధించెదము గాక. దానికంటె తక్కువైన దానిని ప్రభువు అంగీకరించడు.

# 30. అమలులోనున్న చట్టము ఏది ?

( Which Law is Binding ? )

బైబిలు రెండు ప్రాముఖ్య భాగములుగ విభజింపబడెను. పాత నిబంధన, క్రొత్త నిబంధన. నిబంధన యనగా శాసనము లేక ఒడంబడి యని అర్థము. దీనిని బట్టి దేవుడు తన ప్రజలకొక చట్టమును ఏర్పరచెనని తెలియుచున్నది. అయితే ఆయన మరొక క్రొత్త చట్టము ఏర్పరచి మొదటి దానిని పాతదిగా చేసెను. దానిని అమలులో లేకుండ చేసెను. ఈ రెండు చట్టములు ఒకేసారి అమలులో ఉండనేరవని గుర్తుంచుకొనవలెను.

బైబిలును చదువుచున్నప్పుడు పాతధర్మశాస్త్రము ఇక అమలులో లేదని అగుపడుచున్నది. అది ఈయబడిన కాలమునందైనను మనము జీవించి యుండలేదు. నిర్గమకాండములో చూచిన యెడల దానిని దేవుడు మోషే ద్వారా ఇశ్రాయేలీయులకు ఇచ్చెనని గమనించగలము (నిర్గమ 20). ఇప్పుడు ద్వితీయోపదేశకాండము నుండి కొంత చదువుదము : "మోషే ఇశ్రాయేలీయుల నందరిని పిలిపించి యిట్లనెను – ఇశ్రాయేలీయులారా, నేను మీ వినికిడిలో నేడు చెప్పుచున్న కట్టడలను, విధులను విని వాటిని నేర్చుకొని వాటి ననుసరించి నడువుడి. మన దేవుడైన యెహోవా హోరేబులో మనతో నిబంధన చేసెను. యెహోవా మన పితరులతో కాదు. నేడు ఇక్కడ సజీవులమై యున్న మనతోనే యీ నిబంధన చేసెను" (ద్వితీ 5:1-4). తరువాత అతడు పది ఆజ్ఞలు నిచ్చెను. గనుక ఆ చట్టము ఇశ్రాయేలీయులకు లేదా యూదులకు ఈయబడెను కాని అన్యజనులకు కాదు. అయితే ఆ చట్టము ఎంత వరకు పనిచేసెను ? అది ఇంకను అమలులోను

యున్నదా ? పరిశీలించుదము.

క్రీస్తు మోషే ధర్మశాస్త్రము ప్రకారము జీవించి మరణించెను. దానిని గూర్చి ఆయన ఇట్లు చెప్పెను : "ధర్మశాస్త్రమునైనను, ప్రవక్తల వచనముల నైనను కొట్టివేయవచ్చితినని తలంచవద్దు. నెరవేర్చుటకే గాని కొట్టివేయుటకు నేను రాలేదు. ఆకాశము భూమియు గతించి పోయిననే గాని ధర్మశాస్త్రమంతయు నెరవేరు వరకు దాని నుండి యొక పొల్లయినను, ఒక సున్నయైనను తప్పిపోదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను" (మత్తయి 5:17, 18). దీనిని బట్టి ధర్మశాస్త్రము ఎల్లకాలము కొనసాగింపబడునని ప్రభువు చెప్పుచున్నట్లు కొందరు భావించిరి. గాని, అట్లుకాదు. ఒక నిబంధనను రెండు విధములుగ నెరవేర్చవచ్చును. దానిని నాశనము చేయవచ్చును. లేదా దానిలోని షరతులను నెరవేర్చవచ్చును. క్రీస్తు పాత ధర్మశాస్త్రమును కొట్టివేయుటకు నిశ్చయించుకొనెను. తరువాత అది అంతయు నెరవేరు వరకు దానినుండి ఏమియును కొట్టివేయబడదని ఆయన చెప్పెను. ఎప్పటివరకు ధర్మశాస్త్రము నిలిచియుండును ? అంతయు నెరవేరు వరకు. ఇది ప్రభువు యొక్క రెండవ రాకడలో జరుగునది కాదు. ఏలయనగా అప్పుడు సమస్తమును లయమైపోవును. అయితే ధర్మశాస్త్రము త్వరలోనే నెరవేర్చబడబోవుచున్నట్లు క్రీస్తు మాటలాడెను. అది ఎప్పుడు జరిగెను ?

ప్రభువు సిలువపై మరణించక ముందు "అంతయు సమాప్త మాయెను" అని పలికెను (యోహాను 19:30). ఆయన చనిపోయిన ఆ గడియలోనే దేవాలయపు తెరపై నుండి క్రిందికి చినిగెను (మత్తయి 27:51). అట్లు ధర్మశాస్త్రము సమాప్తమాయెను. దేవాలయపు తెర చినుగుట దానికి గురుతుగా జరిగెను. పౌలు ఇట్లు వ్రాసెను : "దేవుడు

వ్రాతరూపకమైన ఆజ్ఞల వలన మనమీద ఋణముగాను, మనకు విరోధముగాను నుండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి, దానిమీద చేవ్రాతను తుడిచివేసి మనకు అడ్డము లేకుండ దానిని ఎత్తివేసెను" (కొలస్స 2:14). గనుక క్రీస్తు ధర్మశాస్త్రమును సిలువకు మేకులతో కొట్టివేసెను. "ధర్మశాస్త్రము మోషే ద్వారా అనుగ్రహింప బడెను కృపయు సత్యమును యేసుక్రీస్తు ద్వారా కలిగెను" అని యోహాను వ్రాసెను (యోహా 1:17). ఈ రెండింటికి మధ్యనున్న భేదమును గమనించుము. దేవుడే మోషే ఏలియా క్రీస్తుల యెదుట ఈయన నా ప్రియ కుమారుడు, ఈయన యందు నేనానందించు చున్నాను "ఈయన మాటలను వినుడి" యని చెప్పెను (మత్తయి 17:5). పూర్వకాలమందు నానా సమయములలోను, నానా విధములు గాను నానా ప్రవక్తల ద్వారా మనపితరులతో మాటలాడిన దేవుడు ఇప్పుడు కుమారుని ద్వారా మనతో మాటలాడెను. (హెబ్రీ 1:1,2).

హెబ్రీ పత్రిక దీనిని విపులపరచుచున్నది. "మరణశాసన మెక్కడ ఉండెనో అక్కడ మరణ శాసనము వ్రాసిన వాని మరణము అవశ్యము. అశాసనమును వ్రాసినవాడు మరణము పొందితేనే అది చెల్లును అది వ్రాసినవాడు జీవించుచుండగా అది ఎప్పుడైనా చెల్లునా ?" (హెబ్రీ 9:16, 17). మరల "ఆ రెండవ దానిని స్థిరపరచుటకు మొదటి దానిని కొట్టి వేయుచున్నాడు. యేసుక్రీస్తు యొక్క శరీరము ఒక్కసారియే అర్పింపబడుటచేత ఆ చిత్తమును బట్టి మనము పరిశు ద్ధ పరచబడియున్నాము" (హెబ్రీ 10:9, 10). ఆ మొదటిదే పాత నిబంధన చట్టము. క్రొత్త దానిని ప్రవేశపెట్టుటకు ఆయన పాత చట్టమును తీసివేసెను.

2వ కొరింథీ 3వ అధ్యాయమును చదివిన తరువాత ధర్మశాస్త్రము

ఇంకను అమలులో నున్నదని ఎవరు తలంచగలరు ? పాతనిబంధన మరణ కారణమగు పరిచర్యయని, క్రొత్తనిబంధన లేక క్రీస్తు చట్టము జీవింపజేయు ఆత్మయని పౌలు నుడివెను. గలతీయులకు వ్రాసిన పత్రిక అంతటిలోను క్రీస్తును వదలి తిరిగి ధర్మశాస్త్రము నొద్దకు వెళ్ళుట బుద్ధి హీనతయని అతడు బోధించెను. "మీలో ధర్మశాస్త్రము వలన నీతిమంతులని తీర్చబడు వారెవరో, వారు క్రీస్తులో నుండి బొత్తిగా వేరుచేయబడి యున్నారు. కృపలో నుండి తొలగిపోయి యున్నారు" (గలతీ 5:4), గలతీ 4:21-31 కూడాచదువుము.

గనుక మనము మోషే ధర్మశాస్త్రము క్రింద ఇకలేము గాని ఇప్పుడు క్రీస్తు ధర్మశాస్త్రము లేక క్రొత్తనిబంధన క్రింద యున్నాము అందువలననే మనము సిలువపై రక్షింపబడిన దొంగను మన రక్షణాధారము చేసి కొనలేము. దశమ భాగముల నిచ్చుటకు గాని, వాయిద్యముల నుపయోగించుటకు గాని, సబ్బాతు దినమునకు గాని మొదలగు వాటన్నిటి కొరకు ధర్మశాస్త్రము నొద్దకు మనము వెళ్ళలేము. మోషే ధర్మశాస్త్రము చెల్లుబడిలో లేనందున మనము నరహత్య, వ్యభిచారము మొదలగునవి చేయవచ్చునని కాదు. దానివలె క్రొత్త నిబంధన ఈ పాపముల నన్నిటిని మానసికముగను, భౌతికముగను ఖండించుచున్నది.

పాతనిబంధన దేవుని వాక్యమైయున్నది గాని ఒక చట్టములె అది చెల్లుబడిలో లేదు. మనము క్రీస్తు చట్టము క్రింద జీవించుచున్నాము గనుక మన విశ్వాసమునకు కర్తవలెను, కొనసాగించువానివలె నున్న క్రీస్తు వైపు మనము చూచుచున్నాము. క్రీస్తు మనకొరకు ఈ లోకమునకు వచ్చి నిత్యజీవ నిరీక్షణ నిచ్చునపుడు ధర్మశాస్త్రము నొద్దకు తిరిగి ఎవరు వెళ్ళగోరుదురు ? నీవు

చదువునప్పుడు పౌలు సలహాను పాటించి వాక్యమును సరిగ విభజింపుము (2 తిమోతి 2:15). అట్లు చేసినపుడు చెల్లుబడిలో యున్న చట్టమేదియో నీవు ఇట్లే గమనించగలవు.

# 31. పరిశుద్ధాత్మ పరిమాణములు

( Measures Of the Holy Spirit )

అద్భుతములు యింకను జరిగించబడు చున్నవని అనేకులు నమ్ముదురు. మొదటి శతాబ్దమందు అపొస్తలులు పొందిన పరిశుద్ధాత్మ బాప్తిస్మము ఈనాడు దేవుని పిల్లలు కూడ పొందగలరు అని బోధించు వారు పైన చెప్పబడిన సిద్ధాంతమును ప్రకటించెదరు. పరిశుద్ధాత్మ పరిమాణములను సరిగ ఎరుగనందువలన ఈ గందరగోళము అంతయు ఉద్భవించినది.

1. "పరిమాణము లేకుండ క్రీస్తు పరిశుద్ధాత్మను పొందెను. ఏలయనగా దేవుడు తాను పంపిన వానికి కొలతలేకుండ ఆత్మనను గ్రహించును గనుక ఆయన దేవుని మాటలే పలుకును" (యోహాను 3:34). అందుచే ఆయనకు అన్నియు చేయుశక్తి అనుగ్రహించెను. మూగవారికి మాటలాడనిచ్చెను. చెవిటివారికి వినుటకు శక్తి వచ్చెను, జనసమూహము లను పోషించెను, నీళ్లపై నడచెను. సముద్రము నణచెను. చనిపోయిన వారిని బ్రతికించెను, అన్నిటికంటె గొప్పగా ఆయన చనిపోయి బ్రతికెను. కాని ఎందుకు ? వాక్యమును స్థిరపరచి విశ్వాసులనుగా చేయుటకు (యోహాను 20:30, 31).

2. పరిశుద్ధాత్మ బాప్తిస్మము క్రొత్త నిబంధనలో రెండు సందర్భము లలో మాత్రమే జరిగెను. మొదటిగా అపొస్తలులు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిరి (అపొ.కా. 2). దీనికి ముందుగనే వారిని సర్వసత్యములోనికి నడిపించుటకు ఆదరణ కర్తను పంపించెదనని క్రీస్తు వారికి వాగ్దానము చేసెను (యోహాను 16:13). క్రీస్తు వెళ్ళిపోవుచుండెను. అయితే అపొస్తలులకు యింకను నడిపింపు

అవసరమని గ్రహించి వారిని నడిపించు నిమిత్తము పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిన తరువాత యితర భాషలలో మాటలాడు శక్తి వారికి కలిగెను. వారు కుంటివారిని బాగుచేసిరి. రోగులను స్వస్థపరచిరి, చనిపోయిన వారిని లేవదీసిరి. అద్భుతములు చేయగల్గునట్లు యితరులపై వారు చేతులుంచిరి. అట్టి శక్తిని వారు కలిగియుండిరి.

రెండవది - కొర్నేలి యింటివారు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిరి. యూదులవలె అన్యజనులను కూడ దేవుడు అంగీకరించునని తెలియ జేయుటకు యిది జరిగెను (అపొ.కా. 10:11). వారు దానిని పొంది, అన్యభాషలలో మాటలాడుట ద్వారా దానిని నిరూపించి నప్పుడు "మనవలె పరిశుద్ధాత్మను పొందిన వీరు బాప్తిస్మము పొందకుండ ఎవడైనను నీళ్ళకు ఆటంకము చేయగలడా ?" అని పేతురు ప్రశ్నించెను (అపొ.కా. 10:47). దీనిని గూర్చి పేతురు యిట్లు వర్ణించెను : "నేను మాటలాడ నారంభించి నప్పుడు పరిశుద్ధాత్మ మొదట మనమీదికి దిగిన ప్రకారము వారి మీదికిని దిగెను" (అపొ.కా. 11:15). విశ్వాసులందరివలె కొర్నేలి యింటివారికి పరిశుద్ధాత్మ కలిగెను అని పేతురు చెప్పుటలేదని గమనించుము. గాని వారు అపొస్తలుల పొందినరీతిగ పరిశుద్ధాత్మను పొందిరి.

3. చేతులుంచగా కలుగు పరిశుద్ధాత్మ పరిమాణము : చేయవలసిన పని ఎక్కువగుట చేతను, అపొస్తలులు కొద్ది మందియగుట చేతను వారు పరిశుద్ధాత్మ శక్తిని యితరులు పొంద గల్గునట్లు వారిపై చేతులుంచిరి. మొదట ఏడుగురిపై అపొస్తలులు తమ చేతులుంచిరి (అపొ.కా. 6:6). ఫిలిప్పు వంటి సువార్తికులు సమరయకు వెళ్ళి అద్భుతములు చేయు శక్తిని యిట్లు పొందగల్గిరి.

దాని ద్వారా అనేకులు సువార్తకు లోబడిరి. కాని ఫిలిప్పు ఈ శక్తిని ఇంకొకరికి యిచ్చుటకు వీలులేకుండెను. తరువాత అపొస్తలుడైన పేతురు యోహానులు యెరూషలేము నుండి వచ్చి అద్భుతములు చేయుశక్తిని పొందగల్గునట్లు జనులపై చేతులుంచిరి (అపొ.కా. 8:14-17).

4. సాధారణ రీతిగ లభించు పరిశుద్ధాత్మ పరిమాణము పొందిన వారు అపొస్తలులు చేతులుంచగా పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందినవారు తప్ప అందరు పరిశుద్ధాత్మ వరమును సామాన్య పరిమాణములో పొందిరి. దీనిని పొందినవాడు పరిశుద్ధాత్మను పొందునుగాని అద్భుత శక్తిని కాదు. పెంతెకోస్తు దినమున పేతురు "మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" అని చెప్పెను (అపొ.కా. 2:38).

పరిశుద్ధాత్మ బాప్తిస్మము అపొస్తలులకు మాత్రమే వాగ్దానము చేయబడెను. ప్రభువుచే అది అనుగ్రహించబడెను అది వారిని సర్వసత్యము లోనికి నడిపించుటకు, వాక్యమును స్థిరపరచుటకు, క్రొత్త నిబంధనను వ్రాయుటలో నడిపించుటటకు సహాయకారిగ యియ్యబడెను. కొర్నేలి యింటివారైతే నీటి బాప్తిస్మము పొందకు మునుపే వారు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిరి.

చేతులుంచట ద్వారా పరిశుద్ధాత్మను పొందు వరము అపొస్తలులకు మాత్రమే అనుగ్రహించబడెను. అపొస్తలులు, వారు చేతులుంచిన వారు మరణించగా ఆత్మసంబంధమైన అద్భుత కార్యములు సమాప్తి ఆయెను. అప్పటికి క్రొత్త నిబంధన సంపూర్తిగ లిఖింపబడుటచేతను,

దాని ద్వారా మానవుడు సత్యము నందు నడిపింపబడుటకు ఉద్దేశింపబడుట చేతను, వాటి అవుసరము ఇంక లేక పోయెను (యాకోబు 1:25, 2 తిమో 3:16, 17).

అయితే ఈనాడు కూడ పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందితిమని, అద్భుతములు చేయగల శక్తి ఉన్నదని చెప్పుకొనువారి సంగతి యేమి? వారు మోసగించబడి, తప్పుగా నడిపింపబడిన వంచకులై యున్నారు. వారు దేవుని చిత్త ప్రకారము చేయలేనప్పుడు ఆత్మవారిని ఎట్లు నడిపించగలదు? బైబిలు నందు లేని సంఘములోనికి పరిశుద్ధాత్మ వారిని నడిపించునా? మానవకల్పిత నామములు దరింపనీయునా? అట్లు ఎన్నడు కానేరదు. నిజముగా వారికి అద్భుత శక్తి ఉన్న యెడల అపొస్తలులు, యేసుక్రీస్తు చేసిన వాటన్నిటిని చేయగలరు. వారు దంబములను చెప్పుకొనుటయే తప్ప ఏమియును చేయలేరు. నా మిత్రుడా, వారి అబద్ధ బోధలను బట్టి మోసపోకుము. బైబిలు మాత్రమే నీ మార్గదర్శిగా ఉండనిమ్ము.

# 32. అన్య భాషలు

## (The Unknown Tongues?)

అన్యభాషలలో మాటలాడుశక్తి మాకు ఉన్నదని చెప్పుకొను అనేకులు మనమధ్యన ఉన్నారు. దేవుని ఆత్మ వారి ద్వారా మాట్లాడుచున్నదని వారు చెప్పుదురు. వారు మాట్లాడునది వారికిగాని, వినుచున్న వారికి గాని తెలియదనియు కేవలము దేవునికే తెలియుననియు వారు చెప్పుదురు. అట్టి దానిని బైబిలు ఎక్కడను బోధించుట లేదు. అట్టివారు కేవలము మోసగింపబడినవారు, వారు మాట్లాడునది అన్యభాష కాదు అది ఏ భాష కాదు గాని కేవలము శబ్ధమును మాత్రమే చేయుదురు.

భాషతో మాట్లాడుటను గూర్చి బైబిలు చెప్పుచున్నది (1 కొరింథీ 14:2). అయితే మాట్లాడుచున్న వానికి అది అన్యభాష కాదు. మాటలాడు వానికి అది అర్ధమగును గాని వినువారికి కాదు. అందువలన అతనికి ఉన్న గ్రహింపు ఫలహీనమగును. అందుచే అతడు దేవునితో మాటలాడును. తనకు క్షేమాభివృద్ధి కలుగజేసికొనును అయితే వినుచున్న వారికి అతడు పలుకునది అర్ధము కాదు. ఏలయనగా అతడు అన్యభాషతో మాటలాడుచున్నాడు (1 కొరింథీ 14:4). అన్య భాష యనగా వేరొక భాష.

'భాష' అనునది అర్ధము చేసుకొనదగు మాటలు అని మన మెరుగుదుము. దానిని పౌలు ఇట్లు వివరించుచున్నాడు : "అలాగే మీరు స్పష్టమైన మాటలు నాలుకతో పలికితేనే గాని పలికినది ఏలాగు తెలియును? మీరు గాలిలో మాట్లాడుచున్నట్లుండును" (1 కొరింథీ 14:9). మరల నేను భాషతో ప్రార్ధన చేసిన యెడల నా ఆత్మ ప్రార్ధన

చేయును గాని నా మనస్సు ఫలవంతముగా ఉండదు. కాబట్టి ఆత్మతో ప్రార్థన చేతును. మనస్సుతోను ప్రార్ధన చేతును ఆత్మతోను పాడుదును. మనస్సుతోను పాడుదును" (1 కొరింథీ 14:14, 15). అన్యభాష వినుచున్న వారికి అది అన్య మాటలతో కూడినది. అట్టి సందర్భములో పౌలు ప్రార్థన చేతును అని చెప్పుచున్నాడు. గాని అతనిని వినుచున్న వారికది అర్థము లేకుండును. పాడుటలో కూడ ఇది వర్తించును గనుక ఆత్మతోను, మనస్సుతోను ప్రార్థించుటకు, పాడుటకు అతడు నిశ్చయించుకొనెను.

మరల పౌలు యిట్లు చెప్పుచున్నాడు : "లేని యెడల నీవు ఆత్మతో స్తోత్రము చేసినప్పుడు ఉపదేశము పొందనివాడు నీవు చెప్పు దానిని గ్రహింపలేడు. గనుక, నీవు కృతజ్ఞతాస్తుతులు చెల్లించినప్పుడు - ఆమెన్ అనివాడేలాగు పలుకును ? నీవైతే బాగుగానే కృతజ్ఞతాస్తుతులు చెల్లించు చున్నావు గాని యెదుటివాడు క్షేమాభివృద్ధి పొందడు. నేను మీ యందరి కంటే ఎక్కువగా భాషలతో మాటలాడుచున్నాను అందుకు దేవుని స్తుతించెదను. అయినను సంఘములో భాషతో పదివేల మాటలు పలుకుట కంటే, ఇతరులకు బోధ కలుగునట్లు నా మనస్సుతో అయిదు మాటలు పలుకుట మేలు" (1 కొరింథీ 14:16-19).

అతడు మరల యిట్లు హెచ్చరించుచున్నాడు : "అన్యభాషలు మాటలాడు జనుల ద్వారాను, పరజనుల పెదవుల ద్వారాను, ఈ జనులతో మాటలాడుదును అప్పటికైనను వారు నా మాట వినక పోవుదురు అని ప్రభువు చెప్పుచున్నాడని ధర్మశాస్త్రములో వ్రాయబడియున్నది. కాబట్టి భాషలు విశ్వాసులకు కాదు. అవిశ్వాసులకే సూచకమై యున్నవి" (1 కొరింథీ 14:21, 22)

మరల వినుడి : "భాషతో ఎవడైనను మాటలాడితే ఇద్దరు, అవసరమైన యెడల ముగ్గురికి మించకుండ వంతుల చొప్పున మాటలాడవలెను. ఒకడు అర్ధము చెప్పవలెను. అర్ధము చెప్పువాడు లేనియెడల అతడు సంఘములో మౌనముగా ఉండవలెను గాని, తన తోను, దేవునితోను మాటలాడు కొనవచ్చును" (1 కొరింథీ 14:27, 28). అన్యభాష పామరులకు అర్ధము కానిది. వంతుల చొప్పున మాటలాడిన తరువాత అర్ధము చెప్పవలెను. అర్ధము చెప్పువాడు లేనియెడల మౌనముగా నుండవలెను లేదా తనతోను, దేవునితోను మాటలాడుకొనవచ్చును. ఇంకొక మాటలో వారిలో వారు ప్రార్ధన చేసుకొనవలెను.

అన్యభాషలతో మాటలాడు శక్తి ఎవరు కలిగియుండిరి? అపొస్తలులు కలిగియుండిరి. పరిశుద్ధాత్మ బాప్తిస్మమును ప్రభువు వారికి వాగ్దానము చేసెను. దానిని పొందిన తరువాత వారు అన్యభాషలతో మాటలాడసాగిరి (అపొ.కా. 2:6). కొర్నేలి యింటివారు కూడ పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిరి. అన్యజనులు కూడ యూదులవలె దేవునికి అంగీకార యోగ్యులే అని నిరూపించుటకు వారు దానిని పొందిరి. వారును అన్యభాషలతో మాటలాడిరి (అపొ.కా. 10). ఇంకా అపొస్తలులు చేతులుంచగా భాషలు మాటలాడిన వారుండిరి (అపొ.కా. 19:1-7). ఇట్టివారు ఇంకెవరైన యున్నారా? ఉన్నయెడల వారిని గూర్చి బైబిలు ఎక్కడను చెప్పుట లేదు. అయితే వారిక ఈ శక్తి ఎందుకు ఈయబడెను? వారు ఈ లోకములో వేర్వేరు దేశములు వెళ్ళి, ఆ దేశభాష నేర్చుకొననవసరము లేకుండగ, ఒక అనువాదకుని సహాయము లేకుండా సువార్తను ప్రకటించుటకు వారికి ఈ శక్తి ఈయబడెను. అది ఎంతకాలము మట్టుకు ఉండవలెను?

క్రొత్త నిబంధన పూర్తిగా వ్రాయబడి లోకమునకు యియ్యబడు నంతవరకు. అద్భుతములు భాషలు మొదలగునవి నిలిచిపోవునని పౌలు చెప్పెను (1 కొరింథీ 13:8–10 యాకోబు 1:25). అందువలన అద్భుత రీతిగ ఈనాడు మాటలాడు భాషలు లేవు. వాటి అవుసరము లేనే లేదు. ప్రపంచము నందంతటా బైబిలు యీయబడి యున్నది.

అన్యభాషలలో ఈనాడు మాటలాడువారు అనేక సంగతులు మరచి పోవుచున్నారు :

1. పరిశుద్ధాత్మ బాప్తిస్మము వారి కొరకు వాగ్దానము చేయబడలేదు.

2. అపొస్తలులు చేతులుంచగా పరిశుద్ధాత్మ శక్తిని పొందవచ్చును. అయితే అపొస్తలులందరు ఏనాడో మరణించిరి గనుక వారు చేసిన పనిని ఎవరు చేయలేరు.

3. భాషతో మాటలాడుట యనగా వేరొక భాషతో మాటలాడుట యనియర్థము, కాని అర్థము లేని శబ్దములు చేయుటకాదు.

4. అన్యభాషలు అవిశ్వాసులకు సూచకమై యున్నవి. (అయితే ఈనాడు విశ్వాసుల సభలలోనే వారు మాటలాడుదురు !)

5. ఈనాడు మాటలాడువారికి, వినుచున్నవారికి ఆ భాష ఏమిటో అర్థము కాని యెడల, దానిని దేవుడెట్లు గ్రహింపగలడు ? క్రొత్త నిబంధన రోజులలో యిట్లు లేదు. గనుక నేటి ప్రజలకు ఆనాడున్న శక్తి లేదు.

6. భాషతో మాటలాడుచున్నాము అని చెప్పుకొనువారు, అపొస్తలులు పెంతెకోస్తు దినమున మాటలాడినట్లు ఇతర భాషతో

మాటలాడలేరు. వారి "గొప్ప బోధకులు" విదేశములు వెళ్లిన యెడల అనువాదకులు ద్వారా వారు మాటలాడుదురు. గనుక ఈనాటి అన్యభాషలకును, ఆనాటి అన్యభాషలకును పోలిక ఎక్కడను లేదు.

చివరిగా అనేకులు మోసగింపబడు చున్నారని మనము గ్రహించు కొనవలెను. ఈ అంశముపై సత్యమును గ్రహించు నిమిత్తము మీ బైబిలు చదవండి. అయితే నీకు, వారికి లేని శక్తి ఉన్నదని నమ్ముచు మోసగించు కొనవద్దు. అట్టి శక్తి నేటి మానవులకు ఇయ్యబడలేదు.

# 33. మత సంబంధ నామములు, బిరుదులు

## ( Religious Names and Titles )

మానవుడు డాంభికుడు, పేరు ప్రఖ్యాతులనతడు ప్రేమించును. బిరుదుల కొరకు, బలము కొరకు అతడనేక ప్రయత్నములు చేయును. క్రైస్తవునివలెను, బోధకునివలెను ఉంటే అతనికి సరిపోదు. ఇంకా ఎక్కువ అతనికి కావలెను. ఈ అభిలాషను తీర్చుకొనడానికి, మానవుడు తన కిష్టము వచ్చినని నామములను, బిరుదులను హోదాలను, ఆచారములను కల్పించెను. అందువలననే దేవునితో ఆరంభించని నామములను, బిరుదులను హోదాలను మనుష్యులు కలిగియుండుట ఈనాడు గమనించ గలవు. ఇట్టివాటిని గూర్చి దేవుడు వ్యతిరేకముగ మాటలాడెను. వాటిలో కొన్నిటిని ఇప్పుడు పరిశీలించుదము.

1. రెవరెండ్ : దీనిని అనేకమంది ఒక గొప్ప బిరుదుగా ధరించుకొనుచున్నారు. దానితో సరిపోక ఇంకా ఎక్కువ గొప్పతనము ఆ బిరుదులో కల్పించుటకు "రైట్ రెవరెండ్" అని యనిపించు కొనుచున్న వారున్నారు. అయితే ఈ బిరుదును ధరించుకొను వారుగాని, దాని ద్వారా వారిని గౌరవించు వారికి గాని "రెవరెండ్" అనుపదము బైబిలులో ఒక్కసారి మాత్రే వినియోగించబడెనని అది దేవునికి మాత్రమే వర్తించునని యెరుగక యున్నారు. దేవుని గూర్చి దావీదు పలుకుచు "ఆయన నామము పరిశుద్ధమైనది పూజింప తగినది" యని చెప్పెను (కీర్తనలు (111:9). నీవు దేవుడవా ? మీ బోధకుని రెవరెండ్ అని పిలుచు మీ సంగతి యేమి ? అతడు దేవుడా ? ఈ పదమును మానవులకు వినియోగించు వారందరికీ

సిగ్గు కలుగును గాక. అది దేవునికి మాత్రమే చెందును. దానిని ఆయన నుండి తీసివేయ ప్రయత్నించవద్దు.

2. ఫాదర్ : వేలకొలది మతగురువులు 'ఫాదర్' అని పిలువబడు చున్నారు. 'ఫాదర్' (తండ్రి) అని మాత్రమే కాదు గాని 'హోలి ఫాదర్' – (పరిశుద్ధ తండ్రి) యని కూడ పిలువబడుచున్నారు. ఈ బిరుదును తగిలించుకొనిన వారిని మరింకో విధముగా పిలిచినా వారికి నామోషి యగును. అట్టివారందరు యేసు చెప్పిన సంగతి జ్ఞాపకముంచుకొన వలెను "మరియు భూమి మీద ఎవనికైనను తండ్రి అని పేరు పెట్టవద్దు. ఒక్కడే మీ తండ్రి ఆయన పరలోకమందున్నాడు" (మత్తయి 23:3). అట్టి నామకరణములను ధరించుట దేవుని వ్యతిరేకించుట యని గ్రహించవలెను.

3. పాస్టర్ :డినామినేషన్ సంఘస్థులు వారి బోధకులను పాస్టర్ అని పిలుచుచుందురు ఆ బోధకులు అట్లు పిలుపించుకొందురు. వాక్యమును బట్టి చూచిన యెడల "పాస్టర్" అను పదము ఇట్లు ఉపయోగింపబడలేదు. 'పాస్టర్' అనగా సంఘకాపరి యని అర్థము. మనము 'కాపరులను' గూర్చి చదువగలము గాని 'కాపరి' గూర్చి బైబిలునందు చదువలేము. కాపరులుగా నియమింపబడినవారు 1 తిమోతి 3 లోను, తీతు 1లోను పౌలు ఉదహరించిన అర్హతలను నెలకొల్పినపుడే వారు నియమింపడిరి. వారు అధ్యక్షులనియు పెద్దలనియు, కాపరులనియు, ప్రెస్బిటర్‌లనియు పిలువబడిరి. ప్రతి స్థానిక సంఘములోను ఒకరికంటె ఎక్కువ కాపరులు లేక పెద్దలు ఉండిరి. నేడు క్రైస్తవులమని చెప్పుకొనువారు ఉపయోగించుకొనునది బైబిలు ప్రకారము లేని ఒక మతాచారము.

4. డాక్టర్ : డాక్టరేట్ డిగ్రీ వచ్చువరకు ఎవరైనను విద్యనభ్య

సించిన యెడల, ఆ బిరుదును మతబిరుదుగా వినియోగించనవసరము లేదు. అట్లు వినియోగించిన యెడల దాని ప్రయోజనమును కోల్పోయినదగును. గొప్పతనముతో అధికారమును సంపాదించాలనెడి అభిలాషను యేసు ఖండించెను (మత్తయి 20:25-27).

5. పోప్ : బైబిలులో లేని బిరుదు యిది. దేవుడు గాని, క్రీస్తు గాని, వాక్యముగాని ఎవడైనా ఒక మానవుడు భూమిపై సంఘ శిరస్సుగా నుండవలెనని, అతడు పోప్ అను బిరుదును ధరించవలెనని బోధించుట లేదు. అది దేవుని సంబంధమైనది కాదు. క్రీస్తే సంఘము నకు శిరస్సై యున్నాడని వాక్యము చెప్పుచున్నది (కొలస్స 1:18 ఎఫెసీ 1:22, 23). ఒక మానవుని సంఘ శిరస్సుగా నియమించిన యెడల క్రీస్తు జీవించుట లేదుగాని మరణించెనని యర్థము !

పైన చెప్పబడిన బిరుదులేగాక, వేలకొలది ఉన్న - అట్టి బిరుదులన్నిటిని లేఖనములు నిషేధించుచున్నవి. దేవుని తల్లి, ప్రీస్టు, బిషప్, ఆర్చిబిషప్, ప్రెసిడెంట్, పాస్టర్ ఇన్‌చార్జ్ మొదలగునవన్నియును నిషేధింపబడినవి. ఈ బిరుదులన్నియును దేవుని అనుమతి లేకుండగనే మానవులు కల్పించుకొనినవి. ప్రజలు ఈ సంగతి ఎందుకు గ్రహించుట లేదు ? దేవని చిత్తమునకు వ్యతిరేకముగా ఎందుకు నడుచుకొనవలెను మానవులు దేవుని కంటె ఎక్కువ ఘనతను కోరుటలో ఇట్లు అవిధేయత చూపుచు దేవునిపై తిరుగుబాటు చేయుచున్నారు.

క్రైస్తవలోకము ఎందుకు విభజింపబడి యున్నది ? ఇది ఒక కారణము. ఐక్యత కొరకు సామాన్య మతబోధకుడు ఈ బిరుదులను పరిత్యజించ గలడని నీవనుకొనుచున్నావా ? అనేకులు అట్లు చేయరు. వారికున్న గర్వము చాలా ఎక్కువ. తమ్మును తామే ఎక్కువగా వారు

ప్రేమించుకొనుచున్నారు. దీనిని చదువుచున్న ప్రతి మత నాయకుడు తాను ధరించిన బిరుదులను వెంటనే వదిలి వేయుననెడి ఉద్దశంతో దీనిని వ్రాయుటలేదు. వారట్లు చేయలేరని నేనెరుగుదును. అయితే ఈ అంశముపై నున్న దోషమును తొలగించి సత్యమును తెలియని వారికి చూపించుటకిది వ్రాయబడెను. ఈ సంగతులను గూర్చి ఏమియు ఆలోచించకుండగనే నీ జీవితమును నీవు గడిపివేయు చుండవచ్చును. వాక్య ప్రకారము లేని ఈ బిరుదులనుపయోగించుచు మొదటి నుండి చివరకు గ్రుడ్డి వారి వెనుక గ్రుడ్డితనముగా వెంబడించుచుండవచ్చును. అందువలన నీవు సామాన్య సభ్యుడ వనియు (Laity), వారు యాజకులనియు (Clergy) అని అనుకొనవచ్చును. ఇట్లున్న స్థానభేదములు కూడ వాక్యములో లేనివే. నీవు చేయుచున్న దానిని గూర్చి మెళకువ కలిగి యుండుము. నా మాటలు నీవు నమ్మనవుసరము లేదు గాని బైబిలు నందు పరీక్షించుము. అందు రెవరెండ్ పేతురు అనిగాని, డాక్టర్ పౌలు అనిగాని, పాస్టర్ యోహాను అని గాని వ్రాసియున్నదేమో కనుగొనుము. సువార్త బోధించువాడెన్నడైనను ఫాదర్ అని గాని, పోప్ అనిగాని పిలువబడెనేమో చూడుము. Clergy మరియు Laity అను పదములు వాక్యమునందున్నవేమో గమనించుము. అట్లు చూచిన యెడల నీవు సత్యమును తప్పక కనుగొందువు.

అయితే ఆనాడు క్రైస్తవ నాయకులు ఏమని పిలువబడిరి ? బోధకులు, ఉపదేశకులు, సువార్తికులు, పెద్దలు, క్రైస్తవులు, సహోదరులు అని పిలువబడిరి. ప్రభువు సంఘమయితే క్రీస్తు నామమును ధరించెను. వాక్య ప్రకారము నడువగలిగినప్పుడు దానికి వ్యతిరేకముగా ఉండనవుసరము లేదు. సత్యమును అవలంభించ

గలిగినప్పుడు అసత్యమును వెంబడించవద్దు. ప్రభువు యిచ్చిన నామములను, బిరుదులను మాత్రమే ధరించుదము. అప్పుడు మాత్రమే మనము సరిగయుండగలము.

# 34. స్వతంత్ర బోధకులు మరియు సంఘములు

( Independent Preachers and Churches)

స్వతంత్ర బోధకులు, సంఘములు అనేకములున్నవి. వీరిలో అనేకులు మతశాఖ (డినామినేషన్) లవారు. మిగిలిన వారందరు స్వతంత్రులమని చెప్పుకొనుచుందురు. దీనిని బట్టి వారి అభిప్రాయమేమి? ఏ మతశాఖకు చెందిన వారము మేము కాము అని వారి అభిప్రాయము. బహుశా ఒకప్పుడు చెందినవారై యుండవచ్చును. అయితే కొన్ని కారణముల వలన దానినుండి విడిపోయినవారైరి.

అనేకసార్లు డినామినేషన్‌లలో సిద్ధాంతరీత్యా భేదాభిప్రాయములు వచ్చును. లేదా వ్యక్తిగత పోరాటములు చెలరేగవచ్చును. అందున్న కొందరు వ్యక్తులు వేరొక క్రొత్తపనిని ప్రారంభించుటకు దాని నుండి విడిపోయి ఉండవచ్చును. కొన్నిసార్లు డినామినేషన్ల యొక్క బోధల నుండి, ఆచారముల నుండి దూరముగా నుండు నిమిత్తము స్వతంత్రు లగుట కూడ జరుగును. తరువాత ఏ గుంపుకు చెందకుండగ, వారి పనులకు పోగుచేయుచున్న చందాలకు ఎవరికి లెక్క అప్పజెప్ప నవసరం లేకుండ యుండు నిమిత్తము స్వతంత్రముగా పనిని ప్రారంభించి దానిని నడిపించి కంట్రోలులో పెట్టుకొని దాని ద్వారా ధనార్జనను చేయువారున్నారు.

ప్రత్యేకముగా ఇండియాలో స్వతంత్ర బోధకులు, సంఘములు అనేకములున్నవి. ప్రతివాడు సంపూర్ణ సువార్తికునిగా నుండగోరు చున్నాడు. ప్రతి సువార్తికుడు తన సొంతగుంపును పోగు చేసికొను చున్నాడు. వారు ఇతర సువార్తికులో కలసి పనిచేయలేరు. అనేకసార్లు

వారు కేవలము వేతమునకై తెచ్చి పెట్టుకొన్నవారు. ఈ పరిస్థితిని కేవలము "క్రైస్తవ్యములోనే" కాదు. అన్నిరకాలైన మతములలోను ఇది ఉన్నది. గురువులమని చెప్పుకొనువారి సంగతి ఆలోచించుము. "బాబా"లమని అవతరించిన వారి సంగతి ఆలోచించుము. ప్రతివాడు తన అనుచరులను నడిపించుటకు ప్రయత్నించుచున్నాడు. మానవుడు త్వరలో సులభముగా మోసగింపబడుచున్నాడు. నిజానికి మోసగించ బడాలనే కోరుకొనుచున్నట్లుగ పడుచున్నది.

బహుశ ఇది నీకు ఆశ్చర్యమును కలిగించవచ్చును. బైబిలునందు స్వతంత్ర సంఘములను గూర్చి గాని బోధకులను గూర్చి గాని కనుగొన లేము అని నీవెరుగుదువా? డినామినేషన్లను గూర్చి దేవుని వాక్యమందు అసలే లేదు. భేదములను పుట్టించువారిని గూర్చి అందు చదువగలము. అట్టి వారు యేసుక్రీస్తు ప్రభువుని సేవించువారు కారు. గనుక వారిని కనిపెట్టి వారినుండి తొలగిపోవలెనని బైబిలు బోధించు చున్నది. అబద్ధ బోధకులు, అబద్ధ ప్రవక్తలు, జీతగాళ్ళు మొదలగు వారిని గూర్చి మనము చదువగలము. వారు నాశనమునకే పాత్రులు (2 పేతురు 2:1 1 యోహాను 4:1 యోహాను 10:12, 13).

పౌలు, పేతురు మొదలగు సువార్తికులు, బోధకులు స్వతంత్రులు అని ఎన్నడును చెప్పబడలేదు. వారు ఒకరినొకరు ఎదిరించలేదు. ఒకరికి వ్యతిరేకముగా మరొకరు చేయలేదు. వారిలో పోటీలు లేవు. కాని వారు కలసి పనిచేసిరి, కలసి ఆనందించిరి, కలిసి శ్రమల ననుభవించిరి (అపొ.కా. 2:8 1 కొరింథీ 12:26).

పేతురుకు ఒక సంఘము, పౌలుకు ఒక సంఘము, యోహానుకు ఇంకొక సంఘము, యాకోబుకు మరొక సంఘమున్నట్లు మనము బైబిలు నందు కనుగొనలేము. అపొస్తలులు ఎవరును సంఘము

వారిద్దైనట్టు ఎన్నడును పలుకలేదు. మనము ప్రభువు సంఘమును గూర్చి చదువగలము. అంతే (మత్తయి 16:18 ఎఫెసీ 5:23).

వాక్యమును తరచి చూచిన యెడల ఒకే ఒక సంఘము ఉన్నదని నీవు గమనించగలవు (ఎఫెసీ 4:4 కొలస్స 1:18). అది క్రీస్తు సంఘము. అందు అనేక స్థానిక సంఘములు ఉన్నవి. ప్రతి స్థానిక సంఘములోను వందలకొలది సభ్యులుండిరి. ప్రతి స్థానిక సంఘము దాని నడిపింపులో అది స్వతంత్రము కలిగియున్నను, ఆ సంఘములు ఒకదానికొకటి వ్యతిరేకముగ పనిచేయునవి కావు. కాని అవి ఒకదానితో నొకటి సహవాసము కలిగియున్నవి. ప్రభువు పని కొనసాగింపబడుటకు అవి కలసి పనిచేయును.

ఒక సంఘముగా గాని, సభ్యునిగాగాని స్వతంత్రుడవగుటలో నిన్ను నీవు ప్రభువునుండియు, ఆయన సంఘము నుండియు స్వతంత్రత కోరుచున్నట్లగును. గనుక దేవునితో పోటికి వచ్చినవానివలె నీవుందువు. దానిని బట్టి నీవు ఆయనతో నుండుటకంటె, ఆయనకు వ్యతిరేకముగ నుందువు. ఆయన కొరకు పనిచేయుట కంటె ఆయన నెదిరించిన వాడవగుదువు (మత్తయి 12:30). నీకు కావలసినది ఇదేనా ? నీ జీవనోపాధి ఇదేనా ? నీవు చేయుపనిని బట్టి దీర్ఘముగ ఆలోచించుకొని, అవుసరమైన చోట మార్పులు చేయుట అత్యవసరము.

నీవు స్వతంత్రుడవై పనిచేయుట దేవునికి ఇష్టముకాదు గాని నీవు ఆయనకు లోబడి క్రైస్తవుడవు కావలెనని ఆయన కోరుచున్నాడు. క్రైస్తవులు ఇండిపెండెంట్లు ఎట్లు కారో అట్లే ఇండిపెండెంట్లు క్రైస్తవులు కానేరరు. నీవు మతశాఖలకు వ్యతిరేకుడవైతే ఇంకొక శాఖను నెలకొల్పి వారిలో చేరవద్దు. కాని ప్రభువు సంఘ సభ్యుడవు కమ్ము. నీవు

బోధించాలనికోరిన యెడల బోధించుము గాని సత్యమునే బోధించుము (2 తిమో 4:2).

నీకు నీవే నడిపించుకొనుటకు ఒక క్రైస్తవ సంస్థను స్థాపించుటకు, దానిలో సభ్యులను చేర్చుటకు ఎవరును నీకు అధికారము ఇయ్యలేదు. నీ సంస్థ ఇండిపెండెంట్ అయితే కావవచ్చును, కాని అది అంతే. దాని మూలముగా నీవును, నిన్ను వెంబడించు వారును నాశనమగుదురు.

నీవు బైబిలు తట్టు తిరుగుము. పవిత్రమైన క్రొత్త నిబంధన క్రైస్తవ్యము చేపట్టుము. దేవుని యందు విశ్వసించి, పాపముల విషయమై మారుమనస్సు పొంది, క్రీస్తును ఒప్పుకొని పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొంది ప్రభువునకు లోబడుము (మార్కు 16:15, 16 అపొ.కా. 2:38). అప్పుడు ప్రభువు నిన్ను రక్షించి తన సంఘముతో చేర్చును (అపొ.కా. 2:47 20:28). అప్పుడు నీవు డినామినేషన్ వాడవు కాదు గాని, క్రైస్తవుడవగుదువు (1 పేతురు 4:16). క్రైస్తవుడవై దేవుని వాక్యమును బోధించి, ఉపదేశించి, అనేకులను నీవలె క్రీస్తు నొద్దకు నడిపించుము. అప్పుడు మాత్రమే నీవు సరిగనుందువు. అప్పుడు మాత్రమే నీవు స్వతంత్రుడవగుదువు.

# 35. క్రీస్తు రెండవ రాకడ

## ( The Second Coming of Christ )

క్రీస్తు ఒకసారి వచ్చెను గాని ఆయన మరల వచ్చుచున్నాడు. ఆయన మొదట వచ్చెను. భవిష్యత్తులో ఆయన రాబోవుచున్నాడు. మొదటిసారి ఆయన శరీరధారియై వచ్చెను. రెండవసారి మహిమ గల ప్రభువు వలె వచ్చును. ముందు ఆయన మానవ రక్షకునిగా వచ్చెను. ఇప్పుడు మానవ తీర్పరివలె మరల వచ్చుచున్నాడు. ఆయన ఎంత నిజముగా తిరిగి వెళ్ళెనో అంత నిజముగ తిరిగివచ్చును.

ప్రభువు తన శిష్యుల యొద్దనుండి వెళ్ళిపోక ముందు వారికి ఇట్లు వాగ్దానము చేసెను : "నేన వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేను ఉండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నా యొద్ద నుండుటకు మిమ్మును తీసికొని పోవుదును" (యోహాను 14:3). ఆయన "ఈ మాటలు చెప్పి వారు చూచుచుండగా ఆయన ఆరోహణ మాయెను. అప్పుడు వారి కన్నులకు కనబడకుండ ఒక మేఘము ఆయనను కొనిపోయెను. ఆయన వెళ్ళుచుండగ వారు ఆకాశమువైపు తేరి చూచు చుండిరి. ఇదగో తెల్లని వస్త్రములు ధరించుకొనిన యిద్దరు మనుష్యులు వారి యొద్ద నిలిచి గలిలయ మనుష్యులారా మీరెందుకు నిలచి ఆకాశము వైపు చూచుచున్నారు ? మీ యొద్ద నుండి పరలోకమునకు చేర్చుకొనుడి యీ యేసే, ఏరీతిగా పరలోకమునకు వెళ్ళుట మీరు చూచితిరో ఆరీతిగానే ఆయన తిరిగి వచ్చునని వారితో చెప్పిరి" (అపొ.కా. 1:9-11).

క్రీస్తు తిరిగి వచ్చునని, వచ్చి తన శిష్యులతో కూడ యెరూషలేము నుండి వెయ్యేండ్ల పరిపాలన కొనసాగించునని చెప్పువారున్నారు.

అయితే బైబిలు అట్లు బోధించుట లేదు. యేసు పరలోకమునకు ఏరీతిగా వెళ్ళెనో, ఆ రీతిగానే ఆయన వచ్చును. అయితే క్రీస్తు తన పాదములను మరల భూమిపై మోపునని వాక్యమందు ఎక్కడను వ్రాయబడలేదు. కాని క్రీస్తు మేఘరూఢుడై వచ్చునని, ప్రభువును ఎదుర్కొనుటకు మనము ఆకాశ మండలమునకు మేఘముల యందు కొనిపోబడుదుమని వాక్యము బోధించుచున్నది. 1 థెస్సలోని కయులకు 4:13-18ని ఇప్పుడు చదువుము: "సహోదరులారా, నిరీక్షణలేని యితరుల వలె మీరు దుఃఖపడకుండు నిమిత్తము నిద్రించుచున్న వారిని గూర్చి మీకు తెలియకుండుట మా కిష్టము లేదు. యేసు మృతిపొంది తిరిగి లేచెనని మనము నమ్మిన యెడల అదే ప్రకారము యేసునందు నిద్రించినవారిని దేవుడాయనతో కూడ వెంటబెట్టుకొని వచ్చును. మేము ప్రభువు మాటను బట్టి మీతో చెప్పునదేమనగా, ప్రభువు రాకడవరకు సజీవులమై నిలిచి యుండు మనము నిద్రించిన వారికంటె ముందుగా ఆయన సన్నిధి చేరము. ఆర్భాటముతోను, ప్రధాన దూత శబ్ధముతోను, దేవుని బూరతోను పరలోము నుండి ప్రభువు దిగివచ్చును క్రీస్తు నందుండి మృతులైనవారు మొదట లేతురు. ఆ మీదట సజీవులమై నిలిచియుండు మనము వారితో కూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశమండలమునకు మేఘముల మీద కొనిపోబడుదుము. కాగా మనము సదాకాలము ప్రభువుతో కూడ ఉందుము. కాబట్టి మీరు ఈ మాటలచేత ఒకని నొకడు ఆదరించుకొనుడి."

క్రీస్తు మరల ఎప్పుడువచ్చును ? ఆయన రెండవ రాకడను గూర్చి అనేకులు జోస్యము చెప్పిరి. ఆయన రాకడ సమయమును బైబిలు దృష్టాంత రూపకముగ బయలుపరచెననియు, దాని నిగూఢ

రహస్యములను అర్థము చేసికొన గలిగితిమనియు, అందుచే ప్రభువు రాకడ సమయమెప్పుడో ఖచ్చితముగా చెప్పగలమనియు కొందరు భావించిరి. అట్టి ప్రజలందరు తమ్మును తామే హేళన చేసికొనిరి. ఇంత జరిగినను ఆయన ఫలాన సమయమందు వచ్చునని చెప్పువారింకను ఉన్నారు. వారు కూడ వంచకులని గుర్తించబడుదురు. ఈలోగా వారు పేరును సంపాదించుకొందురు. కొంతమంది వారిని నమ్మి మోసగించబడుదురు. ఇది విచారకరము. అయితే ప్రభుని రాకడ ఎప్పుడో ఎరిగిన మానవుడెవడును ఈ భూమి మీద లేడు. మనము అట్లు ఎందుకు చెప్పగలము ? ఏలయనగా ప్రభువే ఇట్లు చెప్పెను : "అయితే ఆ దినము గూర్చియు, ఆ ఘడియను గూర్చియు తండ్రి మాత్రమే యెరుగును గాని యేమనుష్యుడైనను, పరలోకమందలి దూతలైనను ఎరుగరు" (మత్తయి 24:36). దూతలు గాని, క్రీస్తు గాని ఎరుగకుండిన యెడల తండ్రి ఒకడు మాత్రమే ఎరిగియుండిన యెడల నేనుగాని, మరింకొకడెవడైనను గాని ప్రభువు దినమెప్పుడు వచ్చునో ఎట్లు చెప్పగలము ? చెప్పలేము.

ప్రభువు దొంగవచ్చినట్లు వచ్చునని వాక్యము చెప్పుచున్నది. ఆయన దొంగయని కాదుగాని, దొంగవలె ఆయన వచ్చును. అంటే ఆయన అనుకొనని సమయమున వచ్చును. "రాత్రివేళ దొంగ ఏలాగువచ్చునో, ఆలాగే ప్రభువు దినము వచ్చును అని మీకు బాగుగా తెలియును. లోకులు నెమ్మదిగా ఉన్నది. భయమేమియు లేదని చెప్పుకొనుచుండగా, గర్భిణీ స్త్రీకి ప్రసవవేదన వచ్చునట్లు వారికి ఆకస్మికముగా నాశనము తటస్థించును గనుక వారెంత మాత్రము తప్పించుకొనలేరు. సహోదరులారా, ఆ దినము దొంగవలె మీ మీదికి వచ్చుటకు మీరు చీకటిలో ఉన్న వారు కారు" (1 థెస్స 5:2-4).

ప్రభువు రెండవ రాకడను గూర్చి మనకు తెలిసిన సంగతులు మరికొన్ని ఉన్నవి. ఉదా : అందరు ఆయనను చూచెదరు. "ఇదిగో ఆయన మేఘారూఢుడై వచ్చుచున్నాడు. ప్రతి నేత్రము ఆయనను చూచును...." (ప్రకటన 1:7). తరువాత ఆకాశము, భూమియు, దానిమీదున్న కృత్యములన్నియు కాలిపోవును : "అయితే ప్రభువు దినము దొంగవచ్చినట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహాధ్వనితో గతించిపోవును. పంచభూతములు మిక్కుటమైన వేండ్రముతో లయమై పోవును. భూమియును, దాని మీదనున్న కృత్యములును కాలిపోవును" (2 పేతురు 3:10). ప్రభువు ప్రతిదండన చేయుటకు వచ్చుచున్నాడు. "ప్రభువైన యేసు తన ప్రభావమును కనపరచు దూతలతో కూడ పరలోకము నుండి అగ్ని జ్వాలలో ప్రత్యక్షమై దేవుని నెరుగని వారికిని, మన ప్రభువైన యేసు సువార్తకు లోబడని వారికిని ప్రతిదండన చేయునప్పుడు, మిమ్మును శ్రమపరచువారికి శ్రమయు, శ్రమ పొందుచున్న మీకు విశ్రాంతియు అనుగ్రహించుట దేవుని న్యాయమే" (2 థెస్స 1:7-9).

ప్రభువు మరల వచ్చునప్పుడు నీతిమంతులు, అనీతిమంతులు లేపబడుదురు. మృతుల పునరుత్థానము జరుగును (యోహాను 5:28, 29). ఆయన తన పెండ్లి కుమార్తె కొరకు లేదా సంఘము కొరకు వచ్చుచున్నాడు. అది దేవుని రాజ్యమని కూడ పిలువబడెను. దాని నుండి ప్రభువు దూతలు దుర్నీతి పరులను సమకూర్చి అగ్ని గుండములో పడవేయుదురు (ఎఫెసీ 5:27 మత్తయి 13:41-43). ఆఖరిగ క్రీస్తు ఈలోకమునకు తీర్పు తీర్చుటకు రాబోవుచున్నాడు (మత్తయి 25 అపొ.కా. 17:31: 2 కొరింథీ 5:10).

అవును, ప్రభువు తప్పక వచ్చుచున్నాడు. ఎప్పుడో మనమెరుగము,

గాని ఆయన వచ్చుచున్నాడు. నీవు సిద్ధముగా నున్నావా? నీవు ఆయత్త పడవలసిన దినము ఈనాడే. రేపు ఆలస్యమగును. మత్తయి 24:36-39 లూకా 12:14-48లను చదువుము.

" క్రీస్తు సంఘములన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి "
(రోమా 16:16)

12th Reprint: 2022